అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 17-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 168 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

ఢిల్లీలో నీటి యుద్ధం

చోద్యం చూస్తున్న కేంద్రం

- నీటిని విడుదల చేయని హర్యానా
- బీజేపీ అత్యుత్సాహం
- జల్‌బోర్డు కార్యాలయంపై దాడి
- కేంద్రం జోక్యం చేసుకోవాలి : ఆప్




నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలో నీటి సంక్షోభం తీవ్ర రూపు దాల్చింది. ఎగువన ఉన్న హర్యానా.. ఢిల్లీకి నీటిని విడుదల చేయకపోవడంతో ఢిల్లీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే బీజేపీ అత్యుత్సాహంతో యుద్ధాన్ని తలపించే పరిణామాలు చోటు చేసుకున్నాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, ప్రధాన నీటి పైప్‌లైన్లకు పోలీసులు రక్షణ కల్పించాలని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి అతిషి కోరారు. నీటి ఎద్దడిపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఢిల్లీ జల్ బోర్డు కార్యాలయం వద్ద బీజేపీ చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా ...13లో

కమిషన్ లేవనెత్తిన అంశాలకు

కేసీఆర్ వివరణివ్వాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజకీయ కక్ష సాధింపు కోసమే విద్యుత్తు కొనుగోళ్ళపై విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేశారనీ, విచారణ పూర్తికాకుండానే కమిషన్ మీడియా సమావేశంలో మాట్లాడిందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎదురుదాడికి దిగడం సహేతుకం కాదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణ పారదర్శకంగా లేకపోవటంతో తాను కమిషన్ ముందు హాజరుకాననీ, కమిషన్ చైర్మెన్ స్వచ్ఛందంగా తప్పుకోవాలని కేసీఆర్ చెప్పటం ఆశ్చర్యంగా ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో జరిగిన విద్యుత్తు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంలో జరిగిన అవకతవకలను కేసీఆర్ సమర్థించుకుంటున్నారని తెలిపారు. మార్కెట్‌లో తక్కువ రేటుకు విద్యుత్తు కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నప్పటికీ ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకోవడంపై ఆనాడే విమర్శలు వచ్చాయని గుర్తు చేశారు. దీనిపై ప్రజలకు అనేక అనుమానాలున్నాయని తెలిపారు. వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకత్వంపై ఉన్నదని గుర్తు చేశారు. అవసరమైతే విచారణ చేసుకోండి అని గతంలో ప్రకటించిన కేసీఆర్ ఇప్పుడు ప్రభుత్వం కుట్రపూరితంగా విచారణ చేయిస్తున్నదని ఆరోపించడం అవకాశవాదమేనని విమర్శించారు. కమిషన్ లేవనెత్తిన అన్ని అంశాలపై, ప్రజలలో నెలకొన్న అనుమానాలకు పూర్తి వివరణ ఇచ్చి కేసీఆర్ తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవాలని సూచించారు. అదే సందర్భంలో విచారణ పూర్తి కాకుండానే కమిషన్ మీడియా సమావేశం నిర్వహించటం కూడా సరైంది కాదని తెలిపారు.

మెదక్ ఘర్షణలపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి : తమ్మినేని

వివరాలు 13లో

మత్తులో యువత చిత్తు

పెరుగుతున్న గంజాయి కేసులు... దక్షిణాదిన రాష్ట్రంలోనే అత్యధిక వినియోగం

- కరోనా కాలం నుంచి వ్యాప్తి అధికం
- పట్టుబడుతున్నా విచ్చలవిడి రవాణా
- మత్తులో యువత.. రోజూ ఏదో ఒక దుర్ఘటన



యువత గంజాయి మత్తులో జోగుతోంది. భారీగా గంజాయి నిల్వలు పట్టుబడుతున్నా.. విచ్చలవిడి రవాణా కొనసాగుతూనే ఉంది. కోవిడ్-19 కాలం నుంచి ఏటేటా గంజాయి కేసులు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ మత్తులో రోజుకు ఐదారు దుర్ఘటనలైనా జరుగుతున్నాయి. గంజాయికి బానికావొద్దని మందలించినందుకు దాదాపు రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో ఓ యువకుడు కన్న తండ్రినే చంపేశాడు. ఖమ్మంలో కొద్దిరోజుల క్రితం ఓ ఇద్దరు యువకులు గంజాయి మత్తులో తల్లి నిద్రిస్తుండగా ఆమె చెవిని కోసి తిన్నారు. ఇలాంటి ఘటనలు నిత్యం అనేకం చోటు చేసుకుంటున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో డ్రగ్స్ వినియోగంలో తెలంగాణ ప్రథమస్థానంలో ఉంది. రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా డ్రగ్స్‌ను సేవిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. 13 ఏండ్లలోపు పిల్లలు కూడా గంజాయి సేవిస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొంది. దీనిపై ప్రభుత్వం ఫోకస్ చేసినా డ్రగ్స్, గంజాయి మాత్రం కంట్రోల్ తగ్గడం లేదు.



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు గంజాయి, డ్రగ్స్ కంట్రోల్‌కు ప్రయత్నాలు చేస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావట్లేదు. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్కడి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నార్కోటిక్స్ బ్యూరో పనితీరుపై ఆరా తీశారు. డ్రగ్స్ నియంత్రణకు ...13లో

కరోనా కాలం నుంచి గంజాయి కేసులు అధికం

కరోనా కాలం నుంచి గంజాయి కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ఐదేండ్ల క్రితంతో పోల్చితే ఒక్క ఖమ్మం జిల్లాలోనే మూడు, నాలుగు రెట్లు అధికంగా కేసులు నమోదవుతున్నాయి. ఖమ్మం పోలీసు కమిషనర్‌గా సునీల్‌దత్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గంజాయిపై స్పెషల్ ఫోకస్ చేశారు. ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి రాత్రిళ్లు వివిధ మార్గాల్లో గంజాయి ఎక్కువగా సరఫరా అవుతున్న దృష్ట్యా చర్యలు చేపట్టారు. రాత్రి పది గంటలు దాటిన తర్వాత తోపుడు బండ్లు, టిఫిన్ సెంటర్లు, వివిధ దుకాణాలను అడ్డాగా చేసుకొని గంజాయి, డ్రగ్స్ చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాత్రి 10.30 గంటల తర్వాత పోలీసు నిఘాను కొద్దిరోజులుగా కఠినతరం చేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

ముస్లిం సోదరులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు



వివరాలు 2లో



కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాపై

రాజీ లేదు

ఎగువ రాష్ట్రాలతో వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకుంటాం : న్యాయ, సాంకేతిక నిపుణులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాపై రాజీ ప్రసక్తే లేదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కృష్ణా జలాల వివాదాలకు సంబంధించి అంతర్ రాష్ట్ర సమస్యల పురోగతిని న్యాయ నిపుణులు సీ.ఎస్.వైద్యనాథన్, వి.రవీందర్ రావు, ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రశాంత్ వి పాటిల్‌తో ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు. కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్ -2 (కేడబ్ల్యూడీటీ), సుప్రీంకోర్టు ముందు నడుస్తున్న కేసుల స్థితిగతుల్ని న్యాయవాదులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో రాష్ట్ర వాటాను ...2లో

నీట్ లీకేజీ పెద్ద స్కామ్

రూ.30 లక్షల చొప్పున పేపర్ అమ్మకం

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- పరీక్షను మళ్లీ నిర్వహించాలి
- మోడీ పాలనలో విద్యా, వైద్యంతో పాటు అన్ని వ్యవస్థలూ ధ్వంసం
- విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త పోరాటాలు : ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు వీ.పీ. సాను
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ప్లీనం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ పెద్ద స్కామ్ అనీ, ఒక్కో అభ్యర్థికి రూ.30 లక్షల చొప్పున పేపర్‌ను అమ్ముకున్నారనే వార్తలొస్తున్నాయని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) అఖిల భారత అధ్యక్షులు వి.పి.సాను విమర్శించారు. దీనిపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పరీక్షను మళ్లీ నిర్వహించాలని కోరారు. 24 లక్షల మంది విద్యార్థులకు న్యాయం దక్కే వరకూ ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని నొక్కి చెప్పారు. ఆదివారం హైదరాబాద్ లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనం జరిగింది. దీనికి ప్రారంభ సూచికగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ప్లీనానికి ...13లో

బడి ఎలా నడపాలి?

బడిబాటకు ఇచ్చిన వెయ్యి తప్ప.. ఖాతాల్లో జీరో బ్యాలెన్స్

- రిజిస్టర్లు, డస్టర్లు, చాక్‌పీస్‌లు, ఇతర కొనుగోళ్లకు ఇబ్బందులు
- ప్రారంభంలోనే సర్కారు బడులను వెంటాడుతున్న నిధుల కొరత
- స్కూల్ గ్రాంట్స్ ఆల్యసంగా ఇస్తే.. పారదర్శకత లోపించే అవకాశం
- ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులే సర్దుబాటు చేయాల్సిన దుస్థితి

నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన విద్యా సంవత్సరం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటతో ఉత్సాహంగా ప్రారంభం అయింది. బడిబాట కార్యక్రమాలతో సర్కారు బడుల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్నది. కాగా, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు ఇంకా పూర్తి కాలేదు. పాఠశాలలు ప్రారంభమై.. క్లాసులు నడుస్తున్నప్పటికీ.. నిధుల కొరత వెంటాడుతుంది. స్కూల్స్‌కు ఇవ్వాల్సిన గ్రాంట్స్ ఇవ్వకపోవడంతో రిజిస్టర్‌లు, స్టేషనరీ లాంటి వస్తువులు కొనేందుకు ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక స్కూల్ గ్రాంట్స్ ఆలస్యంగా ఇవ్వడం వలన పారదర్శకత లోపించే అవకాశముంది. విద్యా సంవత్సరం ప్రారంభంలో ఇవ్వడం వల్ల అవసరమైన వస్తువులను కొని పాఠశాలను విజయవంతంగా నడిపే అవకాశం ఉంటుంది. నూతన ప్రభుత్వం దీనిపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రభుత్వ పాఠశాలల్లో 1-15 మంది విద్యార్థులుంటే.. రూ.12,500 మంజూరు చేస్తారు. 16 నుంచి 100 లోపు ఉంటే రూ.25 వేలు, 100 నుంచి 250 మందిలోపు ఉంటే రూ.50 వేలు, 251 నుంచి వెయ్యి లోపు ఉంటే రూ.75 వేలు, వెయ్యికి పైగా ఉంటే రూ.లక్ష వరకు నిధులు వస్తాయి. ఈ నిధులతో పాఠశాలల్లో చాక్‌పీసులు, బోర్డుల మరమ్మతులు, డస్టర్లు, హాజరు పట్టిక రిజిస్టర్లు, స్టేషనరీ, విద్యుత్తు, సామగ్రి బిల్లులు, జనవరి, ఆగస్టులో జెండా వందనం కార్యక్రమ నిర్వహణ ఖర్చులు, విద్యార్థులకు బహుమతులు, ఇలా పాఠశాలకు అవసరమైనవి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం స్కూల్ గ్రాంట్లను ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలో పాఠశాలల ఎస్ఎంసీ ఖాతాల్లో జమ చేస్తోంది. మూడు విడుతల్లో అందజేసే ఈ నిధులను జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, ప్రాథమిక బడుల నిర్వహణకు ఉపయోగిస్తారు. ప్రస్తుతం ఎస్ఎంసీల రద్దుతో హెడ్‌మాస్టరు, ఒక సీనియర్ ఉపాధ్యాయులు కలిసి అవసరమైన ఫండ్స్ డ్రా చేసేందుకు అవకాశమిచ్చారు. కానీ పాఠశాలలు ప్రారంభమై.. క్లాసులు జరుగుతున్నా నేటికీ పాఠశాల గ్రాంట్స్ విడుదల చేయలేకపోవడంతో ప్రభుత్వ స్కూళ్లను నిధులు కొరత వెంటాడుతోంది.

అరకొర వసతులతోనే విద్యార్థుల కాలం వెళ్లదీత

ఈ విద్య సంవత్సరం బడిబాట కార్యక్రమం కోసం స్కూల్ అకౌంట్ ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి రూపాయలు జమ చేసింది. దీంతో బడిబాటకు కావాల్సిన కరపత్రాలు, బ్యానర్లకు వాటిని హెడ్‌మాస్టర్లు ...6లో

కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాపై రాజీ లేదు

(మొదటిపేజీ తరువాయి)

సాధించుకునేందుకు ఎలా వెళ్లాలనే అంశంపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2015లో ఆంధ్రప్రదేశ్‌తో కుదిరిన ఒప్పందం తాత్కాలికమేననీ, అది కేవలం ఆ ఏడాదికి సంబంధించినది మాత్రమేనని తెలిపారు. ఏక పక్షంగా కుదిరిన ఆ ఒప్పందాన్ని తెలంగాణ అంగీకరించబోదని స్పష్టం చేశారు. న్యాయస్థానాల్లో వివాదం తేలే వరకు 50:50 నిష్పత్తిని అడ్-హెూక్‌మెజర్‌గా సవరించాలని కేడబ్ల్యూడీటీ ముందు తమ వాదనలను బలంగా వినిపించాలని మంత్రి ఆదేశించారు. సుప్రీంకోర్టులో అవార్డు పెండింగ్‌లో ఉన్నందున ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్నాటకలతో సమస్యలను చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోనున్నట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న తెలంగాణ శాసనసభలో చేసిన తీర్మానం మేరకు కృష్ణా బేసిన్‌లోని ఏ ప్రాజెక్టును ఏపీకి అప్పగించబోమని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాల మేరకు కృష్ణా వాటా రక్షణకు న్యాయ నిపుణులు, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ (ఈద్ ఉల్ అజ్) పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాం ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం అస్సలామ్, అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి తన కుమారుడిని సైతం బలి ఇచ్చేందుకు సిద్ధం కావడాన్ని స్మరిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఈ పండుగ జరుపుకుంటున్నారని గుర్తు చేశారు. ప్రవక్తల అచంచలమైన దైవ భక్తి, త్యాగ నిరతికి ఈ పండుగ అద్దం పడుతుందని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవునిపై విశ్వాసంతో, సన్మార్గంలో జీవనం సాగించాలని ఈ పండుగ మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. తమకు ఉన్న దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని చాటి చెబుతోందని సీఎం అభిప్రాయపడ్డారు. ఇదిలా వుండగా మాజీ ఎంపీ వి. హనుమంతరావు జన్మదినాన్ని పురస్కరించుకుని సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సైకిల్‌పై తండ్రీ కూతుళ్ల చార్‌ధామ్ యాత్ర

- ఎనిమిదేండ్ల కూతురితో కలిసి ద్వారక, బద్రీనాథ్ క్షేత్రాలు సందర్శన



సూరత్ : గుజరాత్‌కు చెందిన తండ్రీకూతుళ్లు సైకిల్‌పై చార్‌ధామ్ యాత్రను కొనసాగిస్తున్నారు. తన ఎనిమిదేండ్ల కుమార్తె కంగర్ కష్ణతో కలిసి తండ్రి అశోక్ జీనా బాయ్ ద్వారక, బద్రీనాథ్ క్షేత్రాలను దర్శించుకున్నారు. త్వరలో నేపాల్‌లోని పశుపతినాథ్, రామేశ్వరంలోని శివుణ్ని దర్శించుకోనున్నట్లు తెలిపారు. అలాగే గుజరాత్‌లో అనాథ పిల్లలకు అండగా నిలుస్తూ, పేదలకు సాయం చేస్తున్న సామాజిక కార్యకర్త నితిన్ జానీ కోసం ప్రార్థించేందుకే ఈ యాత్ర చేపట్టినట్లు ఆయన తెలిపారు. సైకిల్‌పై గుజరాత్ నుంచి బయలుదేరిన వీరు దాదాపు 1,400 కి.మీ. ప్రయాణించి ఉత్తరాఖండ్‌కు చేరుకొన్నారు.

అనాథ శవాలకు హరియాణాకు చెందిన సతీశ్‌చోప్రా అంత్యక్రియలు

చండీగఢ్ : హరియాణాలోని ఫరీదాబాద్ జిల్లాకు చెందిన సతీశ్ చోప్రా సమాజ సేవ కోసం తన జీవితాన్నే అంకితం చేశాడు. సాటి మనుషులకు సాయం చేయాలనే తన సంకల్పానికి అడ్డుగా ఉంటుందని పెండ్లి చేసుకోవడం మానుకున్నాడు. నలభై ఏడేండ్ల వయస్సులో అంబులెన్సు సాయంతో పేదలకు వైద్యసేవలను అందిస్తున్నాడు. నిరుపేద, అనాథ మతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నాడు. ఎవరికి ఏ సాయం కావాలన్నా 24 గంటలూ సిద్ధంగా ఉండే ఆయన వైద్యం అవసరమైన వారిని స్వయంగా ఆస్పత్రికి తీసుకువెళతాడు. ఇందుకోసం తనే ఓ అంబులెన్సు కొన్నాడు.

మురికివాడల్లో నివసించే పిల్లలకు పుస్తకాలు, చెప్పులు, దుస్తులు పంపిణీ చేస్తుంటాడు. ఇందుకు సంబంధించి కొన్ని వివరాలు ఆయన మాటల్లోనే.. "ఆర్థిక ఇబ్బందులు రాకూడదని స్నేహితులతో కలిసి ఒక బందాన్ని ఏర్పాటుచేశా. గతంలో ఎక్కడైనా పెళ్లి వేడుకల్లో మిగిలిపోయిన భోజనం ఉందని తెలిస్తే.. నేనే అక్కడికి వెళ్లి దాన్ని తీసుకువచ్చి పేదలకు పంచేవాడిని. ఇప్పుడు ప్రజలే ఫోను చేసి చెబుతున్నారు" అని సతీశ్ తెలిపారు.

నీట్ స్కామ్ అనడానికి గుజరాత్ ఎఫ్ఐఆర్ నిదర్శనం : స్టాలిన్

చెన్నై : ప్రతిభకు కొలమానంగా ఉండాల్సిప నీట్ పరీక్ష సమాజంలో ప్రజలందరిపై ప్రభావం చూపే స్కామ్‌కు వేదికని పదేపదే రుజువైందని తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షులు ఎంకె స్టాలిన్ విమర్శించారు. నీట్ అక్రమాల్లో అనేకమంది ఉపాధ్యాయులు, కోచింగ్ సెంటర్ల ప్రమేయం ఉందని గుజరాత్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఈ పరీక్షలో జరగాల్సిన 'తక్షణావసరమైన వ్యవస్థాగత మార్పుల'ను ప్రస్తావిస్తుందని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'విద్యార్థులకు, సామాజిక న్యాయానికి, పేదలకు వ్యతిరేకమైన నీట్ వ్యవస్థను రక్షించడాన్ని కేంద్ర ప్రభుత్వం ఇకనైనా ఆపాలి' అని డిమాండ్ చేశారు. నీట్ చుట్టూ కొనసాగుతున్న వివాదాలు ప్రాథమికంగా ఉన్న అసమాన స్వభావాన్ని ఎత్తిచూపుతున్నాయని తెలిపారు. 'వేల సంవత్సరాలుగా విద్య నిరాకరించబడిన అణగారిన ప్రజల అభ్యున్నతి కోసం మనం మరిన్ని అవకాశాలను అందించాలి. దీనికి విరుద్ధంగా అటువంటి విద్యార్థుల అవకాశాలను నీట్ అడ్డుకుంటుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను కేంద్ర విద్యా మంత్రి సమర్థించినప్పటికీ అందుకు భిన్నమైన సంఘటనలు జరుగుతున్నాయి' అని స్టాలిన్ పేర్కొన్నారు.

తొమ్మిది మంది నీట్ అభ్యర్థులకు బీహార్ పోలీసుల నోటీసులు

న్యూఢిల్లీ : నీట్ పరీక్షా పత్రం లీక్‌కు సంబంధించిన కేసులో విచారణకు హాజరుకావాలని కోరుతూ తొమ్మిది మంది నీట్ యుజి అభ్యర్థులకు బీహార్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ విద్యార్థుల్లో రాష్ట్రానికి వెలుపల నివసిస్తున్న విద్యార్థులు కూడా ఉన్నారు. ఈ తొమ్మిది మంది విద్యార్థుల్లో ఏడుగురు బీహార్‌కు చెందిన వారు కాగా, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఒక విద్యార్థి, మహారాష్ట్రకు చెందిన ఒక విద్యార్థి ఉన్నారు. ఈ వివరాలను రాష్ట్ర డీఐజీ(ఆర్థిక నేరాల విభాగం) మనవిజిత్ సింగ్ ధిల్లాన్ విలేకరులకు వెల్లడించారు. కాగా, ఇప్పటికే నలుగురు అభ్యర్థులను బీహార్ పోలీసులు అరెస్టు చేశారు. మే 5న పరీక్ష జరగడానికి ఒక రోజు ముందే వీరికి నీట్ పరీక్షా పత్రం, జవాబులు అందాయనే ఆరోపణలతో వీరిని అరెస్టు చేశారు. మే 5న జరిగిన పరీక్షలో దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు పాల్గొన్నారు. అయితే ఈ పరీక్ష పేపర్ లీకయిందని, పరీక్షా నిర్వహణలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో బీహార్ పోలీసుల సిట్ దర్యాప్తు ప్రారంభించింది. ఇప్పటికే నలుగురు అభ్యర్థులతో సహా 13 మందిని బీహార్ పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు గుజరాత్ పోలీసులు కూడా ఇదే ఆరోపణలపై విచారణ ప్రారంభించారు. ఇప్పటికే ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు.





ఆర్టీసీకి 'మహాలక్ష్మి' డబ్బులు ఇవ్వాలి

- ప్రభుత్వం ఆ సొమ్మును బడ్జెట్‌లో కేటాయించాలి
- హయ్యర్ పెన్షన్‌పై ఆందోళనలు
- టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం డిమాండ్


నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ఆర్టీసీ రోజుకు రూ.15 కోట్ల ఆదాయం కోల్పోతున్నదనీ, ప్రభుత్వం ఆ డబ్బులను రాబోయే పూర్తి స్థాయి బడ్జెట్‌లో కేటాయించి, ప్రతినెలా చెల్లించాలని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) డిమాండ్ చేసింది. ఆదివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫెడరేషన్ అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షతన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సంఘం ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు మాట్లాడారు. ఆర్టీసీ దగ్గర నిధులు లేవనే పేరుతో ఇంతవరకు 2013 ఆర్పీఎస్ ఎరియర్స్ చెల్లించక పోవడం సరైంది కాదనీ, ఆ సొమ్ము వెంటనే చెల్లించాలని సమావేశం కోరింది. జూనియర్ అసిస్టెంట్ పోస్టుల పరీక్షలకు డ్రైవర్లను కూడా అనుమతించడంపై యాజమాన్యానికి ధన్యవాదములు తెలిపారు. కార్మికులపై పెరుగుతున్న వేధింపులు ఆపాలనీ, అవసరం అయిన సిబ్బందిని రిక్రూట్‌మెంట్ జరపాలని, నల్సాఫ్ట్ వల్ల వస్తున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు.

హైయ్యర్ పెన్షన్ సమస్యలపై ఆందోళనలు

హైయ్యర్ పెన్షన్ విషయంలో ఆర్పీఎఫ్‌సీ ద్వారా ఆటంకాలు సృష్టించడం మానుకోవాలనీ, అర్హత కలిగిన అందరికి చట్టం ప్రకారం పెన్షన్ చెల్లించాలని రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు సమావేశం విజ్ఞప్తి చేసింది. పెన్షన్ సమస్యలు కార్మికుల దృష్టికి తీసుకెళ్లేందుకు జులై మొదటి వారంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎస్‌డబ్ల్యూఎఫ్‌ల సంయుక్తాధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించాలనీ, జులై చివరి వారంలో "చలో పీఎఫ్ కమిషనర్" పిలుపు ఇవ్వడం ద్వారా ఆందోళన నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ వ్యవస్థాపక కార్యదర్శి వీ రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కేఎస్ రెడ్డి, ఏపీ రావు, బిక్షపతి గౌడ్, ఎమ్ ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శులు టీ ఎల్లయ్య, కోశాధికారి కే గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ నుంచి అకౌంట్స్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన గంగాధర్‌ను శాలువాతో సత్కరించారు.

జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రదాడులపై అమిత్‌షా సమీక్ష



శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో ఇటీవల ఉగ్రదాడుల ఘటనల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత వారంరోజుల వ్యవధిలోనే నాలుగు దాడి ఘటనలు జరగడం, అమర్‌నాథ్ యాత్రకు సమయం దగ్గరపడుతున్న క్రమంలో భద్రతా చర్యలపై అధికారులతో ఆయన దాదాపు ఐదుగంటల పాటు సమావేశమయ్యారు. ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడేందుకు ఉపయోగిస్తున్న సొరంగాలను గుర్తించాలని.. అదే సమయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిఘా వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. డ్రోన్ చొరబాట్లను సైతం సమర్థవంతంగా ఎదుర్కోవాలని చెప్పారు. సైన్యం, పారామిలిటరీ బలగాలు పరస్పర సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన స్పందించాలని షా సూచించారు. భద్రతాపరంగా అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, కాబోయే ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా, కేంద్ర నిఘా సంస్థ డైరెక్టర్ తపన్ దేకా, సిఆర్‌పిఎఫ్ డిజి అనీశ్ దయాళ్ సింగ్, బీఎస్ఎఫ్ డిజి నితిన్ అగర్వాల్, డీజీ పీఆర్ఆర్ స్వైన్ హాజరయ్యారు.

సంక్షేమ శాఖల్లో 581 పోస్టులు

పరీక్షల షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంక్షేమ శాఖల్లో 581 పోస్టుల భర్తీకి ప్రభుత్వం పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు టీజీపీఎస్‌సీ కార్యదర్శి నవీన్ నికోలస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికలు పూర్తి కావటంతోనే టీజీపీఎస్‌సీ ఈ ప్రక్రియకు సిద్ధమైంది. ఇటీవల గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించి ప్రాథమిక కీని విడుదల చేసిన అధికారులు.. తాజాగా రాష్ట్రంలోని గురుకులాల్లో పలు పోస్టుల భర్తీకి పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా శిశు సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాల్లో 581 మంది అధికారులు, పిల్లల సంరక్షణ గృహాల్లో 19 మహిళా సూపరింటెండెంట్ పోస్టులకు 2022 డిసెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన పరీక్షలను జూన్24 నుంచి 29వరకు నిర్వహించాలని టీజీపీఎస్‌సీ నిర్ణయించింది. ప్రతి రోజు రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరగనున్నాయి. కంప్యూటర్ ఆధారిత(సీఆర్‌బీటీ) విధానంలో నిర్వహించే ఈ పరీక్షలు ప్రారంభం కావటానికి మూడు రోజుల ముందు నుంచి తమ అధికారిక వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు.

స్విస్ సదస్సు తీర్మానంపై సంతకానికి

12 దేశాలు తిరస్కృతి

ఓబుర్గెన్ (స్విట్జర్లాండ్): ఉక్రెయిన్ యుద్ధంపై పశ్చిమ దేశాల ఆధ్వర్యంలో జరిగిన స్విస్ శాంతి సదస్సు రూపొందించిన తుది ప్రకటనపై సంతకాలు చేయడానికి ఓ డజను దేశాలు తిరస్కరించాయి. ఈ సదస్సుకు 180 దేశాలను ఆహ్వానించగా 92 దేశాలు, 8 అంతర్జాతీయ సంస్థలు హాజరయ్యాయి. సదస్సుకు ఆహ్వానించనందున రష్యా హాజరుకాలేదు. ఒక వేళ పిలిచినా వెళ్లేది కాదు. ఎందుకంటే ఈ సదస్సు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ డిమాండ్లు నెరవేర్చడమే ధ్యేయంగా ఏర్పాటు చేయబడింది. రష్యా లేకుండా ఉక్రెయిన్‌లో శాంతి గురించి మాట్లాడడం అర్థం లేదన్న అభిప్రాయంతో చైనా కూడా హాజరు కాలేదు.రష్యా, చైనా లేకుండా ఈ సదస్సు చేసే తీర్మానానికి విలువేముంటుందని ఆర్మేనియా, బ్రెజిల్, ఇండియా, సౌదీ అరేబియా, సౌతాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో సహా పన్నెండు దేశాలు దానికిపై సంతకానికి తిరస్కరించాయని ఆర్ఐఎ నొవొస్తి వార్తా సంస్థ తెలిపింది. డిక్లరేషన్‌కు 79 దేశాలు ఆమోదం తెలిపాయి. వీటిలో హంగరి, సెర్బియా, టర్కీ, జార్జియా వంటి దేశాలతో బాటు నాలుగు అంతర్జాతీయ సంస్థలు ఉన్నాయి. తుది ప్రకటన ఇంకా బయటకు రానప్పటికీ, ఉక్రెయిన్ యుద్ధం వల్ల పెద్దయెత్తున మానవాళి ఇబ్బందులెదుర్కొంటున్నారని, ఆస్తుల నాశనమవుతున్నాయని, దీని ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పడుతోందని ఆ డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లు నొవొస్తి వార్తా సంస్థ తెలిపింది. యుద్ధ ఖైదీల మార్పిడి పూర్తి స్థాయిలో జరగాలని, అంతర్జాతీయంగా గుర్తించిన ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించాలని ఆ ప్రకటన పిలుపునిచ్చింది. ఈ సమస్యకు అర్థవంతమైన పరిష్కారం కుదరాలంటే రష్యాను కూడా విశ్వాసంలోకి తీసుకోవాలని సౌదీ అరేబియా ఇంతకుముందే వ్యాఖ్యానించింది. కొన్ని పదాలపై అభ్యంతరాలతోనే ఈ దేశాలు సంతకం చేయలేదని ఆస్ట్రియా చాన్సలర్ కార్ల్ నెమార్ అన్నారు.

'రుషికొండ' నిర్మాణాలపై త్వరలోనే నిర్ణయం

అమరావతి : విశాఖ రుషికొండపై నిర్మాణాలు పూర్తిగా వ్యక్తిగతంగా ఉన్నాయని, వీటిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రుషికొండపై కట్టిన భవన నిర్మాణాలను కూటమి నాయకులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మీడియాతో మాట్లాడుతూ ఏడు బ్లాకులుగా చేపట్టిన ఈ నిర్మాణాలలో మూడు బ్లాకుల్లో జగన్‌మోహన్ రెడ్డి అత్యంత విలాసవంతమైన గృహ సముదాయాన్ని నిర్మించుకోగా మిగిలిన నాలుగు బ్లాకుల్లో ఒకటి సిఎంఒ కార్యాలయానికి, ఒకటి ప్రధాన అధికారుల ఛాంబర్లకు, మిగిలిన రెండు బ్లాకులు సాధారణ అధికారుల కార్యాలయాలకు ఉండే విధంగా సుమారు రూ.500 కోట్ల వ్యయంతో నిర్మించారని తెలిపారు. ఈ నిర్మాణాలు పూర్తి సెంట్రల్ ఎసి కలిగి పూర్తి గ్రానైటెడ్ ఫినిషింగ్‌తో అత్యాధునిక ఎలక్ట్రిక్ టెక్నాలజీ, భారీ స్క్రీన్లు, విలాసవంతమైన బెడ్రూంలు, బాత్రూంలు కలిగి ఉన్నాయన్నారు. ఈ కట్టడాల గురించి తెలుసుకుందామని గతంలో వస్తే వైసిపి ప్రభుత్వం ఎన్నో అక్రమ కేసులు పెట్టిందని తెలిపారు. చంద్రబాబు, పవన్‌ను సైతం ఇక్కడికి రాకుండా అడ్డుకున్నారని చెప్పారు. పచ్చటి టూరిజం రిసార్ట్‌ను అన్యాయంగా కూల్చివేసి, విలాసవంతంగా కట్టడాలను కట్టారన్నారు. కొంతకాలం టూరిజం రిసార్ట్ అని, మరికొంతకాలం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయమని చెబుతూ వచ్చారని తెలిపారు. రుషికొండ నిర్మాణం ప్రారంభం కూడా అత్యంత రహస్యంగా ఆనాటి పర్యాటక మంత్రి రోజా చేశారన్నారు. ఈ నిర్మాణాలపై కోర్టులు వేసిన కమిటీ ఇక్కడ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ నివేదిక ఇచ్చాయని వివరించారు. త్వరలోనే విశాఖలో సిఎం చంద్రబాబు పర్యటన ఉంటుందని, ఈ భవనాన్ని ఏం చేయాలో ఆయనతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు పంచకర్ల సందీప్, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

19న పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరణ



అమరావతి : డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఈ నెల 19న ఈ నెల 19న పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖలను ఆయనకు కేటాయించిన సంగతి తెలిసిందే. పవన్‌కల్యాణ్‌కు డిప్యూటీ సిఎం ఇవ్వడం పట్ల పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఫలితాలు ప్రకంపనలే

త్వరలో స్వల్ప భూకంపాలు రావచ్చు

- మోడీ కాడి కిందపడేస్తే... గడ్కరీ లాంటి నేతకు నాయకత్వ బాధ్యతలు : ఆర్ఎస్ఎస్‌కు రాజకీయ శాస్త్రవేత్త జెఫ్రెలాట్ సూచన

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపలేని పక్షంలో ఆర్ఎస్ఎస్ ఆయనను మార్చి నితిన్ గడ్కరీ లాంటి వారికి బాధ్యతలు అప్పగించాలని రాజకీయ శాస్త్రవేత్త క్రిస్టోఫ్ – జఫ్రెలాట్ సూచించారు. ప్రభుత్వం పతనం కావడం కంటే గడ్కరీ లాంటి నేతకు బాధ్యతలు అప్పగించి సంకీర్ణాన్ని ముందుకు నడిపించడం మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. మోడీ 23 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్నారని, అయితే ఆయనకు సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపిన అనుభవం గతంలో ఎన్నడూ కలగలేదని గుర్తు చేశారు.

పారిస్‌లోని సైన్సెస్ పోలోనూ, లండన్‌లోని కింగ్స్ కళాశాలలోనూ జఫ్రెలాట్ దక్షిణాసియా రాజకీయాల ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ప్రధాని మోడీ సంకీర్ణాన్ని సమర్థవంతంగా నడపలేకపోతే ప్రభుత్వం ప్రమాదంలో పడుతుందని ఆయన తెలిపారు. అలాంటప్పుడు అటల్ బిహారీ వాజ్‌పేయి వంటి సమర్థుడైన నాయకుడి కోసం ఆర్ఎస్ఎస్ అన్వేషించాల్సి ఉంటుందని చెప్పారు. ఇటీవలి ఎన్నికల ఫలితాలు ప్రకంపనల వంటివని, ఆ తర్వాత చిన్నపాటి భూకంపాలు రావచ్చని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో మెజారిటీ రాకపోవడం నరేంద్ర మోడీకి ఎదురు దెబ్బేనని, ఇప్పుడు ఆయన రాజీ పడుతూ కొన్ని రాయితీలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు.

ఎన్నికల్లో ఎదురు దెబ్బలు తగిలినప్పటికీ బీజేపీకి దక్షిణాది తలుపులు తెరుచుకున్నాయని జఫ్రెలాట్ అన్నారు. దీంతో ఈసారి ఆ పార్టీ నిజమైన జాతీయ పార్టీగా అవతరించిందని చెప్పారు. అయితే దక్షిణాది ద్వారాలను దాటుకొని, ఆ ప్రాంతంలో మరింతగా విస్తరించాలని కోరుకుంటే మాత్రం ఉత్తరాదిన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. హిందీ–హిందూ ప్రాంతాలకే పరిమితమైన పార్టీగా పేరు తెచ్చుకున్న బీజేపీ, ఇకపై దానిని కోల్పోవాల్సి వస్తుందని అంటూ ఇది ఆ పార్టీని అయోమయంలో పడేస్తుందని జెఫ్రెలాట్ అన్నారు.



అనధికారిక రంగంలో 11 కోట్ల మంది కార్మికులు

దశాబ్దం తర్వాత తొలిసారి సమాచారాన్ని ఇచ్చిన కేంద్రం

2021-22, 2022-23 సంవత్సరాలకు సంబంధించి చట్టవిరుద్ధంగా పనిచేస్తున్న సంస్థల వార్షిక సర్వే (ఏఎస్‌యూఎస్ఈ) ఈ విషయాలను బయటపెట్టింది. జాతీయ శాంపిల్ సర్వే సంస్థ దీనిని నిర్వహించింది. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) సంఖ్యలు సహా అనేక గణాంకాలను తాజా పరిచేందుకు ఈ సర్వే దోహదపడుతుంది. పూర్తి స్థాయి నివేదికలు ఇంకా బహిర్గతం కానప్పటికీ ఇవి ప్రాథమికంగా తెలిసిన వివరాలు.

న్యూఢిల్లీ : మన దేశంలో ఆరున్నర కోట్ల అనధికారిక లేదా చట్టబద్ధంగా ఏర్పడని సంస్థలు ఉన్నాయి. వీటిలో 2022–23లో 11 కోట్ల మంది కార్మికులు పనిచేశారు. ఈ సంస్థలన్నీ కలిపి ఆ ఏడాది రూ.15.4 లక్షల కోట్ల విలువైన స్థూల విలువ ఆధారిత (జీవీఏ) వస్తువులు, సేవలను ఉత్పత్తి చేశాయి. వ్యవసాయం కాకుండా అనధికారిక రంగంలో జీవీఏ, ఉపాధి వాటా వరుసగా 6 శాతం, 19 శాతంగా ఉన్నాయి. మొత్తంగా జీవీఏలో వ్యవసాయానికి సంబంధించి ఉపాధి వాటా 45 శాతం, ఆదాయ వాటా 18 శాతం ఉంటుందని భావిస్తే మూడింట రెండు వంతుల మంది కార్మికులు జీవీఏలో కేవలం నాలుగో వంతు మాత్రమే భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో తీవ్రంగా పాతుకుపోయిన అసమానతలకు అద్దం పడుతోంది.

2022 జూన్–2023 జూన్ మధ్యకాలంలో నిర్వహించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం 2022–23లో దేశంలో 56.7 కోట్ల మంది కార్మికులు పనిచేశారు. వీరిలో చట్టబద్ధం కాని సంస్థల్లో పనిచేసిన వారు కేవలం 11 కోట్ల మంది... అంటే 20శాతం మంది మాత్రమేనని తాజా గణాంకాలు చెబుతున్నాయి. వ్యవసాయం, నిర్మాణం మినహా చటబద్ధంగా ఏర్పడని మిగిలిన రంగాల్లో అసమానతలు, చాలీచాలని అరకొర వేతనాలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయని కూడా తాజా నివేదిక నొక్కి చెప్పింది. ఈ రెండు రంగాలు దేశ ఆర్థిక వ్యవస్థలో తక్కువ ఆదాయాన్ని అందించే ఉపాధిని కల్పిస్తున్నాయి. తాజా నివేదిక నిర్మాణ రంగాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఉత్పత్తి, వాణిజ్యం, ఇతర సేవల రంగాలను మాత్రమే గమనంలోకి తీసుకుంది.

అనధికారిక రంగానికి సంబంధించిన సమాచారం దశాబ్ద కాలానికి పైగా అందుబాటులో లేదు. దీంతో ఆ ప్రభావం జీడీపీ సంఖ్యలతో మొదలుకొని అన్ని ఆర్థిక వ్యవస్థల సమాచారానికి సంబంధించిన విశ్వసనీయతపై పడిందని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హిమాన్షు చెప్పారు. ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా రంగాల వారీగా పారదర్శకంగా పూర్తి స్థాయి నివేదికను విడుదల చేయాలని, అందరి అభిప్రాయాలను విస్తృత స్థాయిలో వినాలని కోరారు. ఆ తర్వాతే ఇతర గణాంకాల సమాచారాన్ని నవీకరించాలని సూచించారు. అప్పుడే భారత గణాంక వ్యవస్థ విశ్వసనీయత పునరుద్ధరించబడుతుందని ఆయన చెప్పారు.

కేంద్రం చర్య సరికాదు

ఈపీఎఫ్, ఈపీఎస్, ఈడీఎల్ఐల డిఫాల్ట్‌లో పెనాల్టీ ఛార్జీలు తగ్గించటంపై సీఐటీయూ ఖండన

- ప్రభుత్వం తన నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- దేశవ్యాప్త నిరసనలకు దిగాలని శ్రామికులకు పిలుపు

న్యూఢిల్లీ : యాజమాన్యాలు కార్మికుల కోసం జమచేసే ఈపీఎఫ్, ఈపీఎస్, ఈడీఎల్ఐల డిఫాల్ట్‌ల విషయంలో పెనాల్టీ ఛార్జీలను తగ్గించటంపై సీఐటీయూ ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రంలోని మోడీ సర్కారు చర్యను తప్పుబట్టింది. యాజమాన్యాలు చట్ట పరంగా నిర్వహించాల్సిన వారి బాధ్యతను విస్మరించే విధంగా కేంద్రం తీరు ఉన్నదని వివరించింది. ఈ మేరకు సీఐటీయూ జనరల్ సెక్రెటరీ తపన్‌సేన్ ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ ప్రకటన ప్రకారం..ఇప్పుడే ప్రమాణస్వీకారం చేసిన ఎన్డీఏ ప్రభుత్వం తన నిజస్వరూపాన్ని బయటపెట్టడానికి సమయం తీసుకోలేదు. ప్రయివేటు కార్పొరేట్ యజమానులు కార్మికుల విరాళాలు, వారి ప్రావి డెంట్ ఫండ్, పెన్షన్ ఫండ్‌లో వాటాతో ఆడుకు నేలా అనుమతించటం, యజమానుల డిఫాల్ట్‌ను ప్రోత్సహించేలా కేంద్రం చర్య ఉన్నది. ఈపీఎఫ్ఓకు కార్మికుల సహకారంతో సహా ఈపీఎఫ్, పెన్షన్, ఈడీఎల్ఐ నిధులను సకాలంలో డిపాజిట్ చేయటం యజమానుల చట్టబద్ధమైన బాధ్యత. మోడీ క్యాబినెట్‌లోని కార్మిక మంత్రి, ఉద్యోగుల పెన్షన్ ఫండ్(ఈపీఎఫ్), ఉద్యోగుల డిపాజిట్–లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీం (ఈడీఎల్ఐ)కు సకాలంలో జమ చేయటంలో విఫలమైన యజమానిపై అన్ని జరిమానా ఛార్జీలను భారీగా తగ్గిస్తూ ఈనెల 14న అత్యంత దారుణమైన గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. పెనాల్టీ ఛార్జీ తగ్గింపు దాదాపు ఐదో వంతు కంటే తక్కువగా ఉంటుంది. ఈపీఎఫ్, ఈడీఎల్ఐ కంట్రిబ్యూషన్ చెల్లింపులో యజమాని విఫలమైతే (డిఫాల్ట్) లేదా ఈపీఎఫ్ చట్టం, 1952 లేదా ఈ చట్టం కింద రూపొందించబడిన పథకాల ప్రకారం చెల్లించాల్సిన ఏవైనా ఛార్జీల చెల్లింపులో డిఫాల్ట్ చేసినట్టయితే పెనాల్టీ విధించే విధానం ద్వారా ఈపీఎఫ్ఓ అదే డబ్బును రికవరీ చేయవచ్చు. ప్రస్తుతానికి, రెండు నెలల కంటే తక్కువ డిఫాల్ట్ కాలానికి సంవత్సరానికి 5 శాతం చొప్పున జరిమానా ఛార్జీలు లెక్కించబడ్డాయి.

ఇప్పుడు, సంబంధిత కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ శనివారం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా.. అన్ని నష్టాల రేటును నెలకు ఒక శాతానికి తగ్గించింది. అంటే అన్ని పథకాలకు బోర్డు అంతటా సంవత్సరానికి 12 శాతం. ఇప్పటికే కష్టపడి సంపాదించిన వేతనాలను కోల్పోతున్న మన శ్రామిక ప్రజల జీవన సౌలభ్యం కోసం సులభతర వ్యాపారాన్ని ప్రోత్సహించటం పేరుతో ఇది స్పష్టంగా జరిగింది. దాదాపు 48.79 కోట్ల మంది ఉద్యోగులలో ఈపీఎఫ్ లేదా పెన్షన్ కోసం అర్హులైన వారిలో కేవలం 11.8 కోట్ల మంది కార్మికులు మాత్రమే ఈపీఎఫ్ కింద కవర్ చేయబడతారు. ఈపీఎఫ్ పథకం కింద కవరేజీలో ఉన్నవారు యజమానులచే డిఫాల్ట్‌ను ప్రోత్సహించడం ద్వారా మరింత ఒత్తిడికి గురవుతారు. దీంతో ఉద్దేశపూర్వక డిఫాల్ట్‌కు జరిమానాను భారీగా తగ్గించడం ద్వారా ఈపీఎఫ్‌లో కార్మికుల స్వంత జీవితకాల పొదుపులను యజమానులు అనధికారికంగా ఉపయోగించుకోవటానికి అనుమతించారు.

అంతేకాకుండా, ఉద్యోగుల పెన్షన్ స్కీమ్, 1995లోని పేరా 5, ఈడీఎల్ఐ స్కీమ్, 1976 లోని పేరా 8ఏలు మాత్రమే అటువంటి డిఫాల్ట్‌లకు వ్యతిరేకంగా ఉన్న నిబంధనలు. ఈ కార్మిక వ్యతిరేక, యాజమాన్య అనుకూల నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ఈ సవరణలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మిలిటెంట్ నిరసన కార్యక్రమాలకు దిగాలని శ్రామికులకు పిలుపునిచ్చింది.



జూన్ 30 లోగా కనీసం ఆరు గనులు వేలం వేయండి..!

లేకపోతే మేమే వేస్తాం

- తెలంగాణ సర్కార్‌కు కేంద్రం లేఖ

నవతెలంగాణ – న్యూఢిల్లీ బ్యూరో

ఈ నెల 30లోగా కనీసం ఆరు గనులను వేలం వేయాలని తెలంగాణ సర్కార్‌కు కేంద్ర ప్రభుత్వం సూచించింది. గడిచిన తొమ్మిదేండ్లలో కనీసం ఒక్క మినరల్ బ్లాక్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయలేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. తాజాగా కేంద్ర గనులు శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో కీలక సమావేశం జరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ సమావేశంలో సుదీర్ఘ కాలంగా తెలంగాణలోని మైనింగ్ బ్లాక్‌లు వేలానికి నోచుకోకపోవడం, అందుకు గల అడ్డంకులు, ఇతర అంశాలపై చర్చించారు. ఈ అంశంపై ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం గుర్తు చేస్తూ లేఖలు రాసినా స్పందించలేదు. తాజాగా కేంద్ర ప్రభుత్వం మరోసారి రాష్ట్రానికి లేఖ రాసినట్టు సమాచారం. మొత్తం 11 బ్లాక్‌ల జియాలాజికల్ రిపోర్ట్‌లను వేలం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఈ లేఖని అందజేసింది. ఇందులో బ్లాక్‌లలో ఐదు ఐరన్ ఓర్ మైన్స్, ఐదు లైమ్ స్టోన్ (సున్నపు రాయి), ఒక మాంగనీస్ బ్లాక్‌లు ఉన్నాయి. ఈ 11 బ్లాక్‌ల్లో కనీసం 6 బ్లాక్‌లను ఈ నెల చివరి నాటికి వేలం వేయాలని లేఖలో పేర్కొన్నట్టు తెలిసింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోతే, ఈ వేలం ప్రక్రియను కేంద్రం చేపట్టాల్సి వస్తుందని స్పష్టం చేసింది. సవరించిన మైనింగ్ రూల్స్ 2021 ప్రకారం, గనులను నిర్ణీత సమయంలో వేలం వేయడంలో విఫలమైతే, ఆ బ్లాకులను విక్రయించే అధికారం కేంద్రానికి ఉందని తేల్చి చెప్పింది. మైనింగ్ యాక్ట్ (వేలం విధానం) అమలులోకి వచ్చిన నాటి నుంచి దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 354 ప్రధానమైన ఖనిజ బ్లాకులను వేలం వేశారు. ఇందులో 48 మినరల్ బ్లాక్‌లలో ఉత్పత్తి ప్రారంభమైందని, ఈ వేలం ప్రక్రియతో రాష్ట్రాల ఆదాయం గణనీయంగా పెరిగినట్టు కేంద్ర వర్గాలు తెలిపాయి.

రాజ్యాంగం పాకెట్ వెర్షన్‌పై

ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి

రాహుల్ గాంధీ ఎఫెక్ట్

- ఆర్డర్లు పెరిగాయంటున్న పబ్లిషర్లు
- లోక్‌సభ ఎన్నికల ప్రచారాల్లో.. ఈ పుస్తకాన్ని పలుసార్లు ప్రదర్శించిన కాంగ్రెస్ అగ్రనేత

లక్నో : ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో భారత రాజ్యాంగం మార్పు అనే అంశం తీవ్ర చర్చకు దారి తీసింది. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ విస్పష్ట మెజారిటీకి మించి ఎక్కువ స్థానాలతో అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందని కాంగ్రెస్ ప్రచారం చేసింది. రాజ్యాంగాన్నీ మారుస్తుందని హెచ్చరించింది. ఇదే విషయమై, లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ మోడీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ ఒక పాకెట్ వెర్షన్ భారత రాజ్యాంగాన్ని పలు సందర్భాలలో ప్రదర్శించాడు. విలేకరుల సమావేశంలోనూ ఈ పాకెట్ వెర్షన్‌ను చూపించాడు. ఇప్పుడు ఆ 'చిన్నపాటి' రాజ్యాంగ పుస్తకం ఇప్పుడు ప్రజలందరిలోనూ ఆసక్తిని పెంచుతున్నది.



సుమారు 20 సెంటీమీటర్ల పొడవు, 9 సెంటీమీటర్ల వెడల్పుతో ఉన్న ఆ భారత రాజ్యాంగ పుస్తకం పాకెట్‌లో పెట్టుకొని సులువుగా ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. కాగా, ఈ చిన్నపాటి రాజ్యాంగం పుస్తకాన్ని ఒక కంపెనీకి చెందిన ప్రచురణకర్తలు తొలుత 2009లో ముద్రించారు. ఇలా పాకెట్ వెర్షన్‌ను ముద్రించాలన్న ఆలోచన సుప్రీంకోర్టు న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ నుంచి వచ్చిందనీ, దానిని లాయర్లకు సులువుగా వారి కోర్టు పాకెట్‌లలో సరిపోయేలా ముద్రించాలని ఆయన సూచించారని సదరు ప్రచురణ సంస్థకు చెందిన ఒక డైరెక్టర్ సుమీత్ మాలిక్ చెప్పారు. " మొదటి ఎడిషన్‌ను 2009లో ప్రారంభించాం. ఇప్పటి వరకు ఈ పుస్తకానికి సంబంధించి దాదాపు 16 ఎడిషన్లు ప్రచురించబడ్డాయి. ఏండ్లుగా, అనేక మంది లాయర్లు, జడ్జిలు ఈ కాపీలను కొంటున్నారు. రాంనాథ్ కోవింద్ భారత రాష్ట్రపతిగా అయిన సందర్భంలో ఆయనకు భారత ప్రధాని మోడీ కూడా ఇదే కాపీని అందించారు" అని సుమీత్ మాలిక్ అన్నారు. ఈ పుస్తకాన్ని ప్రముఖులు ఒకరికొకరు బహుమతిగా కూడా ఇచ్చుకున్నారని చెప్పారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ ఈ పుస్తకాన్ని ప్రదర్శించిన కారణంగా ప్రజల్లో దీనిపై ఆసక్తి పెరిగిందనీ, ఇప్పుడు ఆర్డర్లు రావటం మొదలయ్యాయని తెలిపారు. "మొదటి ఎడిషన్‌లో 700 నుంచి 800 కాపీలు అమ్ముడయ్యాయి. చివరిదైన 16వ ఎడిషన్‌కు వచ్చేసరికి, ప్రతి ఎడిషన్‌కూ 5000 నుంచి ఆరువేల కాపీలు విక్రయించాం. అయితే, ఈ సారి చిన్నపాటి రాజ్యాంగ పుస్తకం గురించి ఎక్కువ ప్రచారం జరగటంతో ఈ ఏడాది మరిన్ని కాపీలు అమ్ముడవుతాయన్న ఆశాభావంతో మేమున్నాం" అని మాలిక్ తెలిపారు.

గతనెల 10న యూపీ రాజధాని లక్నోలో సమృద్ధ భారత్ ఫౌండేషన్ సంవిధాన్ సమ్మేళన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ గాంధీ.. ప్రధాని మోడీపై విమర్శలు చేశారు. మోడీ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఆ సమయంలో ఒక చిన్నపాటి రాజ్యాంగ పుస్తకాన్ని రాహుల్ ప్రదర్శించారు. కాగా, రాహుల్ ఆ రాజ్యాంగ పుస్తకాన్ని ప్రదర్శించిన తర్వాత ఆన్‌లైన్ ఈ–కామర్స్ పోర్టల్‌లో తానూ దానిని ఆర్డర్ పెట్టినట్టు యూపీ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఏఐసీసీ సభ్యులు అశోక్ సింగ్ తెలిపారు.

నీట్ యూజీ 2024 వివాదం

విచారణకు సుప్రీంకోర్టు అధికారులను నియమించాలి : కపిల్ సిబాల్ డిమాండ్

న్యూఢిల్లీ : నీట్ యూజీ 2024పై రేగుతున్న వివాదాలపై విచారణ చేయడానికి సుప్రీంకోర్టు అధికారులను నియమించాలని కాంగ్రెస్ నాయకులు, రాజ్యసభ సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి కపిల్‌సిబాల్ ఆదివారం డిమాండ్ చేశారు. అలాగే, భవిష్యత్‌లో నీట్‌ను పరీక్షను ఎలా నిర్వహించాలనే విషయంపై అన్ని రాష్ట్రాలతో కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు జరపాలని కపిల్ సిబాల్ డిమాండ్ చేశారు. పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కపిల్ సిబాల్ ఈ డిమాండ్లు చేశారు. అలాగే ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. నీట్ పరీక్షా విధానం అవినీతిమయమయిందని వార్తలు వస్తున్నప్పుడు 'ప్రధానమంత్రి మౌనంగా ఉండటం నిజంగా మంచిది కాదు' అని అన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాన్ని బలంగా లేవనెత్తాలని అన్ని రాజకీయ పార్టీలకు కపిల్ సిబాల్ విజ్ఞప్తి చేశారు. అయితే ఈ అంశంపై చర్చకు మోడీ ప్రభుత్వం అనుకూలంగా ఉంటుందనే నమ్మకాన్ని కపిల్ సిబాల్ వ్యక్తం చేయలేదు. 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)పై ప్రస్తుతం అనేక ఆరోపణలు ఉన్నాయి. ఎన్‌టిఎ అవినీతిని మీడియా ప్లాట్‌ఫామ్స్ వెలుగులోకి తెచ్చాయి' అని అన్నారు. 2009 మే 29 నుంచి 2012 అక్టోబర్ 29 వరకూ అప్పటి మానవ వనరులు అభివృద్ధి శాఖ (హెచ్‌ఆర్‌డి) (ఇప్పుడు విద్యాశాఖ) మంత్రిగా కపిల్ సిబాల్ బాధ్యతలు నిర్వహించారు. 'గుజరాత్‌లో జరిగిన కొన్ని సంఘటనలు నన్నే కాదు.. దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి తీవ్రమైన అంశాలకు ఎన్‌టిఎ సమాధానం ఇవ్వాలి' అని సిబాల్ అన్నారు. ఇంకా నిరాశ, దిగ్భ్రాంతి కలిగించే విషయం ఏమిటంటే ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యంలో అవినీతి జరిగినప్పుడల్లా 'గుడ్డి భక్తులు' యుపిఎను నిందిస్తారని, ఇది చాలా దురదృష్టకరమని సిబాల్ వ్యాఖ్యనించారు. హెచ్‌ఆర్‌డి మంత్రిగా నీట్‌తో తనకు ఎటువంటి సంబంధంలేదని అన్నారు. ఎంబిబిఎస్ కోర్సులో ప్రవేశం పొందే విద్యార్థులకు జాతీయ స్థాయి అర్హత పరీక్ష ఉండాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సిఫార్సుల మేరకు నీట్ ప్రవేశపట్టారని చెప్పారు. అయితే ఎంసిఐకు ఇలాంటి సామర్థ్యం లేదని దాఖలైన కొన్ని పిటీషన్ల విచారణ తరువాత సుప్రీంకోర్టు 2016లో నీట్‌ను సమర్థించిందని కపిల్ సిబాల్ గుర్తు చేశారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్ 1956 చట్టం స్థానంలో 2019 ఆగస్టున నేషనల్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్‌ను ఆమోదించారని వెల్లడించారు. ఈ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని, దీనికి యుపిఎతో ఎటువంటి సంబంధం లేదని అన్నారు. నీట్ పరీక్షల్లో పేపర్ లీక్ లేదా రిగ్గింగ్ జరగలేదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలను కపిల్ సిబాల్ తీవ్రంగా ఖండించారు. తప్పు జరిగిందని అంగీకరించే మంత్రి మోడీ మంత్రివర్గంలోనే లేదని అన్నారు. నీట్ పరీక్షల్లో ఉల్లంఘనలు, అక్రమాలపై సమగ్ర విచారణ అవసరమని కపిల్ సిబాల్ చెప్పారు. సిబిఐ విచారణ ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వాన్ని రక్షిస్తుందని, కాబట్టి స్వతంత్ర సంస్థ లేదా సుప్రీంకోర్టు నియమించిన అధికారుల ద్వారా విచారణ అవసరమని అన్నారు. మోడీ ప్రభుత్వం ప్రతీ విషయాన్ని కేంద్రీకృతం చేస్తుందని, అయితే 140 కోట్ల జనాభా, సంక్లిష్టమైన సామాజిక వ్యవస్థ ఉన్న దేశంలో మెడిసన్ ప్రవేశాలు ఎలాంటి ఉండాలనే అంశంపై కేంద్ర ప్రభుత్వం ప్రతీ రాష్ట్రాన్ని సంప్రదించి ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్లాలని కపిల్ సిబాల్ కోరారు.



'బ్లాక్ బాక్స్'గా ఈవీఎంలు

వీటిని పరిశీలించే అనుమతి ఎవరికీ ఉండదు

- భారత ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై ఆందోళనలు
- కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ట్వీట్
- ఈవీఎంలపై ఎలన్ మస్క్ ట్వీట్ ట్యాగ్



న్యూఢిల్లీ : భారత్‌లో ఈవీఎంలపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఆసక్తికర ట్వీట్ చేశాడు. ఈవీఎంలను బ్లాక్ బాక్స్‌తో పోల్చారు. వీటిని పరిశీలించటానికి ఎవరికీ అనుమతి ఉండదని పేర్కొన్నారు. భారత ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై ఆందోళనలు తలెత్తుతున్నాయని ఆయన నొక్కి చెప్పారు. సంస్థలలో జవాబుదారీతనం లోపించినపుడు ప్రజాస్వామ్యం బూటకమనీ, మోసానికి గురవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన ట్వీట్ చేశారు. ముంబయి నార్త్ నుంచి 48 ఓట్ల తేడాతో విజయం సాధించిన శివసేన అభ్యర్థి విషయంలో వచ్చిన ఒక వార్త కథనాన్ని రాహుల్ తన పోస్ట్‌కు ట్యాగ్ చేశారు. ఈవీఎంను అన్‌లాక్ చేసే ఫోన్ శివసేన అభ్యర్థి బంధువు వద్ద ఉన్నదన్నది ఆ కథనం సారాంశం. కాగా, ఈవీఎంలను వాడొద్దనీ, వాటిని మానవులు లేదా ఏఐతో హ్యాక్ చేసే అవకాశమున్నదనీ, ఇది దేశానికి నష్టాన్ని కలగజేస్తుందని టెస్లా అధినేత ఎలన్ మస్క్ చేసిన ట్వీట్‌ను సైతం రాహుల్ ట్యాగ్ చేశారు. ఈవీఎంల వినియోగంపై ఎలన్ మస్క్ ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసిన విషయం విదితమే. అమెరికా నియంత్రణలోని ప్యూర్టో రికోలో ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయన్న నేపథ్యంలో మస్క్ పై వ్యాఖ్యలు చేశారు. ఎలన్ మస్క్ వ్యాఖ్యల నేపథ్యంలో ఈవీఎంల వినియోగంపై భారత్‌లో జోరుగా చర్చలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాహుల్ ఈవీఎంలపై ట్వీట్ చేశారు. భారత్‌లో ఈవీఎంల పనితీరుపై పలు ప్రతిపక్ష పార్టీలు ఎప్పటి నుంచో ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి. వంద శాతం వీవీప్యాట్‌లను లెక్కించాలన్న డిమాండ్‌ను ఆ పార్టీలు చేస్తున్నా.. అది కార్యరూపం దాల్చటం లేదు.

అగ్నిపథ్‌ను సమీక్షించాల్సిందే

- మిత్రపక్షాల ఒత్తిడి
- పథకంలో మార్పులు జరిగే అవకాశం

న్యూఢిల్లీ : అగ్నిపథ్ పథకాన్ని సమీక్షించాలని ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. దీంతో ఆ పథకంలో కొన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం కన్పిస్తోంది. త్రివిధ దళాల్లో నియామకాల కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం గతంలో అగ్నిపథ్ పథకాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ పథకం కింద త్రివిధ దళాల్లో చేరే వారు కేవలం నాలుగు సంవత్సరాలు మాత్రమే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అగ్నిపథ్ పథకం కింద నియామక ప్రక్రియ వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే.

2022 జూన్‌లో కేంద్రం ఈ పథకాన్ని ప్రకటించినప్పుడు దానిపై నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అదే సమయంలో కోవిడ్ మహమ్మారి తరుముకురావడంతో రెండు సంవత్సరాల పాటు నియామకాలను చేపట్టలేదు. అగ్నిపథ్ ప్రకటనతో సైన్యం ఆశ్చర్యపోయిందని, ఆకస్మిక, అనూహ్య ప్రకటనతో నౌక, వైమానిక దళాలు కూడా నివ్వెరపోయాయని సైనిక దళాల మాజీ ప్రధానాధికారి జనరల్ ఎంఎం నారావనే గతంలోనే విమర్శించారు.

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రక్షణ దళాలకు చెందిన ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాల్లో బీజేపీ ఎదురు దెబ్బలు తిన్నది. అగ్నిపథ్ పథకంపై కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన సైనిక వ్యవహారాల విభాగం ఆయా దళాల నుండి అభిప్రాయాలు సేకరించింది. నానాటికీ సైనికుల సంఖ్య తగ్గిపోవడం, ఉన్న వారిని కూడా శాశ్వత ర్యాంకుల్లో తగిన సంఖ్యలో నియమించకపోవడం వంటి పరిణామాల నేపథ్యంలో కేంద్రం ప్రకటించిన పథకంపై అభిప్రాయ సేకరణ జరిపారు.



సర్వీసు కాలపరిమితిని ఎనిమిది సంవత్సరాలకు పెంచడం, సాంకేతిక సేవల్లో ప్రవేశాలకు వయో పరిమితిని 23 సంవత్సరాలకు పెంచడం వంటి మార్పులు కూడా జరిగే అవకాశం ఉంది. అగ్నిపథ్ పథకంపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారని ఎన్డీఏ భాగస్వామి అయిన జేడీయూ నేత కేసీ త్యాగి ఇప్పటికే విమర్శించారు. తమ పార్టీ ఎన్డీఏకు బేషరతుగానే మద్దతు ఇస్తోందని, అయితే పథకంలోని లోపాలను తొలగించడానికి దానిపై ప్రభుత్వంలో క్షుణ్ణంగా చర్చ జరగాలని ఆయన సూచించారు. పథకాన్ని సమీక్షించాలని మరో మిత్రపక్షమైన లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ కూడా కోరుతున్నారు.

మిత్రపక్షాల ఒత్తిడి కారణంగా అగ్నిపథ్ పథకంపై అంతరంగిక సమీక్ష జరపవచ్చునని, ఆ తర్వాత అందులో కొన్ని గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నదని 'ది ఎకనమిక్ టైమ్స్' పత్రిక తెలిపింది. నాలుగు సంవత్సరాల కాలపరిమితి తర్వాత త్రివిధ దళాల్లో కొనసాగించే సిబ్బంది సంఖ్యను పెంచడం ప్రధాన మార్పుగా కన్పిస్తోంది. 'ప్రస్తుత నిబంధనల ప్రకారం 25 శాతం అగ్నివీర్‌లను మాత్రమే నాలుగు సంవత్సరాల కాలపరిమితి తర్వాత త్రివిధ దళాల్లో కొనసాగిస్తారు. దీనిని రెగ్యులర్ దళాల్లో 60-70 శాతానికి, సిగ్నల్స్, గగనతల రక్షణ, ఇంజనీరింగ్ వంటి సాంకేతిక, నిపుణత కలిగిన వ్యవస్థల్లో 77 శాతానికి పెంచే అవకాశం ఉంది' అని ఆ పత్రిక వివరించింది.

నిలకడలేని కాలం

గతమూ వర్తమానమూ భవిష్యత్తూ
అసలీ కాలానికి నిలకడ ఉందా
ప్రతి క్షణం నడిచే కాలం ఇప్పుడూ నడుస్తుంది
ఎప్పుడూ జరిగేదే ఇప్పుడూ జరుగుతుంది
మనకు వేరే దారి లేదు కొత్త దర్వాజా లేదు
కాలాన్ని అనుసరించడమే తెలిసిన రహదారి
ఇదేదో కొత్త ముచ్చట కాదు
నాతోపాటు అందరికీ తెలిసిందే
అనుభవంలోకి వచ్చిందే అయినా మరిచిపోతాం
అనంతమయిన లోకమేదో ఎక్కడో వుందనుకుంటాం
మరణం తర్వాత శాంతి
శాశ్వతత్వం లభిస్తుంది అనుకుంటాం
ఎంత ఉదాసీనంగా చూసినా ఉపేక్షించినా
గతం మనల్ని వదలదు భవిష్యత్తు తెలవదు
అందుకే వర్తమానంలో బతుకుదాం
హాయిగా కురుస్తున్న వర్షాన్ని గురించి
అందంగా విచ్చుకుంటున్న పూల గురించి
పక్కవాడి గురించీ ఎదుటివాడి గురించీ
శ్రమ గురించీ సేవ గురించీ
స్నేహం గురించీ ప్రేమ గురించీ
బంధాల గురించీ ఆలోచిద్దాం
సుందరమయిన అర్థవంతమయిన
వర్తమానమే భవిష్యత్తులోకి దారితీస్తుంది

- వారాల ఆనంద్

కిమామ్ పరిమళం వదిలేశాను

నెమ్మది నెమ్మదిగా అన్నీ వది లేశాను
కోపాన్నీ, వేశాన్నీ ఈర్షనూ, ద్వేషాన్నీ
మంకునూ, పంతాన్నీ అన్నిటినీ వదిలేశాను
మాట మాటకు మా అమ్మ ఉన్నప్పటి అలగడాలను
చిన్న వయసులో పెద్ద హీరోలను కాపీ చేసిన షోకులను
షర్ట్ బటన్స్ ఓపెన్ పెట్టి
ఛాతీ చూపించిన పొగరు దావత్‌లను
ఇలా అన్నీ నఖరాలను వదిలేశాను
కానీ, ఈ మంచితనం వదిలించుకోలేక పోతున్నాను
ఎన్ని దెబ్బలు తగిలినా
ఏ గాయం మానక పోయినా
రాళ్ళు విసరడం ఆపని
మనుషులను ప్రేమించడం
మానుకోలేకపోతున్నాను
జీవితం మీది నమ్మకాన్ని
అమ్మ యిచ్చిన బొమ్మలా
నిద్రలో కూడా వదులుకోలేక పోతున్నాను
విమర్శించే వాళ్ళను కూడా
కౌగిలించుకోకుండా వుండలేక పోతున్నాను
బహుశా... ఈ మనిషితనం, మంచి తనం
రాజా తనం, హైదరాబాదీ తనం
క్షమించే తనం, చేయి వదలని తనం
నాతోనే వుంటాయేమో! అన్నీ వదిలేశాను
మనుషులను చూసి మురిసిపోయే
నా గుణం నన్ను వదలడం లేదు



(జర్దాపాన్‌లో, కిమామ్ వేసుకుంటారు. దీనిలో చిత్రమైన నిషా, పువ్వులకు అందని పరిమళం వుంటుంది)

- ఆశారాజు, 9392302245

చాంద్ కో తాజ్



- నస్రీన్ ఖాన్
@ writernasreen@gmail.com

"Behind every smiling face,
there is an untold story of Sabr"

"ప్రతి చిరునవ్వు వెనుక సహనం గురించిన ఒక కథ కచ్చితంగా ఉంటుంది" అని చెప్తుంది ఇస్లాం.

శాంతి, సహనం, గౌరవం, క్రమశిక్షణ, వినయం... ఇవన్నీ ఇస్లాం దేహంలోని అంగాలు. ప్రతి ముసల్మాన్ ఇంటిలో తల్లిదండ్రులు శిక్షణ ఇచ్చేది ఇటువంటి అంశాలపైనే.

కాలప్రవాహంలో వయసు తెచ్చే మార్పులు ఎన్నో కొన్నిసార్లు పండగ వస్తుందంటే వంటింటికే అతుక్కుపోయే ఆడవాళ్ళకు ఎక్కడలేని భయం పట్టుకుంటుంది. అదేమిటో చిత్రంగా రంజాన్ మాసం ప్రారంభం అవుతుందంటే చాలు ఎక్కడలేని ఉత్సాహం పొంగుకొస్తుంది. అర్ధరాత్రి లేచి మరీ తమ ఇంటిల్లిపాదికి వొక్కపొద్దుల కోసం వంటలు చేయడం ప్రారంభిస్తారు. రంజాన్ మాసంలోనే మిగతా అన్ని రోజులకన్నా పని అధికంగా ఉంటుంది. అంతటి అలసటలోనే వొక్కపొద్దులనూ కొనసాగిస్తారు. అయినా ముఖాలపై చిరునవ్వు చెదరనీయరు ఆడవాళ్ళు. ఇఫ్తార్ వేళల్లోనూ అంతే.

ముప్పై రోజులపాటు సహరీ, ఇఫ్తార్‌లు ఒకరికొకరు పంపుకుంటూ, పంచుకుంటూ తినడంలో పొందే తాదాత్మ్యత మాటలకు అందనిది. పైగా ఏ పని చేస్తున్నా నిత్యం దైవ నామస్మరణలోనే గడుపుతుంటే మరే విషయాలూ వారికి పట్టవు. రంజాన్ మాసం ప్రారంభ నెలవంకతోనే హడావుడి ప్రారంభమవుతుంది.

నాకూ బాల్యం నుంచి రంజాన్ అంటే సంతోషాల నిధి. ప్రేమలు పంచే పెన్నిధి. చాంద్ ముబారక్ చెబుతున్నప్పుడే ఓ ఆధ్యాత్మిక పరవశం మనసులో చొరబడుతుంది.

ఇటువంటి మాసంలో ఇల్లూ, ఉద్యోగం చూసుకుంటూ వేళ తప్పకుండా అయిదు పూటలా ప్రార్థనలు చేసుకుంటూనే ప్రతిరోజూ ఒక కవిత రాశారు అఫ్సర్. ఒక్కపొద్దు పద్యాలు వారి వాల్‌లో చూడగానే ప్రతిరోజూ ఒక పద్యం వస్తే బాగుంటుంది అనుకున్నాను. కానీ ఇన్ని బాధ్యతల మధ్య పద్యంకోసం సమయం వెచ్చించగలరా అనే ప్రశ్న కూడా ఉదయించింది. గలరు అని నిరూపిస్తూ ముప్పై పద్యాల గుచ్ఛం ఇప్పుడు సిద్ధమైపోయింది. ఏ ఒక్క రోజూ నిరాశ పరచకుండా ప్రతిరోజూ ఒక పద్యం పాఠకులకు బహుమానంగా లభించిందనిపించింది. పైగా అంతే వేగంగా శ్రీనివాస్ గౌడ్ తెలుగులోకి అనువదించి పుస్తకాన్ని రూపొందించడం మరింత సంతోషాన్ని కలిగించింది.


> **అఫ్సర్ కవితలు చదువుతుంటే అనిర్వచనీయమైన అనుభూతికి లోనవుతాం. వారి కవితల్లో ఒక సున్నితత్వం ఉంటుంది. సూఫీతత్వం దగద్ధాయమానంగా వెలుగులీనుతుంటుంది. అలాగని అవి ఏమీ నెమలీకల విసనకర్రలా సుతారంగా తాకి వెళ్ళేవి కాదు. పదాల కత్తులు గుండె లోపలి పొరలను ఒక్కటొక్కటిగా చీల్చుతాయి. ఛాతీపై కత్తుల వంతెన పేర్చుతాయి. చందమామలోని కాంతివంతమైన చల్లదనం, దానికి మరిన్ని సొబగులు అద్దేలా ప్రతీకలు. అంటే చందమామకు కిరీటాన్ని అలంకరించినట్లు. ఉర్దూలో చెప్పాలంటే చాంద్ కో తాజ్.**

కవితల విషయానికి వస్తే...

ఒక్కపొద్దుల రోజుల్లో దయ, ప్రేమ, కరుణలతో హృదయాన్ని నింపుకుని తోటివారితోనూ అలాగే మెలగాలని అంటారు. దుఃఖ ఛాయలు కానీ, అల్లరితో కూడిన ఆటపట్టింపులు ఉపవాసం ఉన్న వ్యక్తితో చేయకూడదు. వారు దైవధ్యానంలోనే గడపాలి. కొన్నేళ్ళుగా మనసులు భారమై బతుకీడుస్తున్న వర్గంలో ఉపవాసం అయితే సాధ్యమవుతుంది కానీ, గుండెల్లోని దిగులు ఎక్కడకు తుడుచుకుపోగలదు. నిర్మల హృదయంతో అబద్ధాలు మాట్లాడకుండా పద్యాలు రాస్తున్నప్పుడు ఇలానే వస్తాయి. ఇలాగే రావాలి కూడా.

"ప్రతి రొట్టె ముక్కలోనూ/ గాజా కనిపిస్తున్న"ప్పుడు ఛిద్రపదచిత్రాలు తప్ప మరే పూలూ, పళ్ళపై కవితలు రావు. వీటిని రాజకీయ కవితలు అనడం కన్నా సమకాలీన దృశ్య సమాహారం అనడమే సబబు. ఏ దేశాన్ని గమనించినా అనిశ్చితి. ఎక్కడ చూసినా మృత్యు క్రీడలు. పునాదులతో సహా నేలమట్టమైన భవంతుల శిథిలాల్లో ఎన్నెన్ని శవాల గుట్టలు. ఇటువంటి సందర్భంలో ఆధ్యాత్మికంలోనూ ఆవేదన తొంగిచూస్తూనే ఉంటుంది. అందుకే "చావు నుండి దాక్కుంటున్న పిల్లలు/ శిథిలాలలో ఒకరినొకరు వెతుక్కుంటారు" అని రాయగలిగారు. ప్రతి కవితా దుఃఖ పూరితమే. భూమండలంపై ఎన్ని దేశాలలో ఆకలి కేకలు వినిపిస్తున్నాయో, ఎక్కడెక్కడైతే నిలవనీడ లేని ఆర్తనాదాలు వినిపిస్తున్నాయో... వాటన్నింటినీ ఈ ముప్పై పద్యాలు ప్రతిధ్వనిస్తున్నాయి.

అఫ్సర్ కవితలు చదువుతుంటే అనిర్వచనీయమైన అనుభూతికి లోనవుతాం. వారి కవితల్లో ఒక సున్నితత్వం ఉంటుంది. సూఫీతత్వం దగద్ధాయమానంగా వెలుగులీనుతుంటుంది. అలాగని అవి ఏమీ నెమలీకల విసనకర్రలా సుతారంగా తాకి వెళ్ళేవి కాదు. పదాల కత్తులు గుండె లోపలి పొరలను ఒక్కటొక్కటిగా చీల్చుతాయి. ఛాతీపై కత్తుల వంతెన పేర్చుతాయి. చందమామలోని కాంతివంతమైన చల్లదనం, దానికి మరిన్ని సొబగులు అద్దేలా ప్రతీకలు. అంటే చందమామకు కిరీటాన్ని అలంకరించినట్లు. ఉర్దూలో చెప్పాలంటే చాంద్ కో తాజ్. అందుకే ఈ మాటలనే టైటిల్ గా ఎంచుకున్నాను.



పేరు చెప్పుకోవడానికే భయపడే పరిస్థితులు దాపురించిన వేళ. ఆహార్యం, భాష, తిండి ఎగతాళికి గురవుతున్న సందర్భాన్ని చూడండి ఒక్కపొద్దు పద్యంలోకి ఎలా ఒంపారో! "నా ఆహార్యం, శరీరం, తిండి, భాషలను/ గురిపెడుతున్న ఎగతాళిని/ మరిచిపోయేంత చిన్నది కాదు" అంటూ తన జ్ఞాపకశక్తిని గురించి చెప్పుకున్నారు. అయితే దీనిని కేవలం జ్ఞాపకంగా మాత్రమే చూడగలమా? ఒక వర్గం ఎదుర్కొన్న చేదు అనుభవాలు, ఆ వర్గం గుండెకు జరిగిన గాయాలు, అవమానాలు తనతో ఈ మాటలు చెప్పించాయి. ప్రతీ పదం వెనుక మరిచిపోలేని ఓ చేదు సంఘటన.

ప్రతీ కవితను వారు ఎంత నిబద్ధతతో రాశారో, శ్రీనివాస్ గౌడ్ అంతే తదేకతతో ప్రతీ పద్యాన్ని అనువదించారు. ఇంగ్లీష్ కవితకు తెలుగు అనువాదం పూవుకు తావి అబ్బినంత చక్కగా అమరింది. వారిరువురికీ హృదయపూర్వక శుభాకాంక్షలు.

ఈ ఒక్కపొద్దు పద్యాలు ప్రతిరోజూ ఒకటి దర్శనమిస్తూ బాల్యంలోని రంజాన్ సందడిని గుర్తు చేశాయి. ఈ పద్యాల గురించి మరెంతో రాయవచ్చు. చర్చించవచ్చు. కానీ, చిన్న పద్యాలను ఉటంకించుకుంటూ పోలేను. ఎందుకంటే పాఠకులుగా మీరు ఒక్కొక్క పద్యాన్ని చదివి పూర్తిగా ఆ భావుకతలో మునిగి తేలాలని కోరుకుంటున్నాను.

'కన్నవారికలలు-పిల్లల బాధ్యతలు' కవితలపోటీ

సాహితీకిరణం సౌజన్యంతో కొసరాజు ఆర్తి & జాహ్నవి ఛారిటబుల్ ట్రస్ట్ 'కన్నవారి కలలు-పిల్లల బాధ్యతలు' అనే అంశంపై కవితలను ఆహ్వానిస్తున్నారు. ఈ పోటీలో 7 బహుమతులు (ప్రథమ, ద్వితీయ, 5 కన్సొలేషన్ బహుమతులు) వుంటాయి. 20 లైన్లకు మించని కవితలు పోస్టు/ కొరియర్ ద్వారా జులై 31వ తేదీ లోపు 'ఇం.నెం.11-13-154, అలకాపురి,రోడ్ నెం.3, హైదరాబాద్-500102' చిరునామాకు పంపాలి. వివరాలకు : 9490751681. - పొత్తూరి సుబ్బారావు

స్ఫూర్తి పురస్కారాల ప్రదానం

వసుంధర విజ్ఞాన వికాసమండలి 31వ వార్షికోత్సవం ఈ నెల 26న మధ్యాహ్నం 2 గంటలకు రవీంద్రభారతిలో జరగనుంది. ఈ కార్యక్రమానికి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్‌టాగుర్ మక్కాన్ సింగ్, జి.వివేక్ పాల్గొంటారు. కాగా ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనపర్చిన డా, ఆర్, రమేశ్, దేవి, లక్ష్మినర్సయ్య, జబ్బర్ ఖాన్, గంటపద్మ వర్షిణీ, సతీశ్, డి.చక్రపాణి, టి. కనకచారి, వి.బాపురావు, అక్షరకుమార్, సుధారాణి, శ్రీసుధ, జ్ఞానేందర్ గుప్తా, రవికుమార్ తదితరులకు స్ఫూర్తి పురస్కారాలు అందజేస్తారు. కవితల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తారు. - మధుకర్ వైద్యుల, 8096677409

పోస్ట్‌మార్టం రిపోర్ట్? !!



ఆకాశంలో వచ్చిపోయే
మబ్బుల్లా పాలకులు
ఐదేండ్లకోసారి చెల్లని పైసోలే ప్రజలు
ఓటిప్పుడు వేలంపాటలో
అమ్ముడుపోయే ఆస్తి
ప్రజల మీద పాలకులకు ప్రేమలేదు
పాలకుల మీద ప్రజలకూ నమ్మకం లేదు
కలవని పట్టాల్లా ఎవరి దారి వారిదే
రాజకీయం వ్యాపార జూదమని
అతడు తన డైరీలో రాసుకునే ఉంటాడు
ఓట్ల వేట కోసం అతడు
మహానటుడై బయల్దేరుతాడు
ఇప్పుడు ఓటరు కూడా తక్కువేం తినలేదు
అన్ని పార్టీల కరపత్రాలు
నవ్వుతూనే స్వీకరిస్తాడు
వేలంపాటలో తన ఓటుకు
ఎక్కువరేటు పలికిన ఆసామికే అమ్ముకొని
గుట్టు చప్పుడు చేయకుండా
ఇంటి దారి పడతాడు
సిగ్గుతో దేశచిత్రపటం కుంచించుకుపోతుంటది
వివస్త్రగా మారిన ప్రజాస్వామ్య ద్రౌపదిని
ఏ కృష్ణుడు కాపాడలేడు
ఎప్పటిలాగే ఎవరికీ కనిపించకుండా పొలిటీషియన్ దుశ్శాసన
వికటాట్టహాసం చేస్తుంటడు
ధృతరాష్ట్రుని పాత్రలో ఎలక్షన్ కమీషన్
అమలుకాని నీతులను వల్లిస్తుంటది
గోడకున్న క్యాలెండర్‌లో డేట్లు మారుతుంటాయి
పీఠాల మీద రాజవంశాలు ఎక్కిదిగుతుంటాయి
స్పాన్సర్డ్ మీడియా ఇల్లెక్కి కూస్తుంటది
అరచేతి యూనివర్సిటీలో లెక్కలు తారుమారవుతుంటాయి
ఎటొచ్చి ప్రజల బతుకే మరింత
బర్బాద్ అవుతుంటది
నువ్వు కుర్చీమీదుంటే
నన్ను జైలుకు పంపించు
నేను అధికార పీఠాన్ని అందిపుచ్చుకుంటే
నిన్ను ఊచలు లెక్కపెట్టిస్తా
ఇది ఐదేండ్లకోసారి విజేతలను మార్చే ఆట
నిత్యం ప్రజలను పరాజితులను చేసే కుట్ర!
అందరూ దొంగలుగా మారాక
ఫలితం ఏదొస్తే ఏముంది....?
ఇప్పుడు అందరికీ ఆట తెలిసిపోయింది
తిడుతున్నోడి తిట్లు నిజం కావు
ఎత్తుకున్నోడి జెండా శాశ్వతం కాదు
పాడుతున్న పాట పర్మినెంటు కాదు
అంతా ఒక రొటీన్ మెలో డ్రామా!
రాజకీయ కప్పగంతులాటలో
ఎవడు ఎటైనా దూకొచ్చు
ఎవడు ఏ రాగమైనా ఎత్తుకోవచ్చు
పూటకోసారి ఏ లీడరు ఏ పార్టీలో ఉన్నాడో
గుర్తించాల్సిన బాధ్యత ప్రజలదే
ప్లాస్టిక్ కత్తులు విచ్చుకోవు
పొలిటికల్ కౌగిళ్లు గుచ్చుకోవు
అంతా నటన...నటన...!!

- డా.పసునూరి రవీందర్, 77026 48825

ఆధిపత్య వాదాలపై జూలు విదిల్చిన జూలూరు

'వ్యక్తికి బహువచనం శక్తి' అన్న సూత్రం అతడి విషయంలో మళ్ళీ నిరూపితమైంది. పోరాడుతాడు, జనాన్ని సమీకరిస్తాడు, తుదకు లక్ష్యాన్ని ఛేదించి సాధిస్తాడు. ఎందుకంటే జన్మస్థలం తనకు ఓనమాలు దిద్దించింది, కళాశాల పోరాటపటిమను నేర్పింది. నాలుగున్నర దశాబ్దాల కాలం అతని జీవన గమనాన్ని సమూలంగా మార్చివేసింది. ప్రగతిశీల వాదాన్ని భుజంపై వేసుకొని ఒక దశాబ్దం చైతన్యగీతికగా మారాడు. దళిత వాదానికి దగ్గరై బిసి వాదంతో మమేకమయ్యాడు. వారి జీవన స్థితిగతులను అనేక కవితల్లో, కావ్యాల్లో ఆవిష్కరించాడు.

జూలూరు గౌరీశంకర్ - తెలుగునాట పరిచయం అవసరం లేని వ్యక్తి. కావ్యాలు, సంకలనాలు అయన పథంలో పదంగా కదం తొక్కి 'పాదముద్ర' గా నిలిచాయి. దీర్ఘకవితలు తన ఆవేదనను, ఆక్రోశాన్ని వెలిబుచ్చే ఆయుధాలు కాగా ఈ మధ్య వెలువడ్డ 'జూలూరు పథం' కూడా ఆ కోవలోనిదే! తన నాలుగు కల్లోల దశాబ్దాల అనుభవాలను ఈ 'పథం'లో ఏకరువు పెట్టారు. తన బాల్యమిత్రులను, కళాశాల సహచరులను, ఉద్యమ భాగస్వాములను, తనను వెన్నంటి ఉన్నవాళ్లను, వెన్నుతట్టి ప్రోత్సహించిన వాళ్ళను, ఏ ఒక్కరినీ మరచిపోకుండా తన కవితల్లో పలకరించడం, సందర్భానికి తగినట్లుగా గుర్తుచేసుకోవడం జూలూరు మానవీయ లక్షణం.

మహాకవి శ్రీశ్రీ రచించిన 'అనంతం'ను ఆత్మ చరిత్రాత్మ చారిత్రాత్మక నవలగా చెప్పుకున్నారు. గౌరీశంకర్ తన 'జూలూరు పథం' దీర్ఘకవితను ఆత్మ కథనాత్మక కవితగా చెప్పారు. ఆత్మ తనది, కథ తెలంగాణది. 'నా అక్షర రంగస్థల విశాలవేదిక దీర్ఘకవిత' అని పేర్కొన్నారు. శ్రీశ్రీ శైలి, ప్రభావం కూడా అక్కడక్కడా మనకు కనబడతాయి. **'అలజడి మా జీవితం, ఆందోళన మా ఊపిరి, తిరుగుబాటు మా వేదాంతం, విప్లవం మా జన్మహక్కు'** అని శ్రీశ్రీ నినదిస్తే, జూలూరు తన మహా యుద్ధంలో 'తెగించటం నా నినాదం, తెగబడటం నా నైజం, తిరుగుబాటు తెలంగాణ జీవం, నా కాళ్ళ మట్టే ఉద్యమ వేదం' అని స్పందించారు. 'కవిత్వమొక తీరని దాహమే కాదు, యుద్ధరంగ వేదిక, యుద్ధగీతిక, యుద్ధభూమిక' అని పునర్నిర్వచించారు. 'తెలుగు సాహిత్యం ప్రతి మలుపు దగ్గర నా రెండు చేతులతో జెండా నెగరేశా' అని ఢంకా భజాయించారు. తన నాలుగు దశాబ్దాల ప్రస్థానంలో ఏనాడూ తటస్థంగా లేరు. జూలూరు ఎప్పుడూ చలనశీలి. ప్రవాహంగానే ఉన్నారు. ఆ ప్రవాహంలో పాఠకులు కూడా కొట్టుకుపోతారు. ధిక్కార సంస్కృతి అతని రక్తంలోనే ఉంది.

> నడిగూడెం నుండి నగర నడిబొడ్డు దాక, అనంతగిరి నుండి అనంతపురం వరకు, విశ్వవిద్యాలయాల నుండి వెలివాడల వరకు కలియ తిరిగి పీడిత తాడిత జనుల కన్నీళ్లను తన కవితావస్తువుగా చేసుకున్నారు జూలూరు. సమస్త వృత్తుల సమస్త చిహ్నాలను కవితాగానం చేశారు. నేను తరతరాలుగా వెనుకబడ్డవాడిని, ఎప్పటికీ మీ నేను, మీ వెంటాడే కలాన్ని... అని సగర్వంగా ప్రకటించాడు.

నడిగూడెం నుండి నగర నడిబొడ్డు దాక, అనంతగిరి నుండి అనంతపురం వరకు, విశ్వవిద్యాలయాల నుండి వెలివాడల వరకు కలియ తిరిగి పీడిత తాడిత జనుల కన్నీళ్లను తన కవితావస్తువుగా చేసుకున్నారు. సమస్త వృత్తుల సమస్త చిహ్నాలను కవితాగానం చేశారు. నేను తరతరాలుగా వెనుకబడ్డవాడిని, ఎప్పటికీ మీ నేను, మీ వెంటాడే కలాన్ని... అని సగర్వంగా ప్రకటించాడు. సబ్బండ వర్ణాల గొంతుకగా నిలిచాడు. దళిత బహుజన కవులకు ఆశాకిరణమై, దారి దీపంగా మారాడు. సమ సమాజాన్ని స్వప్నించి, విశ్వ విప్లవాన్ని ఆకాంక్షించారు. జూలూరు ఆలోచనా పరిణామ క్రమం ఒకింత విచిత్రమైనది, సంక్లిష్టమైనది. బిగించిన పిడికిలితో విప్లవ భావజాలాన్ని సృజించాడు. బహుజన వాదాన్ని తలకెత్తుకున్నాడు. నా ప్రతిభను కులం పేరుతో తొక్కేస్తే రోహిత్‌నై పుడతానని హెచ్చరిస్తాడు. అందుకే అతడు ఏక కాలంలో అనేకుడు. భావ సంఘర్షణను విజయ వంతంగా అధిగమించాడు. తనను ఎవరితో పోల్చినా ఒప్పుకోడు. తన అస్తిత్వం తనదేనని గాఢంగా విశ్వసిస్తాడు, వాదిస్తాడు. 'ముళ్ల కంచెల్ని చెక్కుకుంటూ, డొంకల్ని దాటుకుంటూ, ఏర్లు నదులను ఈదుకుంటూ, బహుజనదారులు వేసుకుంటూ, తెలంగాణ మలిదశ జెండా నెత్తిపట్టా, అస్తిత్వ కవిత్వ ఆయుధమయ్యాడు.



'కవి జనించటమంటే ఆలోచనల విత్తనం పగలటం' అనే సరికొత్త నిర్వచనంతో ఈ దీర్ఘకవిత మొదలవుతుంది. **'కవులు దేశానికి కాపలాదారులు, కవులు ప్రపంచ పథనిర్దేశకులు, కవులు కర్తవ్య నిర్వహణాధారులు, కవులు కాలానికి దారిచూపేవాళ్లు, కవులు ఎక్కుపెట్టిన సంగ్రామాలు... కవిత్వానికి హద్దుల్లేవు, ఎల్లలు అసలే లేవు'** అనడం ద్వారా కవి కర్తవ్యాన్ని, కవిత్వపు లక్షణాన్ని నిర్దేశించాడు గౌరీశంకర్. ప్రజల పక్షం నిలిచిన కవులే కవులు, వాళ్ళ కోసం చేసిన రచనలే రచనలు, వాళ్ళు లేకుండా కాలాలు లేవు, కావ్యాలు లేవు. కవులు ఉద్యమాలను నడిపిన సాంస్కృతిక రథసారథులు. కవిత్వమంటే గౌరీకి ఉన్న అపారమైన గౌరవం అయన మాటల్లోనే... **'కవిత్వ పాదం నాకు జీవిత భాగం. నా అక్షరమే నాకు ప్రాణమైంది. నా అక్షరాలే నాకు దిక్కు, దీవెనలయ్యాయి'.** మరొక చోట **'నా అక్షరాలు ఉరిమిన సత్యాలు'** అని చెప్పుకొచ్చాడు. కవులు బుద్ధులు కావాలె, అధిపత్యానికి ఎన్నడూ బద్ధులు కావద్దు అని కోరుకున్నాడు. కవితాఖడ్గంతో దేన్నైనా తెగనరికాడు. **'కవులు కల్లోలాలు, ఈదురుగాలుల్లా వీస్తారు, తుఫానులా విరుచుకుపడతారు, కవులు జీవన సత్యాలు'** లాంటి గొప్ప వాక్యాలు ఈ దీర్ఘకవితలో కోకొల్లలు. పుట్టుక రక్తపాతమే, బతుకు రక్తపాతమే, నా ఊహలు పంచుకుంటున్నచోట, విరబూసిన పువ్వుల పుప్పొడి సంపర్కం యుద్ధం. మరోచోట ప్రజాయుద్ధానికి అక్షరాలనల్లేవాడే కదా కవి! అని అతనికి కర్తవ్యబోధ చేస్తాడు. 'అక్షరాలు సూర్యోదయాలు, చంద్రోదయాలు, చీకటివెలుగులు, మానవ హృదయాలు, మానవోదయాలు' అంటూ ఈ దీర్ఘకవితకు ముగింపు పలికాడు గౌరీ.

ఇక తెలంగాణ కవుల గొప్పతనాన్ని చెప్తూ వారిని సోక్రటీస్ వారసులని, ఏకవాక్య బహువచనాలని ప్రశంసిస్తాడు. వారి గొప్పతనం, త్యాగం తెలంగాణ మట్టి వారసులకు మాత్రమే బోధపడుతుంది. తెలంగాణ కవులు పాటకు ఉద్యమ చనుబాలిచ్చారు అని కీర్తిస్తాడు. తెలంగాణ ఉద్యమ కవిత్వ ప్రవాహాలు పోటెత్తిన జలప్రవాహాలు అని ఎలుగెత్తాడు.


ఈ దీర్ఘకవితకు మూలవస్తువు తెలంగాణ. ఊరూ వాడా ఏకమైన నేపథ్యంలో కులమతాలకతీతంగా సిద్ధాంతాలను పక్కనబెట్టి రాజకీయ పార్టీలు ఒక్కతాటిపై నడవాల్సిన పరిస్థితిలోకి నెట్టబడ్డాయి. 'చెగువేరాలు, జూలియస్ ఫ్యూజిక్‌లు, మార్టిన్ లూథర్ కింగ్‌లు ఈ నేలలో యాడ దున్నినా కనబడతారు'. అసలు వెదకాల్సిన పనిలేదని నా భావన. తన నేలపై తనను పరాయివాడిగా చేసి తనపై అదితపత్యం చేయడాన్ని ఏమాత్రం సహించలేదు జూలూరు. కొన్ని మచ్చుతునకలు :

ఈ నేల, ఈ గాలి, ఈ నీరు ఈ ఆకాశం అన్ని నేనైనా నా నేల మీద నేను బందీనే కదా!' అధిపత్యపు రూపాలను ఈ విధంగా తెలిపాడు - చరిత్రంతా వాళ్లదే, నీళ్ళ, నిధులు, కొలువులు వాళ్ళయే, సాహిత్యమంతా వాళ్లదే, సినిమాలు, పరిశ్రమలు, సంపదలు వాళ్ళయే, నా నేల మీద నేనే కూలీని, నా నేల మీద నేనే పరాయి భాంచను' బతికి చావటం, చచ్చి పుట్టటం నా తెలంగాణ, చావు పుట్టుకల అసలు నిర్వచనం తెలంగాణ, సత్యాల పొదుగు నా నేల, నిజాల కొలిమి నా నేల, నిప్పుల కుంపటి నా నేల. నా తెలంగాణ కొత్త చరిత్రకు చిరునామా, నా తెలంగాణ ఆరని చైతన్య నిప్పు ...తల్లి స్తన్యం కోసం బిడ్డ పెట్టిన కేక నా తెలంగాణ'.

మొత్తం దీర్ఘకవితను 15 భాగాలుగా విభజించినా అంతర్లీనంగా అంతరాత్మయైన తెలంగాణ ఆసాంతం మనకు ఆవిష్కృతమవుతుంది. తాను ఏ వాదంలో ఉన్నా ఆధిపత్య వాదాన్ని నిరసించాడు. గౌరీలోని మరో గొప్పతనమేమంటే ఉద్యమం జరుగుతున్నప్పుడే ఆ ఉద్యమంపై ఒక పుస్తకం విడుదల చేస్తాడు. ఒక రకంగా కాలం కంటే ముందు నడుస్తాడు జూలూరు. అనేకమంది అంతర్జాతీయ నాయకుల, కవుల పేర్లు మనకు ఈ కావ్యంలో కనబడతాయి. అనేక గ్రంథాలు చదివిన జూలూరు, వాటిని అలవోకగా కవితల్లో సందర్భోచితంగా ఉదహరిస్తాడు. ఉదహరించిన మిత్రుల పేర్లు, ఉద్యమనేతల పేర్లు, అమరుల పేర్లు రాయాలంటే అదొక వ్యాసమవుతుంది. వారే అతని బలము, బలగము. ప్రసేన్, సీతారాం, వంశీకృష్ణల పరిచయ వాక్యాలు ఈ దీర్ఘకవిత రంగు, రుచి, ఘాటు వాసన తెలియజేస్తాయి. కవితలో ఆవిష్కృతం కాబోయే అనేక ఉద్యమాలకు నేపథ్యాన్ని జూలూరు ఆవేదన, ఆవేశం, ఆక్రోశం పాఠకులకు ముందే ఒక భూమికను ఏర్పరుస్తాయి. ఈ కావ్యాన్ని తన తల్లిదండ్రులకు అంకితమిచ్చిన జూలూరు ధన్యజీవి.

విబూది బొట్టు నుండి విప్లవవాదిగా, విముక్తివాదిగా జూలూరులో పరిణామక్రమం ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుంది. దిగంబర కవుల ప్రభావం గౌరీ నడకలో కనిపిస్తుంది. ఉద్యమం ముగిసి ఒక దశాబ్ద కాలం గడిచినా గౌరీ శైలి ఆనాటి రూపాలన్నింటిని మన కళ్ళముందు ఆవిష్కృతం చేస్తుంది. సందర్భోచితంగా గీసిన చిత్రాలు ప్రతి కవితకు ముందు మనలను ఆలోచింప జేస్తాయి. అట్ట'హాసం' తో కూడిన ఈ దీర్ఘకవిత ఉద్యమాల్లో పాల్గొన్న వారినందరిని గతానుభవాల్లోనికి తీసుకుపోతే నూతన లేదా భావితరాల వారిని తమ గమ్యం వైపు ఉద్యుక్తులను చేస్తుంది. వారికీ ఒక మార్గదర్శినిగా నిలుస్తుంది. 'జూలూరు పథం' విభిన్నమైనది, విలక్షణమైనది.

- పునర్వసు



అనుభవజ్ఞులైన వైద్యులు

ఆధునాతన ఆపరేషన్ల సౌకర్యం

అన్ని టెస్టులు చేసే సౌలభ్యం

తక్కువ ధరలకే కార్పొరేట్ స్థాయి చికిత్సలు

నవతెలంగాణతో ఇంటర్వ్యూలో

నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

పలు సందర్భాల్లో అవసరానికి మించిన టెస్టులు, చికిత్సల పేరుతో మోసాలు, బాధితులుగా మారుతున్న రోగులు, వారి కుటుంబాల ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ప్రమాదవశాత్తు ఛాతీలో దిగిన బాణంతో దాదాపు 24 గంటలపాటు విలవిలలాడుతూ నరకయాతన అనుభవించిన గిరిజన యువకునికి ఇటీవల నిమ్స్ వైద్యులు ఉచితంగా ఆపరేషన్ చేసి ప్రాణాలు నిలిపారు. అలా ఎందరో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగా నిమ్స్ ఆస్పత్రి అందిస్తున్నది. ఆ ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై డైరెక్టర్ డాక్టర్ బీరప్పతో ఇంటర్వ్యూ....

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతంతో పోలిస్తే రోగాలు, రోగుల సంఖ్య పెరిగిపోతున్నది. వైద్యం పేదవారికి ఖరీదైనా భరించలేనిదిగా మారుతున్నది. ఒకసారి జబ్బుల బారిన పడితే కుటుంబాలు పెట్టే ఖర్చుతో అప్పులు పాలు కావడం, దారిద్ర్య రేఖ దిగువనకు దిగజారిపోతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. అయినప్పటికీ వ్యాధులు, ప్రమాదాల బారిన పడిన వారు తమకు కార్పొరేట్ స్థాయి వైద్యం దొరకాలని ఆశిస్తుంటారు. అయితే కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రుల్లో వేస్తున్న ఛార్జీలు వారిని మరింత కుంగదీస్తున్న సంగతి తెలిసిందే.

ప్రశ్న... ఇటీవల కాలంలో నిమ్స్ కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సంక్లిష్టమైన అత్యాధునిక శస్త్రచికిత్సలు నిర్వహిస్తోంది. ఒక స్వయం ప్రతిపత్తి సంస్థగా మీకు ఇది ఎలా సాధ్యమైంది.?

డాక్టర్ బీరప్ప... నిమ్స్‌కు యూనివర్సిటీ స్థాయి ఉండటంతో పీజీ, సూపర్ స్పెషాలిటీ బోధనా సిబ్బందితో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. రోగుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఇక్కడ వైద్యవిద్యార్థులు నేర్చుకునేందుకు అవకాశమెక్కువ. అందుకే నీట్‌లో టాప్ ర్యాంకర్లు ప్రాధాన్యతనిస్తారు. టీచింగ్ మెటీరియల్ పుష్కలంగా ఉంది. ఢిల్లీలో ఎయిమ్స్ కన్నా ఏమి తక్కువ కాకుండా ఆపరేషన్లు, ప్రొసీజర్లు, చికిత్సలు చేస్తున్నాం. అత్యధికంగా అవయవమార్పిడి శస్త్రచికిత్సలు కూడా ఇక్కడే జరుగు తున్నాయి. నిమ్స్ విద్యార్థులకు కార్పొరేట్ నుంచి భారీ స్థాయిలో డిమాండ్ ఉంటుంది. ప్రతిష్టాత్మక వైద్యవిద్యా సంస్థల నుంచి వచ్చిన ఏండ్ల తరబడి అనుభవం కలిగిన 350 మంది వరకు బోధనా సిబ్బంది ఉన్నారు. ఎక్కువగా ప్రయివేటు ఆస్పత్రుల్లో రాత్రి వేళల్లో ఎంబీబీఎస్ చేసిన డ్యూటీ మెడికల్ ఆఫీసర్ అందుబాటులో ఉంటారు. అదే నిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ, బ్రాడ్ స్పెషాలిటీ చేసిన వైద్యులు నిరంతరాయంగా అందుబాటులో ఉంటారు. చిన్నైనా, పెద్దవైనా సరే... రోగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు వెనుకాడేది లేదు.

ప్రశ్న...నిమ్స్‌లో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, సిబ్బంది, సదుపాయాలపై వివరిస్తారా?

డాక్టర్ బీరప్ప ....నిమ్స్‌లో 1638 బెడ్లున్నాయి. 350 మంది అనుభవజ్ఞులైన బోధనా సిబ్బంది ఉన్నారు. వీరంతా ప్రతిష్టాత్మక వైద్యవిద్యా సంస్థల నుంచి వచ్చిన వారు. 500 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 1000 మంది నర్సులు, మరో వెయ్యి మంది నాలుగో తరగతి సిబ్బంది సేవలందిస్తున్నారు. 28 ఆపరేషన్ థియేటర్లుంటే అందులో 24 మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్లు (జీరో బాక్టీరియా)ఉన్నాయి. ఈ థియేటర్లలో 15 రోజులకు ఒకసారి బాక్టీరియా, వైరస్, ఫంగల్‌కు సంబంధించి తనిఖీ చేస్తాం. నిరంతరం బాక్టీరియా లేకుండా చర్యలు కొనసాగిస్తుంటాం.

ప్రశ్న... ఆరోగ్యశ్రీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులు, జర్నలిస్టులందరికీ సంబంధించిన ఆరోగ్యశ్రీ పథకాలు నిమ్స్‌లో వర్తిస్తున్నాయా? లేదా?

డాక్టర్ బీరప్ప... ఈ పథకాలను నిమ్స్ నిక్కచ్చిగా అమలు చేస్తున్నది. ప్రయివేటు ఆస్పత్రులు నిరాకరించినా... నిమ్స్ సేవలను కొనసాగిస్తున్నది. ప్రభుత్వం నిర్దేశించిన ప్యాకేజీ రేట్లతో చికిత్సలు అందిస్తుండటంతో పేద రోగులకు ఆర్థిక ఇబ్బంది ఉండదు. నిమ్స్ నిబద్ధతతో కూడిన సేవలంది స్తున్నందునే ప్రతి ఏటా చికిత్స కోసం నిమ్స్‌ను ఎంచుకునే వారి సంఖ్య పెరుగుతున్నది. 2017లో ఆరోగ్యశ్రీ రోగులు 70 వేల మంది వస్తే అది కాస్తా 1,40,000కు, ఈహెచ్ఎస్ రోగులు 4000 నుంచి 16 వేలకు, జెహెచ్ఎస్ పరిధిలో 1,800 నుంచి 2,260కు పెరిగారు. అదే విధంగా 2018లో సీఎంఆర్ఎఫ్ కింద 1,424 మంది సేవలు పొందితే అది కూడా 8,046కు పెరిగింది.

ప్రశ్న..అనేక పథకాల కింద సేవలందిస్తున్నామని చెబుతున్నారు. అయితే నిమ్స్‌లో వైద్యసేవలు, ముఖ్యంగా అత్యవసర చికిత్సలు ఆలస్యమవుతున్నాయి. ఆ జాప్యాన్ని నివారించేందుకు ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?



డాక్టర్ బీరప్ప... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇస్తున్న సహకారంతో ఇప్పటికే పలు చర్యలు తీసుకున్నాం. దీంతో రోగుల రద్దీ పెరిగినా... వైద్యసేవలు సకాలంలో అందుతున్నాయి. న్యూరో సర్జరీ, కార్డియో థొరాసిక్ రోగులకు వేచి చూడాల్సిన పరిస్థితి తప్పడం లేదు. ఇటీవల కాలంలో ప్రమాదాల బారిన పడిన రోగులు, బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ అటాక్ కేసులు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఆకస్మికంగా పెరిగిన ఒత్తిడి కారణంగా తాత్కాలికంగా ఏర్పడిన ఇబ్బంది ఇది. దీన్ని పరిష్కరించేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న...నిమ్స్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ఏమైనా ప్రతిపాదనలు పంపించారా?

డాక్టర్ బీరప్ప.... దేశంలో ప్రతిష్టాత్మక ఆస్పత్రిగా నిమ్స్ ప్రత్యేకతను సంపాదించుకుంది. ఇప్పటికే రాష్ట్రంలోని రోగులకే కాకుండా పలు రాష్ట్రాల నుంచి రోగులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. మల్టీ స్పెషాలిటీ సేవలతో హైదరాబాద్ నిమ్స్ కెళితే చికిత్స లభిస్తుందనే నమ్మకాన్ని కలిగించాం. అంతర్జాతీయంగా రోగులను ఆకర్షించాలనే లక్ష్యంతో ఉన్నాం. ఇప్పటికే నిమ్స్‌లో రీసెర్చ్ కోసం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), సీడీఎఫ్డీ, ఐఐసీటీ, ఐఐఐటీ వంటి వాటితో ఒప్పందాలు చేసుకుని ముందుకెళ్తున్నాం. పలు సైంటిఫిక్ సంస్థలు నిమ్స్‌తో కలిసి పని చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ఒకవైపు రీసెర్చ్, మరో వైపు రోగులకు సేవలు, ఇంకో వైపు మెరుగైన వైద్య విద్యనందించడం బహుముఖంగా సేవలందిస్తున్న నిమ్స్‌లో వివిధ విభాగాల్లో ఎప్పటికప్పుడు అప్‌డేటెడ్ పరికరాల కోసం ప్రతిపాదనలు పంపిస్తూనే ఉన్నాం. మరో 90 మంది బోధనా సిబ్బందినివ్వాలని కోరాం. మరో వంద మంది వరకు నర్సులను నియమించుకోవాల్సి ఉన్నది. ఒకట్రెండు నెలల్లో నిమ్స్ స్టెమ్‌సెల్స్ థెరపీ సేవలను అందించనుంది. వైద్యరంగంలో నిమ్స్‌ను లీడర్‌గా నిలబెట్టడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

ఆగి ఉన్న డీసీఎంను ఢీ కొని..

ఇద్దరు యువకులు మృతి





నవతెలంగాణ-కూకట్‌పల్లి

స్కూటీపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు ఆగి ఉన్న డీసీఎంను ఢీ కొనడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కూకట్‌పల్లి సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి వై జంక్షన్ నుంచి కేపీహెచ్‌బీ వెళ్లే రహదారిలో శనివారం అర్ధరాత్రి సూరారానికి చెందిన ఉదయ్ (17), సాయిబాబా నగర్‌కు చెందిన శివదీక్షిత్ (17), మల్లారెడ్డి నగర్‌కు చెందిన మరో యువకుడు ద్విచక్రవాహనంపై అతి వేగంతో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో వై జంక్షన్ సమీపంలో ఆగి ఉన్న డీసీఎంను వెనక నుంచి ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఉదయ్, శివ దీక్షిత్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన మరో యువకుడిని సమీపంలోని అమోర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందజేస్తున్నారు. పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కామాంధున్ని కఠినంగా శిక్షించాలి : సునీతారావు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన కూలీ దంపతుల కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడిన కామాంధున్ని కఠినంగా శిక్షించాలని మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు పక్కనే ఉన్న ఆ బాలికను కాపాడుకోలేకపోవడం చాలా బాధాకరమని ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా రాత్రి పూట నిరంతరం పోలీసుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మద్యం, డ్రగ్స్ మత్తులో పడి ఇలాంటి అఘాయిత్యాలు చేస్తున్నారని తెలిపారు.

కేంద్ర విద్యాసంస్థల్లో ఓబీసీలకు అన్యాయం

ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిబుల్ ఐటీ, జీఎస్టీలో ఓబీసీ విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యు) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్షులు పాపని నాగరాజు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్ఐటీ, ట్రిబుల్‌ఐటీ, ఐఐటీ, జీఎఫ్‌టిలలో 57,152 సీట్లకు జోస కౌన్సిలింగ్, సీసాబ్ కౌన్సిలింగ్ ద్వారా నిర్వహించే సీట్ల కేటాయింపుల్లో ఓబీసీ విద్యార్థులకు 27 శాతం రిజర్వేషన్ ప్రకారం 15,431. 04 గాను 14694 సీట్లను భర్తీ చేసింది. ఈ లెక్కన 737 సీట్లను 2023-24 విద్యా సంవత్సరంలో కోత విధించింది. ఆయా రంగాల విద్యాలయాల్లో కటాఫ్ దగ్గర ఉన్న ర్యాంకుల విద్యార్థులతో నింపాల్సింది. మిగిలిపోవటానికి అవకాశం ఇచ్చారు కానీ దగ్గరగా ఉన్నా మెరిట్ విద్యార్థులకు ఇవ్వలేదు. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఉండాలన్న సుప్రీంకోర్టు నిబంధనను అమలు చేసేందుకు ఒబీసీ రిజర్వేషన్లలోనే కోత విధిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓబీసీలకు ఉన్నత విద్య అందకుండా కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. దీనిపై ఓబీసీ ఎంపీలు, మంత్రులు కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ను నిలదీయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకతీతంగా ఓబీసీ రిజర్వేషన్ల కోసం పోరాడాలని కోరారు.

ఏ తప్పు చేయలేదు..మీ కమిషనే డొల్ల

విచారణ పూర్తికాకముందే తీర్పు ఎలా ఇస్తారు?

జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్‌పై మాజీ విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి ఫైర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఛత్తీస్‌గఢ్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణాల్లో ఎలాంటి తప్పులు జరగలేదనీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే విచారణ కమిషన్లు వేసిందని మాజీ విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. పై అంశాలపై ప్రభుత్వం వేసిన జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి ఏకసభ్య కమిషన్‌కు ఎలాంటి విచారణ అర్హతలు లేవన్నారు. జస్టిస్ నర్సింహారెడ్డిపై తమకు వ్యక్తిగతంగా ఎలాంటి విభేదాలు లేవనీ, తెలంగాణ వ్యక్తిగా ఆయన్ని గౌరవిస్తామని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయన తీరులో మార్పు వచ్చిందనీ, అంధకారంలో ఉన్న తెలంగాణలో వెలుగులు నింపిన మాజీ సీఎం కేసీఆర్‌పై ఆయన ఉద్దేశ్యపూర్వకంగానే ఆరోపణలు చేశారని విమర్శించారు. విచారణ పూర్తి కాకముందే తీర్పు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ వివరణ ఇచ్చేందుకు గడువు కోరితే కుదరదంటూ, ఈనెల 15వ తేదీలోపు వివరణ ఇవ్వాలని కమిషన్ ఆదేశించిందన్నారు. దీనితో కేసీఆర్ అన్ని వివరాలతో కమిషన్‌కు లేఖ రాసారని తెలిపారు. కమిషన్ తన పరిధిని దాటి వ్యవహరించిందనీ, జస్టిస్ నర్సింహారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా నివేదిక ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తేలిపోయిందన్నారు. అలాంటప్పుడు ఆయన ఎదుట ఏం చెప్పినా ప్రయోజనం లేదని అన్నారు. ఛత్తీస్‌గఢ్ ఒప్పందంపై అప్పటి ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)లో పిటీషన్ దాఖలు చేశారనీ, తీర్పు వచ్చాక దానిపై అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉన్నా ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. అప్పుడు మౌనంగా ఉండి, ముఖ్యమంత్రి అయ్యాక ఇప్పుడు రాజకీయ కక్షతో విచారణల పేరుతో గత ప్రభుత్వ గొప్పతనాన్ని తక్కువ చేసి చూపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విచారణ కమిషన్ బాధ్యతల నుంచి జస్టిస్ నర్సింహారెడ్డి స్వచ్ఛందంగా వైదొలగాలని డిమాండ్ చేశారు. ఆదివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో



ఆయన మాట్లాడారు. జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌పై పలు ఆరోపణలు, విమర్శలు చేశారు. విద్యుత్ కొనుగోళ్లపై తాము అధికారంలో ఉన్నప్పుడే కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యేలకు శాసనసభలోనే సమాధానాలు ఇచ్చామనీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా అసెంబ్లీలో శ్వేతపత్రాలు ప్రవేశపెట్టినపుడు సంపూర్ణ సమాచారం అక్కడే ఇచ్చామని వివరించారు. మళ్లీ ఇప్పుడు విచారణ కమిషన్ల పేరుతో వేధిస్తున్నారని ఆక్షేపించారు. 'జస్టిస్ నర్సింహారెడ్డి మీడియా సమావేశాల్లో మాట్లాడటం తప్పు. ముందే ఒక నిర్ణయానికి వచ్చేసి, ఆయన మాజీ సీఎం, గత ప్రభుత్వ అధికారులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దీనితో ఆయన విచారణాధికారిగా అర్హత కోల్పోయారు' అని స్పష్టం చేశారు. ప్రభుత్వరంగ సంస్థల మధ్య జరిగే ఒప్పందాల్లో ఏం అవినీతి ఉంటుందని ప్రశ్నించారు. తెలంగాణ కంటే కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలు ఎక్కువ రేటుకు విద్యుత్‌ను కొన్నాయని ఉదహరించారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పెద్దల్ని కూడా విచారణకు పిలిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు.

నీట్‌పై మోడీ నోరెత్తరేం..

లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడినా కేంద్రం పట్టించుకోదా?

- మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు
- సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

"ఓవైపు గ్రేస్ మార్కుల గందరగోళం.. మరోవైపు పేపర్ లీకేజీల వ్యవహారంతో తల్లిదండ్రుల్లో ఆందోళన... ప్రధాని మోడీ పరీక్షా పే చర్చ నిర్వహించడం కాదు... ఆయన, ఆయన మంత్రివర్గ సహచరులు నీట్ వ్యవహారంపై స్పందించాలి" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు (కేటీఆర్) అన్నారు. ఈ మేరకు ఆదివారంనాడాయన ఓ బహిరంగలేఖ విడుదల చేశారు. నీట్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కష్టపడి చదివిన విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలని కోరారు. బీహార్‌లో రూ.30 లక్షల చొప్పున నీట్ ప్రశ్నాపత్రాలు విక్రయించారనీ, పదుల సంఖ్యలో అరెస్టులు జరుగుతున్నట్టు వార్తలు వస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు



వ్యవహరిస్తున్నదని విమర్శించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా నీట్ ఎగ్జామ్‌లో ఏకంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ రావటం అనేక అనుమానాలకు తావిస్తున్నదన్నారు. దానిలోనూ ఒకే సెంటర్ నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఏకంగా 720 మార్కులు సాధించడం చూస్తే.. పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతున్నదని పేర్కొన్నారు. ఒక్క మార్కు తేడాతోనే విద్యార్థుల ర్యాంకులు మారిపోతాయనీ, ఎంతోమంది అవకాశాలు కోల్పోతారని గుర్తుచేశారు. పరీక్షా ఫలితాలను 10 రోజులు ముందుకు జరిపి, సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించటం కూడా అనేక సందేహాలకు తావిచ్చిందన్నారు. లక్షల మంది విద్యార్థులు ఎన్ని ఫిర్యాదులు చేసిన కేంద్రం స్పందించలేదనీ, పలువురు ప్రముఖులు సుప్రీంకోర్టులో కేసు వేసినా ఒక్క వివరణ కూడా ఇవ్వలేదన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునేంత వరకు కేంద్రం ఈ అంశాన్ని పట్టించుకోకపోవటం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) చిత్రమైన సమాధానాలు చెప్పిందన్నారు. ఈ ఏడాది 1563 మందికి గ్రేస్ మార్కులు కలిపినట్టు చెబుతున్నారనీ, అసలు నీట్ లాంటి ఎగ్జామ్‌లకు గ్రేస్ మార్కులు కలిపే విధానమే లేదని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా నీట్ ఎగ్జామ్‌ను పెద్దసంఖ్యలో విద్యార్థులు రాశారనీ, నీట్‌లో జరిగిన గ్రేస్ మార్కులు, పేపర్ లీకేజీ ఆరోపణల కారణంగా వారంతా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రగతిశీల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎల్.పద్మ, అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లయ్య బట్టుకు వినతిపత్రం అందజేశారు. 475 కేజీబీవీ పాఠశాలలు, 300 కళాశాలల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ వేతనాలకు బేసిక్ నిర్ణయించి జీతాలు పెంచాలని కోరారు. ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలనీ, కాలేజీలుగా అప్‌గ్రేడ్ అయిన చోట పోస్టులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, ఏ.అశోక్ పాల్గొన్నారు.

త్వరలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

ఎంపీ డాక్టర్ మల్లు రవి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నట్టు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి తెలిపారు. బీసీటీఏ ఆధ్వర్యంలో ఆదివారం నూతనంగా ఎన్నికైన ఎంపీ మల్లు రవికి సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలో లిక్కర్ ధరలకు రెక్కలు?

20 నుంచి 30 శాతం పెరిగే అవకాశం

2020, 2022లో రేట్లు పెంచిన అప్పటి సర్కార్

ప్రతి రెండేండ్లకోసారి పెరుగుదల సహజమంటున్న అధికారులు

తిరిగి అదే స్థాయిలో పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు

ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఆబ్కారీ శాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మద్యం ధరలు త్వరలో పెరగనున్నాయని తెలుస్తోంది. ధరల పెంపుపై ఆబ్కారీ శాఖ అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు సమాచారం. 2020, 2022లో అప్పటి ప్రభుత్వం 20 నుంచి 25 శాతం వరకు మద్యం ధరలను పెంచింది. తిరిగి రెండేండ్ల తర్వాత అదే స్థాయిలో ధరలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. అమ్మకాలతో పాటు ధరల పెంపు ద్వారా ఈ ఏడాది రూ.50వేల కోట్ల ఆదాయం ఎక్సైజ్ శాఖ ద్వారా సమకూర్చుకోవాలని సర్కార్ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

రాష్ట్ర ఖజానా నింపేందుకు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడి నుంచి ఆదాయాన్ని సమకూర్చు కునేందుకు సర్కార్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. అదే క్రమంలో లిక్కర్ ధరల పెంపు అంశాన్ని పరిశీలిస్తున్నదని తెలుస్తోంది. తెలంగాణలో 2,620 మద్యం దుకాణాలు, వెయ్యికి పైగా బార్లు, క్లబ్బులు, టూరిజం హోటళ్లు ఉన్నాయి. 2014లో మద్యం ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ. 10,863 కోట్లు సమకూరగా, ఆ తర్వాత ఏడాది రూ.12,706 కోట్ల మార్కును దాటింది. వరుసగా పెరుగుదల రేటును నమోదు చేసుకుంటూ 2022, 23ల్లో రూ.36 వేల కోట్లకు చేరింది. ఈ రకంగా రాష్ట్ర ఖజానాకు మద్యమే ప్రధాన ఆదాయ వనరుగా మారింది. పదేండ్లలో దాదాపు రూ.2.3లక్షల కోట్లకు పైగా ఆబ్కారీ శాఖ నుంచే సర్కార్‌కు ఆదాయం వచ్చింది. అయితే గతేడాది 2022 మార్క్ దాటక పోవడంతో అధికారులు హైరానా పడుతున్నారు. ఈ సారీ ప్రభుత్వం మారడం, సర్కార్ లిక్కర్ ఆదాయంపైనే పెద్దగా ఆశలు పెట్టుకోవడంతో పెంపుపై ప్రత్యేక దృష్టి సారించింది. నెలరోజుల్లో మూడు సార్లు అసిస్టెంట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఇతర సిబ్బందితో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఎంత వరకు పెంచాలి? ప్రజలు ఏ విధంగా స్పందిస్తారు? తదితర అంశాలపై ఈ సందర్భంగా అధికారుల నుంచి సైతం ఫీడ్ బ్యాక్ తీసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో సర్కార్ నిర్దేశించిన టార్గెట్‌ను చేరుకునేందుకు మద్యం ధరల పెంపుతో పాటు అమ్మకాల్లో 50 శాతం వృద్ధి నమోదు చేయాలని లక్ష్యంగా సర్కార్ సమాయత్తమవుతోందని తెలుస్తోంది.

ఎంత పెంపు?

రాష్ట్రంలో లిక్కర్ ధరలను గత ప్రభుత్వం మార్చి నెలలో పెంచింది. ఈ ఏడాది కూడా మార్చి నెలలోనే పెరగాల్సి ఉండగా, పార్లమెంట్ ఎన్నికల కారణంగా వాయిదా వేసింది. ఈ నేపథ్యంలోనే ధరల పెంపుపై అధికారులు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసినట్టు సమాచారం. అన్ని బ్రాండ్లపై దాదాపు 20 నుంచి 25 శాతం మేర ధరలు పెరగనున్నట్టు తెలుస్తోంది. ఈ ధరల పెంపు వలన ఏటా ప్రభుత్వానికి అదనంగా రూ.5 నుంచి రూ. 7 వేల కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని భావిస్తున్నారు.

2015 నుంచి తెలంగాణ లిక్కర్ ఆదాయ వివరాలు

క్రసం	సంవత్సరం	ఆదాయం(వేల కోట్లల్లో)
1).	2015-16	12706.35
2).	2016-17	14184.83
3)	2017-18	17597.00
4).	2018-19	20859.26
5).	2020-21	27288.72
6).	2021-22	30783.26
7)	2022-23	35145.10
8).	2023-24	36493.12
9)	2024-25	50 వేల కోట్లు (టార్గెట్)

మరొక యుద్ధంలోకి వెళ్తామేమోననే

భయంలో అమెరికా-సీబీఎస్ టీవీ



ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో హిజ్బుల్లా, అమెరికన్ దళాలు చేరే అవకాశంపై అమెరికా అధికారులు ఆందోళన చెందుతున్నారని సీబీఎస్ న్యూస్ శనివారం రిపోర్ట్ చేసింది. ఇజ్రాయెల్-లెబనీస్ సరిహద్దులో ఈ వారం పరస్పరం జరిగిన రాకెట్ దాడుల ఘటన పెద్ద యుద్ధాన్ని తలపించటమే కాకుండా, సిరియా, జోర్డాన్, ఇరాక్‌లలోని అమెరికన్ సైనిక దళాలపై ఇరాన్ మద్దతుగల మిలీషియాల దాడుల ప్రమాదాన్ని కూడా పెంచిందని సీబీఎస్ న్యూస్ తెలిపింది. గత అక్టోబరు నుంచి ఇజ్రాయెల్‌తో యుద్ధం చేస్తున్న హమాస్ మాదిరిగానే, హిజ్బుల్లాకు ఇరాన్ మద్దతు ఇస్తుంది. బైడెన్‌కు దౌత్య సలహాదారు అయిన అమోస్ హోచ్‌స్టెయిన్ సోమవారం ఇజ్రాయెల్‌కు వెళ్లి వివాదాన్ని తగ్గించే ప్రయత్నం చేయనున్నాడు.

సీబీఎస్ న్యూస్‌తో మాట్లాడిన గుర్తుతెలియని అమెరికా అధికారులు అనేక సమస్యాత్మక దృశ్యాలను ఎత్తిచూపారు. పశ్చిమ జెరూసలేం ద్వారా లెబనాన్‌లోకి లోతైన దాడులు చేయటానికి ఇజ్రాయెల్ మిలిటరీ భారీ దాడికి సన్నాహాలు చేసే అవకాశం ఉంది. సీబీఎస్ మూలాల ప్రకారం, పెరుగుతున్న హిజ్బుల్లా రాకెట్ దాడుల పరిమాణం ఇజ్రాయెల్‌ను 'అనుకోని యుద్ధానికి' దిగేలా రెచ్చగొట్టగలదని బైడెన్ పరిపాలన భయపడుతోంది. ఇజ్రాయెల్ లెబనాన్‌లోని హిజ్బుల్లాకు వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రారంభిస్తుందని ఈ అధికారులు ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. అది అమెరికా మద్దతు లేకుండా జరగదు.

ఇజ్రాయెల్-హిజ్బుల్లా ఉద్రిక్తతలను, హమాస్‌తో యుద్ధంలో కాల్పుల విరమణ ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించే ప్రయత్నాలను వాషింగ్టన్ "ఒకదానితో ఒకటి పెనవేసుకున్నట్లు" చూస్తుంది. ఏదైనా కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్-హిజ్బుల్లా ఉద్రిక్తతలపై "నిర్దిష్ట ఏర్పాట్లు" అవసరమని ఒక అమెరికా సీనియర్ అధికారి ఇటలీలో గురువారం విలేకరులతో అన్నాడు. "ఇప్పుడు టేబుల్‌పై ఉన్న బందీల విడుదల, కాల్పుల విరమణ ఒప్పందం గురించి చాలా ముఖ్యమైన విషయం ఏమిటంటే, అది సాధించినట్లయితే, అది ఇజ్రాయెల్ ఉత్తరాన ప్రభావం చూపుతుంది. కాబట్టి ఈ సంఘర్షణను పూర్తి ముగింపుకు తీసుకురావడానికి ఇది మాకు ఒక అవకాశం" అని సదరు అధికారి చెప్పాడు.

ఇటువంటి ఒప్పందం హమాస్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఉత్తర ఇజ్రాయెల్ నుంచి ఖాళీ చేయబడిన నిర్వాసితుల భద్రతా హామీల క్రింద వారి ఇళ్లకు తిరిగి రావడానికి వీలు కల్పిస్తుంది. లెబనీస్ సరిహద్దు సమీపంలోని నిర్వాసితులు ఎనిమిది నెలలకు పైగా స్థానభ్రంశం చెందడం వల్ల హిజ్బుల్లాతో ఏర్పడిన ఉద్రిక్తతలు ఇజ్రాయెల్‌లో "తీవ్రమైన రాజకీయ సమస్య"గా మారాయి. ఉత్తరాన ఉన్న ఇజ్రాయెల్ బ్రిగేడ్‌లు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. అయితే వారు ఇంకా దాడి చేసే స్థితిలో లేరని ఒక అమెరికా అధికారి సీబీఎస్ కి తెలిపాడు. "అక్టోబర్‌లో హమాస్ చేసిన ఆకస్మిక దాడికి భిన్నంగా, లెబనాన్‌లో హిజ్బుల్లాతో సాధ్యమయ్యే యుద్ధం గురించి ఇజ్రాయెల్ మిలిటరీ అనేక సంవత్సరాలుగా మల్లగుల్లాలు పడుతోంది" అని సీబీఎస్ తెలిపింది.

ప్రపంచ సమకం

ఉక్రెయిన్ శాంతి ప్రయత్నాల్లో

ఎక్కడో 'ఆశ సజీవం'-టర్కీ

మాస్కో, కీవ్‌ల నుంచి వచ్చిన శాంతి ప్రతిపాదనలు ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధానికి అంతిమ పరిష్కారానికి ముఖ్యమైన దశలు అని టర్కీ విదేశాంగ మంత్రి హకన్ ఫిదాన్ శనివారం స్విస్-ఆతిథ్యం పొందిన ఉక్రెయిన్ 'శాంతి సదస్సు'లో అన్నాడు. అంకారాకు చెందిన ఈ అగ్ర దౌత్యవేత్త కూడా యుద్ధం మరో ప్రపంచ యుద్ధానికి దారి తీయవచ్చని హెచ్చరించాడు. "మా ముందు ఉక్రేనియన్ శాంతి ప్రణాళిక ఉంది. రష్యా ఇటీవల కొన్ని షరతులను పంచుకుంది. షరతుల సారం ఎలా వున్నా శాంతి ప్రయత్నాలను ప్రారంభించడానికి ఆశ సజీవం అని స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్ రిసార్ట్‌లో ఫిదాన్ అన్నాడు.

ఈ కార్యక్రమానికి రష్యాను ఆహ్వానించలేదు. దీనిని "అల్టిమేటం ఇవ్వడానికి" పశ్చిమ దేశాల ప్రయత్నంగా రష్యా కొట్టిపారేసింది. అయితే, ప్రపంచ యుద్ధ ప్రమాదం ఉన్నందున ఇటువంటి సమావేశాలకు విలువ ఉంటుందని ఫిదాన్ వాదించాడు. "ఇది రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంగాకంటే మరింత విస్తృత యుద్ధంగా మారుతోందని, యుద్ధం భౌగోళికంగా ఉక్రెయిన్ దాటి వెళ్ళవచ్చు"నని ఫిదాన్ అన్నాడు. 2022 వసంతకాలంలో రష్యా, ఉక్రెయిన్ ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోవడంలో విఫలమైనప్పుడు, అంకారా మళ్లీ శాంతి చర్చలను సులభతరం చేయడానికి సిద్ధంగా ఉందని ఫిదాన్ చెప్పాడు. బర్గెన్‌స్టాక్ చర్చలలో రష్యా గనుక పాల్గొని వుంటే అది "మరింత ఫలవంతంగా ఉండేది" అని ఆయన అన్నాడు.



ఉక్రెయిన్ శాంతి చర్చల కోసం పుతిన్ షరతులు పెట్టాడు. శుక్రవారం ఈ విషయంపైన ప్రసంగిస్తూ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శాంతి కోసం అనేక షరతులను పెట్టాడు. దొనేత్సక్, లుగాన్స్క్ పీపుల్స్ రిపబ్లిక్‌లు, ఖెర్సన్, జాపోరోజీ ప్రాంతాల నుంచి ఉక్రేనియన్ దళాలను పూర్తిగా ఉపసంహరించు కోవాలి. ఎందుకంటే ఈ నాలుగు ప్రాంతాలు 2022 శరదృతువులో ఉక్రెయిన్‌ను విడిచిపెట్టి రష్యాలో చేరాలని ప్రజాభిప్రాయ సేకరణలో ఓటు వేశాయి. కీవ్, దాని పాశ్చాత్య మద్దతుదారులు ఈ ప్రాంతాలను, అలాగే క్రిమియాను రష్యా "చట్టవిరుద్ధంగా ఆక్రమించినట్లు" చూస్తారు. ఉక్రెయిన్ అధికారికంగా తటస్థ దేశంగా మారాలని, నాటోలో చేరడానికి దాని ప్రయత్నాలను విరమించుకోవాలని మాస్కో డిమాండ్ చేస్తోంది. పుతిన్ గతంలో అమెరికా నేతృత్వంలోని కూటమి తూర్పు వైపు విస్తరించడాన్ని ఈ యుద్ధానికి మూల కారణాలలో ఒకటిగా ఉదహరించాడు. అయితే ఉక్రెయిన్, దాని పాశ్చాత్య మద్దతుదారులు పుతిన్ ప్రతిపాదనలను తిరస్కరించారు. ఉక్రెయిన్ దాని 1991 సరిహద్దులకు పునరుద్ధరించబడాలని పట్టుబడుతున్నారు.

మెదక్ బంద్ ప్రశాంతం
బందోబస్తును పర్యవేక్షించిన ఐజీ



నవ తెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ పట్టణంలో శనివారం జరిగిన ఘర్షణ, పరస్పర దాడుల నేపథ్యంలో బీజేపీ, బీజేవైఎం ఆదివారం మెదక్ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు వ్యాపార, వాణిజ్య సంస్థలు, పెట్రోల్ బంక్‌లు, హోటళ్లు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఆర్టీసీ బస్సులు యదావిధిగా నడిచాయి. బస్టాండ్‌లు, చౌరస్తాల వద్ద పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేయడంతో పాటు పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహించారు. మల్టీజోన్ ఐజీ రంగనాథ్ మెదక్ పట్టణానికి వచ్చి, ఎస్పీ బాలస్వామితో కలిసి పరిస్థితిని సమీక్షించారు. శనివారం జరిగిన సంఘటనతో సంబంధం ఉన్న ఇరు గ్రూపులకు చెందిన పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఐజీ రంగనాథ్ మాట్లాడారు. రెండు వర్గాల మధ్య గొడవల్లో ఒకరినొకరు రెచ్చగొట్టుకోవడం, గొడవలు పడటం, దుకాణాలు, ఆస్పత్రులపై దాడులు చేయడం మంచి పద్దతి కాదన్నారు. ప్రజలను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల వారు శాంతి సామరస్యంతో మెలగాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకువచ్చి సామరస్యంగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ బాలస్వామి, ఏఎస్పీ మహేందర్, మున్సిపల్ చైర్మెన్ చంద్రపాల్, మాజీ చైర్మెన్ బట్టి జగపతి, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ గౌడ్, బీజేపీ జిల్లా నాయకులు నందారెడ్డి, గడ్డం కాశీనాథ్, మైనార్టీ నాయకులు ఖాజా మొహినొద్దీన్, జావేద్ మౌలానా, భారత్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు రానివ్వకుండా అడ్డుపడ్డ సెక్యూరిటీ గార్డ్..

- మనస్తాపంతో కార్మికుని ఆత్మహత్య
- పరిశ్రమ ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన
- పోలీసులు నచ్చజెప్పడంతో విరమణ



నవతెలంగాణ-హత్నూర

విధులకు రానివ్వకుండా సెక్యూరిటీ గార్డు అడ్డుకోవడంతో ఎస్‌సీఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు విద్యుత్ తీగలను పట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాదుల్‌నగర్ గ్రామానికి చెందిన మహేష్(35).. తుర్కల్ ఖానాపూర్ గ్రామ శివారులో ఉన్న ఎస్‌సీఎల్ పరిశ్రమలో కొన్నేండ్ల నుంచి పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం రాత్రి నైట్‌షిఫ్ట్ డ్యూటీకి వెళ్లగా.. ఐదు నిమిషాలు ఆలస్యం కావడంతో డ్యూటీలో తీసుకోబడదని గేటు వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డ్ అడ్డుపడ్డాడు. ఎన్నిసార్లు బతిమిలాడినా.. నచ్చజెప్పినా సెక్యూరిటీ గార్డ్ వినిపించుకోలేదు. దాంతో మనస్తాపానికి గురైన మహేష్.. పక్కనే ఉన్న 33 కేవీ విద్యుత్ తీగలను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. స్థానికులు మహేష్ కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు సమాచారం అందజేయగా.. మహేష్ మృతదేహంతో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న జిన్నారం సీఐ సుధీర్ కుమార్, హత్నూర ఎస్ఐ సుభాష్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని కుటుంబానికి న్యాయం చేకూర్చే విధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుభాష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య ప్రమీల, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

- ఈ ఏడాదిలో ఇది 11వ ఘటన

జైపూర్: రాజస్థాన్‌లోని కోటాలో వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయి. ఐఐటీ-జేఈఈకి సిద్ధమవుతున్న మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఈ ఏడాది ఇది 11వ ఘటన కావడం ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్‌లోని మోతీహారీకి చెందిన ఆయుష్ జైస్వాల్(17) గత రెండేండ్లుగా సామ్రాట్ చౌక్ ప్రాంతంలో ఉంటూ ఐఐటీ-జేఈఈకి సిద్ధమవుతున్నాడు. శనివారం రాత్రి అతడు గది బయటకు రాకపోవడంతో స్నేహితులు అద్దె ఇంటి యజమానికి తెలిపారు. ఆయన ఎన్ని సార్లు పిలిచినా ఆయుష్ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారమిచ్చాడు. వారు ఘటనా స్థలానికి చేరుకొని తలుపులు పగలగొట్టి చూడగా గదిలో ఉరేసుకుని కనిపించాడు. వెంటనే వారు ఆ విద్యార్థిని న్యూ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి కుటుంబానికి సమాచారం ఇచ్చామని.. వారు వచ్చిన తర్వాత పోస్టుమార్టం నిర్వహిస్తామని తెలిపారు.

మద్యం ఫ్యాక్టరీలో బాలల వెట్టి

- 50 మందిని రక్షించిన ఎన్‌సీపీసీఆర్ అధికారులు
- తర్వాత కనిపించని చిన్నారులు



భోపాల్: పుస్తకాలు పట్టుకుని చదువుకోవాల్సిన ఆ చిట్టి చేతులు వెట్టి పనులు చేస్తున్నాయి. ఈ విషయమై ఫిర్యాదునందుకున్న నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్) ఆ ఫ్యాక్టరీపై దాడి చేసింది. అక్కడ పనిచేస్తున్న సుమారు 50 మంది బాలలను రక్షించింది. కానీ ఆ చిన్నారులంతా ఆ తర్వాత అక్కడ కనిపించకుండా పోయారు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని రైసిన్ జిల్లాలో జరిగింది. సెహత్‌గంజ్‌లోని సోమ్ డిస్టిలరీస్, బ్రూవరీస్‌లో బాల కార్మికులతో పనులు చేయిస్తున్నట్లు బచ్‌పన్ బచావో ఆందోళన్ సంస్థ నుంచి తమకు ఫిర్యాదు అందిందని ఎన్‌సీపీసీఆర్ చైర్మన్ ప్రియాంక్ కనుంగో తెలిపారు. శనివారం తమ బందంతో కలిసి అక్కడ దాడి చేసినట్లు చెప్పారు. సుమారు 50 మంది బాల, బాలికలను రక్షించినట్లు వెల్లడించారు. కాగా, పిల్లలను స్కూల్ బస్సులో మద్యం ఫ్యాక్టరీకి తరలించి పనులు చేయిస్తున్నట్లు తమకు తెలిసిందని ప్రియాంక్ కనుంగో తెలిపారు. రసాయనాల వల్ల పిల్లల చేతులు పాడయ్యాయని అన్నారు. రక్షించిన పిల్లలను అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. కానీ కొన్ని గంటల తర్వాత ఆ పిల్లలు మద్యం ఫ్యాక్టరీ నుంచి మాయమయ్యారని ఎన్‌సీపీసీఆర్ చైర్మెన్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. మరోవైపు మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ఈ దాడిపై స్పందించారు. కార్మిక, ఎక్సైజ్, పోలీసు శాఖల నుంచి పూర్తి సమాచారాన్ని కోరినట్లు తెలిపారు. తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్స్‌లో పేర్కొన్నారు.

మా భూములు లాక్కోవద్దు

మంత్రి కోమటిరెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకున్న రింగురోడ్డు నిర్వాసితులు

- రోడ్డున పడేయొద్దంటూ వేడుకోలు



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

రింగ్ రోడ్డు నిర్మాణం కోసం తమ భూములను లాక్కోవద్దని కోరుతూ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కాన్వాయ్‌ని ఆదివారం నిర్వాసితులు అడ్డుకొని ఆందోళన చేపట్టారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలం ధర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ దేవి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యేందుకు వెళుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాన్వాయ్‌ని నిర్వాసితులు అడ్డుకున్నారు. తమ బతుకులు రోడ్డున పడేయొద్దంటూ మంత్రిని వేడుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ.. రెండు నెలలుగా తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నా ఎవరూ తమను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలైన్‌మెంట్ 3 ప్రకారం కాకుండా అలైన్‌మెంట్ 1 ప్రకారం రింగురోడ్డును నిర్మించి తమ ఇండ్లు, ప్లాట్లకు రక్షణ కల్పించాలని కోరారు. అయితే ఇప్పటికే రోడ్డు నిర్మాణ ప్రక్రియ పూర్తైందని మంత్రి చెప్పడంతో నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు.

మంత్రి పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటా : కవిత, కేశరాజుపల్లి, భూనిర్వాసితురాలు



అలైన్‌మెంట్ 3 ప్రకారం రింగ్ రోడ్డు నిర్మిస్తే మంత్రి వెంకట్‌రెడ్డి పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటా. తనకు ఎస్ఎల్‌బీసీ వద్ద 201 గజాల ప్లాటు ఉంది. దాన్ని కట్నం కింద రూ.30 లక్షలకు తన అల్లునికి ఇచ్చా. ప్రస్తుతం రింగ్ రోడ్డు నిర్మాణం వల్ల ప్లాటు మొత్తం పోతుండటంతో అల్లుడు తన బిడ్డను పుట్టింటికి పంపించాడు. ఇప్పుడు మేం ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నాం. తమకు న్యాయం చేయాలి.

మంత్రికి తప్పుడు సమాచారం : విజయలక్ష్మి, భూనిర్వాసితురాలు



రింగ్ రోడ్డు నిర్మాణం వల్ల జరుగుతున్న నష్టంపై కొంతమంది మంత్రి వెంకట్‌రెడ్డికి తప్పుడు సమాచారం అందిస్తున్నారు. అలైన్‌మెంట్ 3 ప్రకారం రోడ్డు నిర్మాణం చేపడితే 2800 ప్లాట్లు, 200 ఇండ్లు కోల్పోవాల్సి వస్తుంది. అయితే మంత్రి మాత్రం కేవలం 60 మందికి మాత్రమే నష్టం కలుగుతుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తమకు సమయం ఇస్తే మూడు వేల మంది నిర్వాసితులతో కలుస్తాం.

తనకు మెడికల్ కళాశాల ఎదుట 400 గజాల ప్లాటు ఉంది. ప్రస్తుతం ఇక్కడ గజం ధర రూ.20,000. ప్రభుత్వం మాత్రం నష్టపరిహారం కింద గజానికి నాలుగైదు వేలు ఇస్తే ఎలా? అప్పులు చేసి ప్లాటును కొనుగోలు చేస్తే.. అప్పు కూడా తీర్చకముందే ఆ ప్లాటు పోయే పరిస్థితి వచ్చింది. రింగ్ రోడ్డు నిర్మాణంపై పునరాలోచన చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం.

చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలో అగ్నిప్రమాదం

- దయాలసిస్ సెంటర్‌లో కొంత భాగం దగ్ధం
- బయటకు పరుగులు తీసిన రోగులు, ఆస్పత్రి సిబ్బంది
- ఫైర్ ఎక్స్ విషర్‌తో మంటలార్పిన సిబ్బంది
- ఆస్పత్రిని సందర్శించిన రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ దాక్టర్ అజయ్‌కుమార్



నవతెలంగాణ-చేవెళ్ల

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్‌తో దయాలసిస్ సెంటర్‌లో మంటలు చెలరేగాయి. మంటలు, పొగ చూసిన సిబ్బంది, ఆస్పత్రిలోని రోగులను బయటకు పంపించారు. సిబ్బంది కూడా బయటకు పరుగులు తీశారు. దయాలసిస్ సెంటర్‌కు తాళం వేసి ఉండటంతో మంటలు ఎక్కువయ్యాయి. ఈ విషయాన్ని పోలీస్, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. అంతలోపే దయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి వచ్చి ఫైర్ ఎక్స్ విషర్ మిషన్‌తో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఫైర్ సిబ్బంది మిగతా మంటలను ఆర్పి వేశారు. అప్పటికే ఆస్పత్రిలోని ఫైల్స్, దయాలసిస్ వైద్య పరికరాలు కాలిపోయాయి. విద్యుత్ అధికారులు ఆస్పత్రికి చేరుకొని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఎస్ఐ ప్రదీప్ కుమార్ తన సిబ్బందితో ఆస్పత్రికి చేరుకొని షార్ట్ సర్క్యూట్ సంబంధించిన వివరాలను తెలుసుకొని పరిస్థితిని సమీక్షించారు. ఫైర్ జరిగిన సమయంలో కాన్పు నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన గర్భిణీలు, పలువురు బాలింతలు, కొంతమంది ఇన్ పేషెంట్స్ ఉన్నారు. ఆస్పత్రిలో కరెంటు నిలిచిపోవడంతో రోగులు గంటల తరబడి బయటే ఉండాల్సి వచ్చింది. కాగా, పాడైపోయిన వైరింగ్, ఆస్పత్రిలో అంతర్గత విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడమే అగ్ని ప్రమాదానికి కారణమని విద్యుత్ అధికారులు స్పష్టం చేశారు. దయాలసిస్ సెంటర్ రాత్రి వేళలో నిర్వహణ జరగదు. అదే పగలు జరిగి ఉంటే దయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉండేది. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

ఆస్పత్రిని సందర్శించిన రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ దాక్టర్ అజయ్ కుమార్

విధుల పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ తెలిపారు. శనివారం రాత్రి చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలోని దయాలసిస్ సెంటర్‌లో జరిగిన అగ్ని ప్రమాదాన్ని పరిశీలించేందుకు ఆదివారం ఆయన ఆస్పత్రిని సందర్శించారు. ప్రమాదానికి కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మరోసారి ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో వెంటనే స్పందించిన సిబ్బందిని అభినందించారు. సాయింత్రంలోగా దయాలసిస్ సెంటర్‌లోని విద్యుత్తును సరి చేయడంతో పాటు రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సోమవారం నుంచి యధావిధిగా దయాలసిస్ సేవలు అందించాలని తెలియజేశారు.

నిందితుడికి చట్టప్రకారం శిక్ష పడేలా చూస్తాం

- రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క
- పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఆరేండ్ల బాలికపై దాడి జరిగిన సంఘటనా స్థలం పరిశీలన
- బాధిత కుటుంబానికి రైస్ మిల్ నుంచి రూ.5.50 లక్షలు,
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరో రూ.2.50లక్షల నష్ట పరిహారం
- చిన్నారి తండ్రికి ఉద్యోగం ఇస్తామని హామీ



నవతెలంగాణ - సుల్తానాబాద్

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి రైస్ మిల్లులో ఆరేండ్ల బాలికపై జరిగిన సంఘటన అమానుషమని, నిందితుడికి చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలోని మమత ఇండస్ట్రీస్‌లో ఈనెల 14న ఆరేండ్ల బాలికపై దాడి జరిగిన సంఘటనా ప్రదేశాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, చింతకుంట విజయ రమణారావుతో కలిసి మంత్రులు పరిశీలించారు. రామగుండం సీపీ శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. చిన్నారి తల్లిదండ్రులు నిద్రపోయే సమయంలో రైస్ మిల్లులో పని చేసే బీహార్‌కు చెందిన వ్యక్తి తల్లిదండ్రుల దగ్గర నుంచి పాపను ఎత్తుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్టు తెలిపారు. ఈ సంఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి దురలవాట్లకు గురైన వారు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పోలీసు శాఖ మరింత భద్రత కల్పన, నిఘా పెంపు, డ్రగ్స్ మాదక ద్రవ్యాలు, గంజాయిపై చర్యలు తీసుకోవాలన్నారు. బాలిక అదృశ్యంపై సమాచారం అందిన వెంటనే నిమిషాల్లో పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి తనిఖీలు చేసి విచారించి నిందితుడిని పట్టుకున్నారని తెలిపారు. చిన్నారి బాలికను ఆ కిరాతకుడు దారుణంగా హత్య చేయడమనేది ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణించిందన్నారు. ఈ కేసులో నిందితుడికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో త్వరితగతిన శిక్ష పడే విధంగా ఆధారాలు ప్రవేశపెట్టడం జరుగుతుందని అన్నారు. బాధిత కుటుంబానికి సంబంధిత రైస్ మిల్లు నుంచి రూ.5.50లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం తరపున మరో రూ.2.50లక్షలు చిన్నారి కుటుంబానికి అందించాలని నిర్ణయించారు.

అదానీ గ్రూపునకు నో

- 'మహా' ప్రభుత్వ శాఖలకు ధారవి భూమి బదిలీ
- అదానీ.. ప్రాజెక్ట్ డెవలపర్ మాత్రమే : విశ్వసనీయ వర్గాల వెల్లడి



ముంబయి : కోట్లాది రూపాయల ధారావి మురికివాడల పునరాభివృద్ధి ప్రాజెక్టులో అదానీ గ్రూప్‌నకు భూబదలాయింపు ఉండదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే, మహారాష్ట్ర ప్రభుత్వ శాఖలకు ఈ భూమి బదిలీ ఉంటుందని సమాచారం. అదానీ గ్రూపు.. ప్రాజెక్ట్ డెవలపర్ మాత్రమేననీ, ఇండ్లను నిర్మించి ఆసియాలోని అతిపెద్ద మురికివాడల నివాసితులకు అందించటానికి ప్రభుత్వ శాఖలకు అప్పగిస్తుందని తెలిపాయి. ఎంపీ వర్షా గైక్వాడ్ చేసిన భూకబ్జా ఆరోపణలను ఖండిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ గృహనిర్మాణ శాఖకు చెందిన ధారావి రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్(స్లమ్ రిహాబిలిటేషన్ అథారిటీ) (డీఆర్‌పీలేదా ఎస్ఆర్ఏ)కి మాత్రమే భూ బదిలీ జరుగుతుందని ప్రాజెక్టుతో సంబంధమున్న విశ్వసనీయ వర్గాలు చెప్పాయి.

బహిరంగ అంతర్జాతీయ బిడ్డింగ్‌లో ధారావి స్లమ్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌ను గెలుచుకున్న అదానీ గ్రూప్, మహారాష్ట్ర ప్రభుత్వంతో తన జాయింట్ వెంచర్ కంపెనీ ధారావి రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ప్రయివేట్ లిమిటెడ్(డీఆర్‌పీపీఎల్) ద్వారా అద్దెలు - హౌసింగ్, వాణిజ్య నిర్మాణాలను నిర్మిస్తుంది. వాటిని మళ్లీ డీఆర్‌పీ లేదా ఎస్ఆర్ఏకి సర్వే ఫలితాల ప్రకారం కేటాయింపు కోసం మహారాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తుంది. ప్రాజెక్ట్‌పై అపోహలను తొలగించేందుకు ప్రయత్నిస్తూ, టెండర్ ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం భూమిని డీఆర్‌పీ లేదా ఎస్ఆర్ఏకు కేటాయించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. డీఆర్‌పీపీఎల్ అభివృద్ధికి డిమాండ్ మేరకు ప్రభుత్వానికి చెల్లించాలి.

ధారవి నివాసితుల కోసం మొదటి పునరావాస యూనిట్లను నిర్మించాల్సిన రైల్వే భూమి కేటాయింపు అంశంపై టెండర్ వేయటానికి ముందే డీఆర్‌పీకి కేటాయించామనీ దీనికి డీఆర్‌పీపీఎల్ 170 శాతం ప్రీమియం చెల్లించిందని సదరు వర్గాలు తెలిపాయి.

బడి ఎలా నడపాలి?

(మొదటిపేజీ తరువాయి)

ఖర్చుచేశారు. బడి నిర్వహణకు కావాల్సిన గ్రాంట్స్ మంజూరు చేయలేదు. దాంతో పాఠశాలల ప్రారంభం రోజున అవసరమయ్యే చాక్‌పీస్‌లు, డస్టర్లు, రిజిష్టర్‌లతో పాటు పారిశుధ్య నిర్వహణకు అవసరమయ్యే ఫినాయిల్, బ్రేష్, తదితర సామగ్రి వంటివి సొంత డబ్బులతో కొనుగోలు చేశారు. అంతేకాకుండా పాఠశాలల నిర్వహణ నిమిత్తం గతంలో నియమించిన స్కావెంజర్‌లను తీసివేసిన గత ప్రభుత్వం ఆ బాధ్యతను పంచాయతీలు, మున్సిపాలిటీలు, హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీకి అప్పగించింది. అయితే ఇప్పటికే పనిభారంతో ఇబ్బంది పడుతున్న జీహెచ్‌ఎంసీ, పంచాయతీలు, మున్సిపల్ కార్మికులు కేవలం పాఠశాలల ప్రాంగణాలు తప్ప.. పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో పాఠశాలలు కంపుకొట్టే స్థితికి చేరుకుంటున్నాయి. గత విద్యాసంవత్సరం నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో జిల్లాలోని అనేక పాఠశాలలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఫలితంగా అరకొర వసతుల నడుమే విద్యార్థులు కాలం వెళ్లదీశారు. బడుల ముగింపు సమయంలో నిధులు రావడంతో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభించలేదు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఈ ఏడాదైనా స్కూల్ గ్రాంట్స్ మంజూరు విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

తక్షణమే 50శాతం స్కూల్ గ్రాంటు విడుదల చేయాలి :

ఏ.శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి, టీఎస్‌యూటీఎఫ్, హైదరాబాద్ జిల్లా

రిజిస్టర్‌లు, స్టేషనరీ లాంటి వస్తువులు కొనాలంటే ప్రధానోపాధ్యాయులు తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. స్కూల్ గ్రాంట్స్ ఆలస్యంగా ఇవ్వడం వలన పారదర్శకత లోపించే అవకాశం ఉంది. పారదర్శకంగా నిధుల ఖర్చు జరగాలంటే పాఠశాలల నిర్వహణకు కనీసం 50 శాతం నిధులు వెంటనే విడుదల చేయాలి. ఈ నిధులు విద్యసంవత్సరం ప్రారంభంలోనే ఇవ్వడంతో అవసరమైన వస్తువులను కొని పాఠశాలలను విజయవంతంగా నడిపే అవకాశం ఉంటుంది. నూతన ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలి.

జగన్ ఇంటి నిర్మాణాల కూల్చివేతలో ట్విస్ట్

- ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌పై బదిలీ వేటు
- జీహెచ్‌ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఉత్తర్వులు జారీ
- ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా కూల్చివేతలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ లోటస్ పాండ్ వద్ద ఏపీ మాజీ సీఎం జగన్ ఇంటి ముందు గల అక్రమ నిర్మాణాల కూల్చివేత అంశం సర్వత్రా చర్చకు దారి తీసింది. బల్దియా అధికారులు కూల్చివేయడం చర్చానీయాంశమైంది. దీనిపై జీహెచ్‌ఎంసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా వైఎస్ జగన్ ఇంటి ముందు నిర్మాణాలు, షెడ్ల కూల్చివేతలకు ఆదేశాలు జారీ చేసిన ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్‌పై బదిలీ వేటు పడింది. సాధారణ పరిపాలన విభాగానికి అటాచ్ చేస్తూ జీహెచ్‌ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు జారీ చేశారు. ఏపీ సీఎంగా ఉన్న ఐదేండ్ల సమయంలో వైఎస్ జగన్.. తాడేపల్లిలో ఉంటున్నారు. దాంతో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని లోటస్ పాండ్‌లో ఉన్న జగన్ ఇంటికి ఏపీ పోలీసులు భద్రత కల్పించారు. ఆ ఇంటి ముందు విశాలమైన ఫుట్‌పాత్ ఉంటుంది. పర్మిషన్ లేకుండా ఫుట్‌పాత్ స్థలాన్ని ఆక్రమించి సెక్యూరిటీ రూములు నిర్మించారంటూ స్థానికులు పలుమార్లు గ్రేటర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, తరచూ ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తుతున్నాయనే కారణంతో వాటిని తొలగి స్తామని శుక్రవారం సాయంత్రం జీహెచ్‌ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేసి శనివారం కూల్చివేశారు. కాగా, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా జగన్ ఇంటి ముందు కూల్చివేతలు చేపట్టారని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బోర్కడేను జీహెచ్‌ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అతన్ని బదిలీచేసి జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. కాగా, ఈ ఘటనంతా జగన్ ఇంటి పక్కనే నివాసం ఉండే ఓ మంత్రి ఆదేశాలతోనే జరిగిం దని తెలుస్తోంది. ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి సమాచారం లేకుండా మంత్రి మాట పట్టుకుని కూల్చివేతలకు పాల్పడినందుకు హేమంత్ వేటుకు గురయ్యారని సమాచారం.

విశిష్ట గుణాల మేలు కలయిక రామోజీరావు

- ఎడిటర్ ఎం. నాగేశ్వరరావు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

విశిష్ట గుణాల మేలు కలయిక ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు అని ఈనాడు ఏపీ ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు చెప్పారు. తెలుగువారికి ఎనలేని ఖ్యాతి తెచ్చారని కొనియాడారు. ఆయన జీవితం నుంచి నేర్చుకోవాల్సినవి ఎన్నో అంశాలున్నాయని వివరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనాడు ఉద్యోగుల ఆధ్వర్యంలో రామోజీరావు వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈనాడు తెలంగాణ సంపాదకులు డీఎన్ ప్రసాద్, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, సీనియర్ జర్నలిస్ట్ కె. రామచంద్రమూర్తి, నమస్తే తెలంగాణ సంపాదకులు కృష్ణమూర్తి, తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్ తదితరులు మాట్లాడారు.

బీజేపీకి పెత్తందారీ కులాల మద్దతు

- ఎన్నికల్లో కాషాయ కూటమికే వారి ఓటు
- ఆ వర్గాలను ఓటు బ్యాంకుగా మార్చుకున్న కమలం పార్టీ : రాజకీయ విశ్లేషకులు



న్యూఢిల్లీ : ఓటు బ్యాంకు రాజకీయాలు ప్రజాస్వామ్య దేశంలో మంచిది కాదని చెప్పే బీజేపీ.. తన వరకు వచ్చేసరికి అవేమీ వర్తించవనే విధంగా వ్యవహరిస్తున్నది. సాధారణంగా, భారత రాజకీయాల్లో ముస్లింలు, దళితులను తరచుగా 'ఓటు బ్యాంకులు'గా చూస్తాయి పార్టీలు. అయితే, అదే దారిలో పెత్తందారీ కులాల ఓటు బ్యాంకు కూడా ఏర్పడిందనీ, అది ఈ ఎన్నికల్లో స్పష్టమైందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. వీరు ఈ సారి కూడా గంపగుత్తగా ఓటు వేశారనీ, బీజేపీకి వారి మద్దతు లభించిందని అంటున్నారు.2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ముస్లింల నుంచి బలమైన మద్దతు, కీలక రాష్ట్రాలలో ఓబీసీల నుంచి మద్దతు పెరగటంతో పాటు దళిత సంఘంలోని ఓటరు బేస్‌లోని ఒక విభాగం ఇండియా కూటమి వైపు వెళ్లింది. దీంతో అయోధ్య వంటి ప్రదేశాల్లోనూ ఈ కూటమి.. ఎన్డీయేను ఓడించగలిగిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ది హిందూలో ప్రచురించబడిన సీఎస్‌డీఎస్-లోక్‌నీతి వివరణాత్మక సర్వే ప్రకారం.. హిందువులలో 60 శాతం మంది పెత్తందారీ కులాలు ఎన్డీఏకు మద్దతుగా నిలిచాయి. ఇందులో 53 శాతం మంది బీజేపీ వెనుక, ఏడు శాతం మంది బీజేపీ మిత్రపక్షాల వైపు నిలిచారు. కాగా, ఈ మొత్తం దాదాపు 2019 లోక్‌సభ ఎన్నికలతో సమానం. భారత్‌లోని కొన్ని రాష్ట్రాల్లో ఈ గణాంకాలు మరింత కీలకంగా మారాయని విశ్లేషకులు అంటున్నారు.

కేసీఆర్ లేఖపై నిపుణులతో చర్చిస్తున్నాం

- అభ్యంతరాలపై పున:పరిశీలన జరుపుతాం

పవర్ కమిషన్ చైర్మెన్ జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యుత్ కొనుగోళ్లపై వివరణ ఇస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాసిన లేఖపై నిపుణులతో చర్చిస్తున్నామని పవర్ కమిషన్ చైర్మెన్ జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి తెలిపారు. లేఖలోని అంశాలపై ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ తన లేఖలో పలు అంశాలను ప్రస్తావించారనీ, ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ అంశాల్లోని కొన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చారని తెలిపారు. ఎవరికైనా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే స్వేచ్ఛ ఉంటుందని పేర్కొన్నారు. కేసీఆర్ అభ్యంతరాలపై పున్ణపరిశీలన జరుపుతామని వివరించారు. విచారణలో జరిగిన పరిణామాలను మాత్రమే తాను మీడియాకు వివరించాననీ, ఎవరి అభ్యంతరాలు వారికి ఉండటం సహజమని ఆయన చెప్పారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
సోమవారం | జూన్ 17, 2024 | www.navatelangana.com

త్యాగానికి ప్రతీక బక్రీద్

ఏసీపీ మహమ్మద్ గౌస్



నవతెలంగాణ - సంతోష్‌నగర్

త్యాగానికి ప్రతీక బక్రీద్ అని యాకుత్‌పురా నియోజక వర్గం సంతోష్‌నగర్ సౌత్ ఈస్ట్ జోన్ ఏసీపీ మహమ్మద్ గౌస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిని, త్యాగ గుణాన్ని బక్రీద్ పండుగ చాటి చెప్పిందని అన్నారు. తమకు కలిగిన దాంట్లో నుంచి ఇతరులకు పంచి పెట్టడానికి మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ పండుగ కలిగిస్తుందని వివరించారు. ఆయన వెంట సీఐలు, డీఐలు, ఎస్సైలు, ఏఎస్ఐలు సిబ్బందులు తదితరులు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి

సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ జానకి ధారావత్



నవతెలంగాణ - సంతోష్‌నగర్

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ జానకి ధారావత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె మాట్లాడుతూ సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముస్లిం సోదరులు నమాజ్‌కు వచ్చేటప్పుడు, పోయేటప్పుడు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రజలను కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలు పోలీసులకు తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. పటిష్ట బందోబస్తుతో పాటు నిఘా నేత్రాలను, డ్రోన్ కెమెరాల సహాయంతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని సూచించారు.



ప్రతిభావంతులైన
వైశ్య పురుషులకు సత్కారం

- వైశ్య లైమ్‌లైట్ అవార్డ్స్ ఫర్ మెన్ పేరిట పురస్కారం
- అవార్డులు అందజేసిన ఐటీ మంత్రి

నవతెలంగాణ-సిటీబ్యూరో

వైశ్య సంఘంలో అత్యుత్తమ ప్రతిభను చాటే ప్రతిభావంతులకు వైశ్య లైమ్‌లైట్ అవార్డ్స్ ఫర్ మెన్ శనివారం రాత్రి ఫిల్మ్‌నగర్‌లోని జెఆర్సీ కన్వెన్షన్‌లో జరిగింది. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ హోస్ట్ చేయగా, మానేపల్లి జ్యువెలర్స్ చొరవ ద్వారా నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం దేశవ్యాప్తంగా అద్భుతమైన విజయాలు సాధించిన 18మంది వైశ్య పురుషులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరు కాగా, వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు మాజీ చైర్మెన్ కోలేటి దామోదర్, తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మాజీ చైర్మెన్ లక్ష్మీనారాయణ అమరవాది, తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గౌరవ అతిథులుగా హాజరై అవార్డులను అందజేశారు. ఎమ్మడి శివ కుమార్ స్థాపించిన వైశ్య లైమ్‌లైట్ అవార్డులు, వైశ్య సంఘంలో ప్రత్యేకత, గుర్తింపు కోసం పని చేస్తోంది. మెరిటోక్రసీ, పారదర్శకత పట్ల స్థిరమైన నిబద్ధతతో, ఈ అవార్డులు అపారమైన ప్రజాదరణను పొందడమే కాకుండా వారి సంబంధిత రంగాలలో ఔన్నత్యాన్ని అధిరోహించిన వ్యక్తులను గుర్తించి గౌరవిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాషన్ షో, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిన ప్రదర్శించారు. వేడుకల్లో సత్కరించిన 18 మంది అవార్డు గ్రహీతల్లో ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, క్రీడాకారులతో సహా విభిన్న నేపథ్యాలకు చెందిన వ్యక్తులు ఉన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

- ఉప్పల శ్రీనివాస గుప్త



నవతెలంగాణ- నాగోల్

ఆర్యవైశ్యులు కేవలం వ్యాపారాలకే పరిమితం కాకుండా సామాజిక సేవలతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. ఓల్డ్ మల్కాజిగిరిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం జరిగిన ఆర్యవైశ్య సంఘం మల్కాజిగిరి నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి అయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు కేవలం వ్యాపారాలకే పరిమితం కాకుండా సామాజిక సేవలో మరియు రాజకీయాల తో పాటు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వైశ్యుల ఎన్నో ఏండ్ల కల ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 6 గ్యారెంటీలను నిరుపేద వైశ్యులకు అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నామినేటడ్ పదవుల్లో ఆర్యవైశ్యులకు అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దేశ వ్యాప్తంగా 17 కోట్ల మంది వైశ్యులను ఏకం చేయడమే అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ లక్ష్యం అని అన్నారు. అనంతరం నూతన కమిటీలో అధ్యక్షుడిగా శ్రీ పాత శ్రీనివాస్ గుప్త, కార్యదర్శిగా అలంపల్లి సురేష్ గుప్త, కోశాధికారి బి వి ఎస్ గుప్త, మహిళా విభాగం అధ్యక్షురాలుగా గీత రాణి, కార్యదర్శిగా ఉమా మహేశ్వరి, కోశాధికారిగా శారదలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, బీజేపీ నాయకులు ప్రభు గుప్త, ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీ చంద నాగభూషణం గుప్త, జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ గుప్త, ఐవిఎఫ్ తెలంగాణ కార్యదర్శి పబ్బ చంద్ర శేఖర గుప్త, మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ గుప్త, శ్రీనివాస్ గుప్త, సాయి బాబా గుప్త తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని
కలసిన కార్పొరేటర్ సుజాత

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలో ఉన్న మూసానగర్ ప్రాథమిక పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా పునరుద్ధరిస్తున్నట్టు జీఓ వెలువడిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం కార్పొరేటర్ సుజాతా నాయక్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో పలు మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. అనంతరం ఈ ప్రక్రియలో భాగమైన ప్రభుత్వ అధికారులకు కార్పొరేటర్ సుజాతా నాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

బాధ్యతగా సంక్షేమ పాలన అందిస్తా



- ఎంపీ ఈటల రాజేందర్

నవతెలంగాణ - హయత్‌నగర్

మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికలలో నియోజకవర్గ ప్రజానీకం నాపై ఎంత నమ్మకంగా, బాధ్యతగా ఓట్లు వేసి గెలిపించారో అంతే బాధ్యతగా...రాజకీయాలకతీతంగా మంచి సంక్షేమ పాలనను అందిస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిచిన సందర్భంగా ప్రజల వద్దకే వచ్చి కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమంలో భాగంగా మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి నేతృత్వంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ పెద్ద చెరువు ప్రాంగణంలో చెట్ల మొక్కలు నాటిన అనంతరం వివిధ కాలనీల సంక్షేమ సభ్యులతో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ప్రజలకు పాలనను అందిస్తానని హామీ ఇచ్చారు. తమ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి కార్పొరేటర్లకు పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నాయకత్వ సహకారంతో చట్టసభల్లో మంచి విప్లవాత్మక మార్పులు చేసే దానిలో మా నాయకుడు ఉంటాడని తల ఎత్తుకునేలా నా నియోజవర్గ ప్రజలు చెప్పుకునే విధంగా పేరు తెచ్చుకుంటానని హామీ ఇచ్చారు. నా గెలుపులో కీలక బాధ్యతలు నిర్వహించిన నాయకులకు, కార్యకర్తలకు, వివిధ సంఘాల నాయకులకు, ఓట్లు వేసిన గెలిపించిన మల్కాజ్గిరి ప్రజానీకానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామారంగారెడ్డి, కొత్త రవీందర్ గౌడ్, కుంట్లూరు వెంకటేష్ గౌడ్, వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, వివిధ కాలనీల సంక్షేమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువ న్యాయవాదులను
సొసైటీలో భాగస్వామ్యం చేయాలి



- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి

నవతెలంగాణ - నాగోల్

న్యాయవాదుల పరస్పర సహకార సొసైటీలోకి రానున్న రోజుల్లో యువ న్యాయవాదులకు భాగస్వామ్యం చేయాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి అన్నారు. నాగోలులోని శుభం కన్వెన్షన్‌లో న్యాయవాదుల పరస్పర సహకార సంఘం రజతోత్సవాల్లో భాగంగా 13వ సాంస్కృతిక సమావేశంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మాట్లాడుతూ..సొసైటీ ఓ వ్యక్తితో ప్రారంభమై ఓ వ్యవస్థగా నిర్మాణమైందని హర్షం వ్యక్తం చేశారు. 6 వేల మంది న్యాయవాదులకు ఆరోగ్య పర్యంగా చేయూతనందిస్తుందని తెలిపారు. సొసైటీలో ఉన్న సభ్యులందర్నీ సంస్థ అందుకుంటుందని చెప్పారు. ఇది నవ నిర్మాణానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. రానున్న రోజులల్లో సొసైటీలో కొత్త వారికి సభ్యత్వం ఇవ్వాలని కోరారు. రూపాయితో మొదలైన సొసైటీ నేడు రూ.800 కోట్లుకు చేరుకుందని తెలిపారు. అందరూ కలిసి కట్టుగా ఉండి సొసైటీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిన సొసైటీ సభ్యుల పిల్లలను అభినందించి, మెమెంటోను అందజేశారు.

ఈ సమావేశంలో జస్టిస్ కె. సురేందర్, జస్టిస్ నాగేష్ భీమపాక, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి రేణుక యారా, సిటీ స్మాల్ కాజెస్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి నందికొండ నర్సింగ్‌రావు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సురేష్, రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి శశిధర్‌రెడ్డి, మేడ్చల్ సెషన్స్ జడ్జి బాల భాస్కర్‌రావు, వికరాబాద్ జిల్లా జడ్జి శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదుల పరస్పర సహాయ సహకార సంఘం అధ్యక్షులు అనిల్‌కుమార్, కార్యదర్శి చెట్టిరవి, కన్వీనర్ బుచిబాబు, బార్ కౌన్సిల్ సభ్యులు ఫణీంద్ర భార్గవ్, అనంతసేన, కొండల్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, మాజీబార్ కౌన్సిల్ అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, శాయిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవో సెంట్రల్ యూనియన్
కమిటీ ఉపాధ్యక్షుడిగా పర్వతాలు



నవతెలంగాణ - బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపల్‌లో మేనేజర్ గా పనిచేస్తున్న ఆమనగల్ మండలం మాలేపల్లి గ్రామానికి చెందిన తెల్గమల్ల పర్వతాలు టీఎన్‌జీవో నాన్ గెజిటెడ్ సెంట్రల్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు టీఎన్‌జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు ఎం.జగదీశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2023 నుండి 2026 వరకు 3 సంవత్సరాల పాటు పదవీలో కొనసాగుతారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా రెండో సారి విజయం సాధించడం విశేషం. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ టీఎన్‌జీవో యూనియన్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా టీఎన్‌జీవో నాన్ గెజిటెడ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాన్ గెజిటెడ్ ఉద్యోగ సంఘం కుటుంబాలకు యూనియన్ తరఫున అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తన నియామకానికి పూర్తి సహాయ సహకారాలు అందించిన రాష్ట్ర అధ్యక్షులు మర్రం జగదీశ్వర్ కు, మద్దతు తెలిపిన సెంట్రల్ యూనియన్ కమిటీ సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు అర్థం కావట్లేదు



- బీజేపీ రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్ రెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం ఆరు మాసాల కాలంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ..తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు ఎవ్వరికీ అర్థం కావడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాలోని మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తామని చెప్పడం అర్థ రహితమన్నారు. రంగారెడ్డి జిల్లా ఉనికిని తొలగించడానికి కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ మధ్య ఉన్న విభేదాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. బాలాపూర్‌లో ఉన్న తహశీల్దార్ కార్యాలయాన్ని బడంగ్‌పేట్‌కు మార్చడం ఇందుకు నిదర్శనమన్నారు. చేవెళ్ల, మల్కాజిగిరి, మహబూబ్ నగర్ జిల్లాలో బీజేపీ విజయ దుందుభి మోగించడంతో అధికార పార్టీకి ఎటు తోచడం లేదన్నారు.

స్వార్థ రాజకీయాలతో ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడంతో అభివృద్ధిలో వెనుక బడిపోతుందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిన్న ప్రాంతాలలోనే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం వలన పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. భారత రాజ్యాంగంపై కాంగ్రెస్ పార్టీకి గౌరవం లేదన్నారు. సకల జనుల సమ్మెతో ఎంతో మంది పోరాటంతో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నారని గుర్తుచేశారు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్పొరేటర్ భిక్షపతి చారి, రామిడి మహేందర్ రెడ్డి, రాజ శేఖర్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీ ఆదరాభిమానాలను ఎప్పటికీ మరువను



- మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్

నవతెలంగాణ - నాగోల్

ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికలలో మల్కాజిగిరి నియోజకవర్గం నుండి పార్లమెంట్ సభ్యుడిగా అత్యధిక మెజార్టీతో గెలిపించి, చూపిన మీ ఆదరాభిమానాలను ఎప్పటికీ మర్చిపోనని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నాగోలు డివిజన్‌లోని శుభం కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన అభినందన సభకు ఈటల రాజేందర్ హాజరై మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రజల సంక్షేమానికి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

ఎన్నికలలో నా గెలుపు కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకూ, ప్రతి నాయకులకూ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులుగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అత్యధిక నిధులను మంజూరు చేయించి, అన్ని రంగాలలో అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్, రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్, కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్, బీఎన్‌రెడ్డి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు
సమస్యలు తలెత్తకుండా చూడాలి



కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి

నవతెలంగాణ - సంతోష్‌నగర్

ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాలని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఐఎస్‌సదన్ డివిజన్‌లోని సింగరేణి ఆఫీసర్స్ కాలనీ, ఆదర్శనగర్ కాలనీలలో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ బాక్స్ డ్రెన్ నాలా పనులను ఆదివారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాలా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీ కాల్వలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, ఎస్ ఎన్‌డీపీ ఈఈ రోహిణి, డిప్యూటీ ఈఈ కనకయ్య, ఏఈ భరత్, కాలనీ కమిటీ సభ్యులు కేఎస్ఎన్ రెడ్డి, రమణ, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం
అధ్యక్షుడిగా జయంత్ నాయక్

నవతెలంగాణ - బడంగ్ పేట్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీఐటీయూ భవన నిర్మాణ కార్మికుల సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా జయంత్ నాయక్ ఎన్నికయ్యారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం బడంగ్‌పేట్‌లో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మండల కార్యదర్శి యాదయ్య, శేఖర్ యాదవ్, రామ్ కుమార్ నాయక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి భవన నిర్మాణ కార్మికులకు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు లభిస్తున్నాయని, వాటిని కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు బోర్డు నుండి వచ్చే పనిముట్లు, రుణ సౌకర్యాలను అందించాలని కూడా ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. అనంతరం సీఐటీయూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా జయంత్ నాయక్, ప్రధాన కార్యదర్శి శేఖర్ యాదవ్, ఉపాధ్యక్షులు బాలస్వామి, వెంకటేష్, తిరుపతి, రాములు, సహాయ కార్యదర్శులు మంగత్ నాయక్, సంతోష్, మరి కొందరు సభ్యులుగా ఎన్నికయ్యారు. తర్వాత నూతనంగా ఎన్నికైన జయంత్ నాయక్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన కమిటీ సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



సుస్వర సినీ గాన లహరి



నవతెలంగాణ-కల్చరల్

సుస్వర సుగుణ కళా భారతి రవి మన్యు ఆర్ట్స్ నిర్వహణలో శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై సుస్వర సినీ గాన లహరి నిర్వహించారు. ప్రముఖ గాయకుడు రవి మన్యు సహాయకులు లక్ష్మి గోపాల్, సౌభాగ్య లక్ష్మి లోహిత, సూచరిత్ర ఆర్య వినీలతో కలసి పలు సినీ గీతాలు మధురంగా ఆలపించారు. సభా కార్యక్రమంలో గాంధీ నగర్ కార్పొరేటర్ పావనీ వినయ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సంస్థ స్థాపకుడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్నత ఉద్యోగిగా పదవీ విరమణ చేసి గాయకునిగా చిత్ర కారుడు గా సమాజంలో తన ప్రతిభను చాటుతున్నారని అభినందించారు. చంద్ర మౌనిష్ జ్ఞాపకం గా కార్యక్రమాలను జరుపుతూ పాటలతో ఆ బాధను మరుస్తున్నారని పేర్కొన్నారు. సంఖ్య శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ, మల్లెపూల వెంకట రమణ తదితరులు పాల్గొనగా రవి మన్యు స్వాగతం పలికారు . మోహన్ గాంధీ సందర్భోచిత వ్యాఖ్యానం ఆకట్టుకొంది.

సమాజాన్ని ప్రభావితం చేసేది కళలు సాహిత్యమే

నవతెలంగాణ-కల్చరల్

సమాజాన్ని ప్రభావితం చేసేవి కళలు సాహిత్యం మాత్రమేనని రాష్ట్ర బీసీ కమీషన్ ఛైర్మెన్ డాక్టర్ వకుళ భరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ సత్య సంగీత ఇంటర్నేషనల్ నిర్వహణలో సామాజిక చైతన్య మూర్తులు పేరిట సినీ నటులు కళాకారులు సాహితీ కారులకు ఆత్మీయ పురస్కార ప్రదాన సభ నిర్వహించారు.డాక్టర్ కృష్ణమోహన్ రావు పాల్గొని మాట్లాడుతూ తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే కళాకారులు సాహితీ వేత్తలను సత్కరించటం ముదావహమన్నారు. శాసన మండలి సభ్యుడు మహేష్ గౌడ్ మరొక ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సత్య సంగీత వంటి సమాజిక సేవా దృక్పథం కల సంస్థలు ఇతరులకు ఆదర్శం గా వుంటాయని అభినందించారు. పురస్కారాలను అందుకున్న వారిలో శ్రీ మణి, కొత్త కొండ కృష్ణ, హనుమంత రాయ శర్మ, గిడుగు క్రాంతి కృష్ణనటులు పూజిత, శైలజ, లక్ష్మి వర్మ తదితరులు న్నారు. సంస్థ స్థాపకుడు ఓం కార్ రాజు స్వాగతం పలికారు. కార్యక్రమానికి తొలుత గాయనీ గాయకులు పాడిన ఉద్యమ ప్రబోధ చైతన్య గీతాలు శ్రోతలను రంజింప జేశాయి.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్



- 164 కేజీల గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-మెహిదీపట్నం

సౌత్ వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు నగరంలోని హుమాయున్ నగర్, భవాని నగర్ ప్రాంతాలలో దాడులు చేసి అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లు ఆరు మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 160 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా హుమాయున్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టాస్క్ ఫోర్స్ డీసీపీ రష్మీ పెరుమల్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కోరాన్ పల్లి తండాకు చెందిన ధరావత్ రవి(40) తన స్నేహితులైన నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్(28), ఆనంద్ రాంజీ(30) లతో కలిసి ఒడిస్సాలో 100 కేజీల గంజాయి కొనుగోలు చేసి కారులో హైదరాబాద్‌కు తీసుకొని వస్తుండ గా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు హుమాయున్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పారా మౌంట్ కాలనీ వద్ద పట్టుకొని వారి నుండి 100 కిలోల గంజాయి, కారు నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని తదుపరి విచారణ నిమిత్తం హిమాయత్‌నగర్ పోలీసులకు అప్పగించారు. మరో కేసులో ఆసిఫ్ నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ (42) గతంలో డ్రగ్స్ కేసులో అరెస్ట్ రాజమండ్రి జైల్‌లో ఉన్నప్పుడు అతనికి అక్కడ గంజాయి పండించి స్మగ్లింగ్ చేసే ఒరిస్సాకు చెందిన దీపక్ తో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు కలిసి గంజాయిని హైదరాబాదుకు స్మగ్లింగ్ చేస్తున్నారు. గంజాయిని ఒరిస్సా నుండి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సుల ద్వారా తీసుకొని వచ్చి నగరంలోని వివిధ ప్రాంతాలలో తన స్నేహితులు వట్టపల్లికి చెందిన అబ్దుల్ రసూల్(30), కిషన్ బాగ్‌కు చెందిన మహమ్మద్ అన్వర్(33)ల సహాయంతో అమ్ముతు న్నాడు. తమకు అందిన విషయ సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు భవాని నగర్‌లోని సమీనా ఆస్పత్రి వద్ద ఈ ముగ్గురిని అరెస్టు చేసి వారి నుండి 64 కిలోల గంజాయిని, రెండు కార్లు, ఒక మోటార్ బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. వారిని తదుపరి విచారణ నిమిత్తం భవాని నగర్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడులు టాస్క్‌ఫోర్స్ సీఐ బాలస్వామి ఎస్‌ఐ అజిత్ సింగ్‌ల ఆధ్వర్యంలో జరిగినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఆమె అభినందించారు.

జూలై 19 నుండి లాల్ దర్వాజా బోనాలు

- జూలై 19న శిఖర పూజ
- ఢిల్లీలో జూలై 8,9,10 బోనాలు

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట



లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి జాతర బోనాలు అంగరంగ వైభవంగా జరుపు తామని కమిటీ అధ్యక్షుడు చెన్నబోన రాజేందర్ యాదవ్ పత్రిక సమావేశంలో తెలియజేశారు. ఈ సంవత్సరం జరగబోయే 116వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయానికి విద్యుత్ కాంతులతో రంగులతో అలంకరిస్తున్నా మని, రంగులు వేసే ఈ ప్రారంభ కార్యక్రమానికి అనిల్ కుమార్ యాదవ్ రాజ్యసభ సభ్యుడు వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాల యానికి రంగులు వేసే కార్యక్రమం ప్రారంభిం చారన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వారు మాట్లాడుతూ చాలా ప్రతిష్టా త్మకమైనవని ఈ బోనాలకు ప్రభుత్వం తరఫున కావాల్సిన సౌకర్యాలు సమకూరుస్తామని ఈ అమ్మవారి దయవల్ల కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిందన్నారు.

అమ్మవారి గుడికి సంబంధించిన విషయంలో ఎలాంటి గోల్మాల్ జరగలేదు
సి.రాజేందర్ ఆలయ కమిటీ అధ్యక్షుడు

ఆలయ కమిటీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఇంతకుముందు ఉన్న ఫోర్ కమిటీ మెంబర్ సభ్యులు ఆలయానికి కమిటీ సభ్యులు గా ఉండి వాళ్ళ ఆధ్వర్యంలో బోనాలు నిర్వహిం చారని వారు జరిపిన బోనాల పండుగ సందర్భం లో మేము అప్‌డేట్ లెక్కలు అడిగినందుకు వాళు మాకు తప్పుడు లెక్కలు ఉన్నాయన్నారు. 2022 సంవత్సరంలో ఫోర్ కమిటీ మెంబర్ సభ్యులుగా ఉన్నప్పుడు బోనాల కార్యక్రమంలో లెక్కలు చూపించమనగా రూ.5 లక్షల 96 వేల మిగులు కనిపించగా దానిని 3 లక్షల 76వేలుగా చేసి తప్పుడు లెక్కలు చూపించారని వాటికి సంబం ధించిన లిమిట్ బుక్స్ తెచ్చి మాకు చూపించమని అడగగా అది చూపించకుండా మా పైనే తప్పుడు అభియోగాలు మోపి ఆలయ ప్రతిష్ఠను భంగ పరిచే విధంగా ఈ సంవత్సరం వాళ్లకి ఆలయ కమిటీ బాధితులు అప్పగించినందుకు ప్రస్తుత కమిటీ మెంబర్లపై ఆలయ కమిటీ చైర్మెన్‌పై బురద చల్లే విషయాన్ని చేస్తున్నారని తద్వారా జరిగేది ఏమీ లేదని కమిటీ చైర్మెన్ సి.రాజేందర్ యాదవ్ అన్నారు. జనరల్ సెక్రటరీ మారుతీ యాదవ్ మాట్లాడుతూ గత సంవత్సరానికి సంబంధించిన లెక్కలన్నీ అప్ టు డేట్ చేసి మేము కమిటీ సభ్యులకు తెలియజేశామని మా ఆలయం ఎండోమెంట్‌లో లేదు కాబట్టి మేము ఎండోమెంట్ వారికి టీసీపీకి సంబంధించిన అధికారులకు తెలియజేయాల్సిన అవసరం మాకు లేదన్నారు. కన్వీనర్ అరవింద్ గౌడ్ మాట్లాడుతూ 2011 సంవత్సరంలో అమ్మవారి గుడిలో దొంగతనం జరిగిందని అప్పుడు అమ్మవారికి పది తులాల బంగారం ఉండే అది రికవరీ చేసినప్పుడు నాలుగు తులాల బంగారమే రికవరీ అయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు మిగులు బడ్జెట్ ఉన్న ప్రతిసారి దశలవారీగా బంగారం కొనుగోలు చేస్తున్నామన్నారు.

జూలై 19న శిఖర పూజ

లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి దేవాలయం బోనాల కార్యక్రమాన్ని జూలై 19న శిఖర పూజతో ప్రారంభమై ధ్వజారోహణం దేవి అభిషేకం సాయంత్రం కలశ స్థాపనతో ఉత్సవాలు లాంచనగా ప్రారంభమవుతాయ న్నారు. జూలై 21న సాయంత్రం శాలిబండ కాశీ విశ్వనాథ స్వామి దేవాలయం నుండి అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకొని వచ్చే ప్రతిష్టాపిస్తారని 9 రోజులు అమ్మవారిని కి వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని కమిటీ అధ్యక్షుడు సి.రాజేందర్ యాదవ్ అన్నారు.

ఢిల్లీలో బోనాలు..

లాల్ దర్వాజా బోనాలు దేశ రాజధాని ఢిల్లీలో ప్రతి సంవత్సరం జరిగే విధంగానే ఈ సంవత్సరం జూలై 8,9,10 తేదీలలో ఘనంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలియజేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మూడు రోజుల పాటు పదవ వార్షిక ఉత్సవాలను జరుపుతామని జులై 8న సాయంత్రం ఐదు గంటలకు తెలంగాణ భవన్ ప్రాంగణంలో ఫోటో ఎగ్జిబిషన్ పలువురు ప్రముఖులు ప్రారంభిస్తారని, మంగళ వారం 9 తారీఖున సాయంత్రం ఐదు గంటలకు ఇండియా గేటు వద్ద అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా తీసుకొని వచ్చి తెలంగాణ భవన్ లో ప్రతిష్టాపన చేసి పదవ తేదీన 11 గంటలకు అమ్మవారికి బోనం సమర్పించి పోతురాజులు కు స్వాగతం పలికి కేంద్ర రాష్ట్ర మంత్రులు ప్రముఖు లు విచ్చేసి అమ్మవారి దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని కన్వీనర్ జి. అరవింద్ గౌడ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మెన్ , జనరల్ సెక్రెటరీ మారుతి యాదవ్, ఏ చంద్రకుమార్, ట్రెజరర్ పోసాని సతీష్ ముది రాజ్, కన్వీనర్ అరవింద్ గౌడ్, కల్చరల్ సెక్రటరీ వినోద్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ శేషు నారా యణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ.శ్రీనివాస్ గుప్తా, సి.క్రాంతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో ప్రతిభను చాటిన న్యూ పారామౌంట్





నవతెలంగాణ-ధూల్‌పేట్

పదిలో అగపురా న్యూ పారామౌంట్ స్కూల్ విద్యార్థు లు తమ ప్రతిభతో సత్తా చాటారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ బి.పద్మావతి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతు న్నామన్నారు. మారుతున్న టెక్నాలజీ కనుగుణంగా బోధనలు అందిస్తున్నామన్నారు. సంస్కృతి సంప్రదాయాల ను అలవర్చుకుంటూ వారి ప్రతిభను వెలికి తీసేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ ఏడాది పదిలో ధీరు కన్వర్, సమర్థ నారాయణ గుప్తలు 10/10 జీపీఏ, సించన తల్వార్, లలిత సుతర్, దోమ స్నేహ, ఐశ్వర్య మోరే లు 9.8 జీపీఏ, నిర్మల్ కుమావత్, సిద్దం సెట్టి వైష్ణవి లు 9.7 జీపీఏ లతో ఉత్తీర్ణత సాధించారన్నారు. స్కూల్ విద్యార్థులను ప్రతిభ వంతులుగా రాణించేలా ప్రోత్సాహపరస్తామన్నారు.

'నీట్'పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



- నీట్ నిర్వహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మీద సీబీఐ ఎంక్వయిరీ వేయాలి
- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ

నవతెలంగాణ-ముషీరాబాద్

నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నిర్వహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మీద సీబీఐ ఎంక్వయిరీ వేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్ బీసీ భవన్‌లో నీట్ పరీక్ష అవకతవకలపై విద్యార్థి సంఘం నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ వృత్తిలోకి వెళ్లాలని అనుకునే విద్యార్థులకు ఎంట్రన్స్ డోర్ అయిన నీట్ పరీక్షలో భారత దేశంలోని అతిపెద్ద స్కాం జరిగిందన్నారు. నీటి పరీక్షతో 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో మునిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఎలక్షన్ ఫలితాల మీద దృష్టి సారించిన సమయంలో నీట్ రిజల్ట్ బయటకు వచ్చాయి. 14న రావాల్సిన ఫలితాలు ఎలక్షన్ రిజల్ట్ రోజున హడావిడిగా విడుదల చేశారని ఆరోపించారు. నీట్ అనేది అది కష్టమైన పరీక్ష ప్రతి సంవత్సరం కేవలం ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధిస్తారు కానీ ఈసారి మాత్రం ఏకంగా 67 మంది ఆల్ ఇండియా లెవెల్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించారు. రెండు మూడు ర్యాంకులు సాధించిన వారు మొత్తం 720 మార్కులకు గాను 719, 718 సాధించారని తెలిపారు. నీట్ పరీక్ష చరిత్రలో ఇటువంటి ఫలితాలు ఎప్పుడు రాలేదన్నారు. 8 మంది విద్యార్థులు ఒకే ఎగ్జామ్ సెంటర్ నుండి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ రావడం బట్టి చూస్తే నీట్ పరీక్షలో ఎంత అవకతవకలు జరిగాయో తెలుస్తుందన్నారు. నీట్ పరీక్ష నిర్వహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మీద సీబీఐ దర్యాప్తు సంస్థల చేత విచారణ జరిపించాలని కోరారు. దీని వెనుక ఉన్న ఎంతటి వారినైనా వదిలిపెట్టకుండా దేశ ద్రోహం కింద శిక్షించాలని డిమాండ్ చేశారు. దీనిపై దర్యాప్తు సంస్థలు విచారణ చేప ట్టగా బీహార్‌కు చెందిన గ్యాంగ్ పేపర్ లీకేజీకి పాల్పడిందని తెలుస్తుందన్నారు. నిందితుల్లో ఒకరు పేపర్ లీకేజీ నిజమే అని ఒప్పుకున్నారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమి స్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజేష్, వినోద్, ప్రవీణ్, ఉదయ్, అభిలాష్, గిరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా కొండాపురం శ్రావణ్ కుమార్

నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కుమ్మరి సంఘం అధ్యక్షుడిగా కొండాపురం శ్రావణ్ కుమార్ ఆదివారం నియమితులయ్యారు. ఈ బాధ్యతను తనకు ఇచ్చిన కుమ్మరి సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎగిరిశెట్టి వీర య్య, రాష్ట్ర కార్య దర్శి శంకరయ్య జిల్లా కార్యదర్శి ఆడాల గణేష్ ఆధ్వర్యంలో సంఘం జిల్లా యూత్ కమిటీలను వేశారు. ఈ సందర్భంగా కొండాపురం శ్రావణ్‌కు మార్ మాట్లాడుతూ తనకు నియోజకవర్గ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కుమ్మరుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యల పై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు పనిచేస్తానని తెలిపారు. ప్రభు త్వాలు ఓట్ల ప్రయోజనాల కోసమే కుమ్మరులను రాజకీయంగా ఎదగనీయ కుండా పావులుగా వాడుకుంటున్నారని విమర్శించారు. వారంతా రాజకీ యంగా ఎదిగినప్పుడే కులవృత్తులకు న్యాయం జరుగుతుం దని చెప్పారు. రాబోయే రోజుల్లో సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రావణ్ పేర్కొన్నారు. నియోజకవర్గ అధ్యక్షునిగా తనకు బాధ్యతలు అప్పజెప్పిన సంఘం పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం సీనియర్ నాయకులు కాసుల పాండు, ఏరుకొండ రాములు, కృష్ణ, డాక్టర్ జయప్రకాష్, తదితరులున్నారు.

భూమిలేని పేదలకు భూమి పంచాలి



- విముక్త చిరుతల కక్షి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్

నవతెలంగాణ-ముషీరాబాద్

భూమిలేని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి పంచాలని వీసీకే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబా ద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ (బొజ్జా తారకం) ఆధ్వర్యంలో ఆ పార్టీ కో ఆర్డినేటర్ జన్ను సాంబయ్య అధ్యక్షతన భూమిని పంచు, బడ్జెట్ పెంచు అనే అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా విముక్త చిరుతల కక్షి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలకర శ్రీనివాస హాజరై మాట్లాడుతూ.. తెలంగాణలో అనేక దశాబ్దాలుగా భూమి కోసం పోరాటాలు జరిగాయని, భూ సంస్కరణ చట్టాలు రావడంతో మిగులు భూములు ఏర్పడ్డాయన్నారు. తెలంగా ణలో నాలుగు లక్షల ఎకరాల మిగులు భూములు వున్నా యని, వాటిని గత కేసీఆర్ ప్రభుత్వం వేలం వేసి అమ్ముకుం దని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రజలు కెసిఆర్ ను ఓడించి రేవంత్ రెడ్డికి అధికారాన్ని అప్పగించారని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ప్రభుత్వ భూములను వేలం వేస్తుందని తెలిపారు. పట్టణ, గ్రామీణ గరిష్ఠ భూపరిమితి చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మెన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ భూమి, ఉపాధి, ఉద్యోగాలు రావాలంటే అధికారం పేద వర్గాలకు రావాలన్నారు. బీసీ కులగణన చేసి స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన విధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో 90 శాతంగా ఉన్న బహుజన వర్గాలు ఐక్యంగా రాజ్యాధికారం చేపట్టాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షత వహించిన ఆర్ పి ఐ (బొజ్జా తారకం) జన్ను సాంబయ్య మాట్లాడుతూ భూమి వుంటేనే ఆర్థిక అసమానతలు తొలిగిపోతాయని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోనేరు రంగారావు సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్ ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని అంకేశ్వరపు రమేష్ సమన్వయం చేయగా విసికె అధికార ప్రతినిధి తెలంగాణ శ్యామ్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ నాయకులు చాపర్తి కుమార్ గాడ్గే, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ సీనియర్ నాయకులు శ్రీరాముల పైడి, దాసరి రాజు, పీసరి రజిత, కనుకుల శారద, ఎండి షాహిదా, బుర్రి సాంబలక్ష్మి, తరాల సమ్మక్క, తరాల విజయ, మానాల మరియ, పార్నంది రమేష్ చంద్ర, గునిగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర సదస్సులో కమిటీ నాయకులు రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఆర్‌పిఐ (బొజ్జా తారకం) రాష్ట్ర అధ్యక్షులు గా జన్ను సాంబయ్య, ప్రధానకార్యదర్శిగా అంకేశ్వరపు రమేష్, ఉపాధ్యక్షురాలుగా పీసరి రజిత, రాష్ట్ర కార్యదర్శిగా పార్నంది రమేష్ చంద్ర లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



అక్రమంగా గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న అంతర్రాష్ట్ర ముగ్గురి ముఠాను నాంపల్లి రైల్వే పోలీసులు అరెస్టు చేసి 26.684 కిలోల స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రైల్వే ఇన్ స్పెక్టర్ బి.ప్రవీణ్ కుమార్ వివరాలను వెల్లడించారు. అర్లీ గోవింద్ (38)కర్రి రమణమ్మ(50) రాజు గుడ్డి భయ్యా విశాఖపట్నం నుండి మహారాష్ట్రలోని పర్లికి రైళ్లలో అక్రమం గా 26.684 కిలోల ఎండు గంజాయిని తరలిస్తుండగా నాంపల్లి రైల్వే పోలీసులు రైల్వే స్టేషన్లో ప్లాట్‌ఫారంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి ఆదివారం మధ్యాహ్నం అర్లి గోవింద్ కర్రి రమణమ్మను అదుపులోకి తీసుకొని కాలేజీ బ్యాగ్‌తో పాటు , 5 పొడి గంజాయి ప్యాకెట్లు, 1 ట్రాలీ బ్యాగ్ ,7 పొడి గంజాయి ప్యాకెట్లు మొత్తం 26.684 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.6,50,000 ఉంటుందని మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య ఖజానా ద్వాదశి నాగేశ్వర శాస్త్రి



నవతెలంగాణ-కల్చరల్

ద్వానా శాస్త్రి అని పిలువబడే ద్వాదశి నాగేశ్వర శాస్త్రి వివిధ పత్రికలకు పలు సాహితీ ప్రక్రియలలో రచనలు అందించి సాహితీ ఖజానా గా గుర్తింపు పొందారని ప్రముఖ సాహితీవేత్త రమణ వెలమకని కొనియాడారు. శ్రీ త్యాగరాయ గాన సభ లోని కళా దీక్షితులు కళా వేదిక పై ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ద్వానా శాస్త్రి జయంతి సమావేశం నిర్వహించారు. ప్రధాన వక్తగా రమణ వెలమకని మాట్లాడుతూ ఎందరో గ్రంథాలకు సమీక్షలు నిర్మోహమాటంగా రాసిన శాస్త్రి ఎనభై పైగా వివిధ ప్రక్రియలలో రచనలు చేశారని వివరించారు తెలంగాణ సాహిత్య వీణ పేరిట తెలంగాణ లో లబ్ధ ప్రతిష్ఠ పొందిన గత కాలపు సాహితీ వేత్తలను నేటి వారికి పరిచయం చేశారని ఇది పరిశోధక విద్యార్థులకు ఉపయుక్తం అన్నారు. అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ స్నేహ శీలి ఉత్తమ వ్యక్తిత్వం కల శాస్త్రి కి గాన సభ తో తన అన్న దీక్షితులు తో ఆత్మీయ అనుబంధం వుందని గుర్తు చేసుకున్నారు. ఆయన పన్నెండు గంటల సాహితీ ప్రసంగం గాన సభలో చేసినప్పుడు అశేష ప్రేక్షకులు ప్రత్యేకించి సివిల్ సర్వీస్ పరీక్షలకు ప్రిపేర్ అవుత ఎన్న విద్యార్థులు హాజరు కావటం విశేషమని మరువ లేనిది అన్నారు. వేదిక పై గాయని ఆమని,సమాజ సేవకులు వెంకట రావు యామిని పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

బీసీలకు 42% రిజర్వేషన్లు కావాలని ఇందిరాపార్క్ వద్ద ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రాజారాం యాదవ్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర కుల గణన, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి నిలదీస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపే బీసీ కుల గణన నిర్వహించి స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీలు ఇచ్చిరన్నారు. బీసీ సమగ్ర కుల గణన నిర్వహించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని లేనిపక్షంలో తెలంగాణలోని బడుగు బలహీన వర్గాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తమను ఎన్నికలో తిరస్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీసీ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, బీఆర్ఎస్ పార్టీ నాగర్ కర్నూల్ పార్లమెంటరీ పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, హైదరాబాద్ పార్లమెంటరీ పార్టీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్, మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద్ భాస్కర్, ఉస్మానియా విద్యార్థి నాయకులు, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీహెచ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ధూల్‌పేట్

మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు జన్మదినం సందర్భంగా రాష్ట్ర మున్నూరుకాపు యువక మండలి ఆధ్వర్యంలో వి.హెచ్ కి జన్మదిన శు భకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్, యాదగిరిగుట్ట మున్నూరు కాపు వసతి గృహం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాలగుల శ్రీనివాస్, యువక మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆది అవినాష్, ఆకారపు అరుణ్ కుమా ర్, జి.నవీన్ కుమార్, కోశాధికారి మన్నె మోహన్, కార్య వర్గ సభ్యులు కాల సాయి ప్రసాద్, చవా అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఏ.సుధాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

నవతెలంగాణ వికారాబాద్ కలెక్టరేట్



కాంగ్రెస్ వికారాబాద్ పట్టణ అధ్యక్షులు అర్థ సుధాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆది వారం ఘనంగా నిర్వహించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నివాసంలో నిర్వహిం చిన వేడుకల్లో సుధాకర్ రెడ్డికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధి ల్లాలని అన్నారు. పార్టీకి ఆయన సేవలు ఎంతో అవసరం అన్నారు. ఆయన భవి ష్యత్‌లో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నరోత్తం రెడ్డి, వికారాబాద్ మండల అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, మోమిన్‌పే ట్ మండల అధ్యక్షులు శంకర్, చిట్టెపు వెంకట్‌రెడ్డి, వాహిద్ మియా, శ్రీనివాస్ ముదిరాజ్, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
సోమవారం | జూన్ 17, 2024 | www.navatelangana.com

మ్యాన్ హెూల్ మరమ్మతులు చేపట్టిన అధికారులు



- నవతెలంగాణ వార్తకు స్పందన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్, గురుమూర్తినగర్ ప్రధాన రహదారి మూల మలుపు మధ్యలో 'ప్రమాద భరితంగా మ్యాన్ హెూల్' అనే శీర్షికన 14 న శుక్రవారం నాడు నవతెలంగాణ దినపత్రికలో వచ్చిన వార్త కథనానికి అధికారులు ఎట్టకేలకు స్పందించారు. శనివారం సంబంధిత సిబ్బందితో మరమ్మతులు చేపట్టి మ్యాన్ హెూల్ పై కవర్ వేయించారు. ఈ సమస్య పరిష్కారానికి వచ్చిన కథనానికి వాహనదారులు, పాదాచారులు నవతెలంగాణ దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

'చిత్రం' కేఫ్ ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్ సింహపురి కాలనీలో సుమంత్, అఖిల్‌ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'చిత్రం' కేఫ్‌ను కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలాలకతీతంగా ఎటు వంటి వాతావరణంలోనైనా నడిచే ఏకైక వ్యాపారం "కెఫే" అని అన్నారు. నూతన రుచులను వినియోగదారులకు అందించినప్పుడు వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, బుచ్చిరెడ్డి, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలు కాపాడండి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న చెరువులు, కుంటలు గత ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతానికి గురయ్యాయని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. వాటిని కబ్జాదారుల నుంచి కాపాడి, భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా హన్మంత్ రెడ్డి నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కోరారు. ఆదివారం ఉత్తమ్ కుమార్ కలిసి నియోజకవర్గంలో కబ్జాకు గురైన, గురవుతున్న చెరువులు కుంటల నివేదికను ఆయనకు అందజేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో పలు చెరువులు రూపు కోల్పోయి, కబ్జాకు గురయ్యా అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 126 డివిజన్ అధ్యక్షులు గణేష్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో నవోదయ విద్యార్థుల ప్రభంజనం

- అసాధారణ ఫలితాలే నవోదయ పాఠశాల విద్యార్థుల లక్ష్యం
- కరస్పాండెంట్ కాసర్ల గిరి





నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

(2023-24 విద్యా సంవత్సరం) పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నవోదయ పాఠశాల విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించి అధరహెూ అనిపించి విజయ దుందుభి మ్రోగించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికె తలమానికంగా నిలిచామని పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ కాసర్ల గిరి అన్నారు. ఈ మేరకు ఆదివారం నవతెలంగాణతో మాట్లాడారు. కృషితో నాస్తి దుర్భిక్షం అన్న నానుడిని సార్థకత చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలతో దినదిన ప్రవర్తమానంగా ఎదుగుతున్నామన్నారు. తమ పాఠశాల క్రమశిక్షణకు, నాణ్యమైన చదువుకు మారుపేరుగా గత కొన్నేండ్ల నుంచి జగద్గిరిగుట్ట, గాజులరామారం డివిజన్‌లో పరిసర ప్రాంతంలోనే ప్రత్యేకత గుర్తింపు పొందిందన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ శ్రీనివాస్ నగర్‌లో గల నవోదయ హై స్కూల్ విద్యార్థులు దశాబ్దాల కాలంగా అపారమైన అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా విద్యాబుద్ధులు నేర్పుతూ వారి ఉజ్వల భవిత పునాదులు వేస్తున్నా మన్నారు. ఎంతోమంది తమ పాఠశాలలో విద్యార్థులు విదేశాలతో పాటు, ఉన్నత ఉద్యోగా ల్లో స్థిరపడ్డారన్నారు. చదువు విషయంలో ఎక్కడ రాజీ పడకుండా స్లమ్ ప్రాంతం కావడంతో తక్కువ ఫీజులతో మెరుగైన విద్యను అందిస్తూ కార్పొరేట్ స్థాయి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. పాఠశాలనే దేవాల యంగా భావిస్తూ విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దుతున్నా మన్నారు. ప్రతీ సంవత్సరం పదో తరగతిలో సాధారణ విద్యార్థులచే అసాధారణ ఫలితాలు సాధిస్తున్నామని పేరొన్నారు. ఈ సంవత్సరం పదో తరగతిలో జీపీఏ.10.(2) బి.యశ్విన్, బి.జినిల విద్యార్థులు సాధించారు. జీపీఏ.9.8(11) మంది విద్యార్థులు, జీపీఏ.9.7(7)విద్యార్థులు, జీపీఏ9.5 (6) విద్యా ర్థులు, జీపీఏ 9.3 (8) విద్యార్థులు, 9.2(9) విద్యార్థులు 9.0 (12) విద్యార్థులు 98.8(శాతం) ఉత్తీర్ణతతో విజయ విహారం చేశారన్నారు.

సువిశాలమైన గదులు..ఆహ్లాద వాతావరణం, చక్కని క్రీడామైదానం..పాఠశాల ప్రత్యేకత..

విద్యార్థులకు విద్యతోపాటు పలు క్రీడల్లో శిక్షణ ఇచ్చే విధంగా పాఠశాల ప్రాంగణంలో సువిశాలమైన క్రీడమైదానం, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేశామన్నారు. కేజీ నుంచి పదవ తరగతి చదువుతున్న ప్రతీ విద్యార్థులు సెక్షన్లలో పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పాఠశాల ప్రాంగణంలో చెట్లు పెంచామన్నారు. వీటితోపాటు విద్యార్థులు పుస్తకాలకు పరిమితం కాకుండా విజ్ఞాన విహారయాత్రలకు తీసుకెళ్తూ వారిలో ఉల్లాసాన్ని నింపుతున్నామన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎస్.ఏ రైటింగ్‌లు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నమన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి



- కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని దయార్ గూడ ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేందర్ బాలానగర్ పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ దయార్ గూడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగు నీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా బాలికలు అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నరని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని హెడ్ మాస్టర్ కోరారు. వెంటనే సమస్యపై స్పందించిన రమేష్ విద్యాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి పాఠశాలల్లో సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మేరకు మౌలిక సదుపాయాలు కల్పన కోసం త్వరలోనే కలెక్టర్‌తో సమావేశమై అవసరమైన నిధులను ఏర్పాటు చేయనున్నట్టు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మెన్ మల్లిగారి లక్ష్మయ్య, మేకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కి నష్టపరిహారం..



- కార్మిక నాయకుడు శ్రమ శక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్ గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఆటో డ్రైవర్‌కి నష్టపరిహారం కార్మిక నాయకుడు శ్రమ శక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్ గౌడ్ ఇప్పించాడు. సూరారం ఆర్కే ట్రాన్స్పోర్ట్‌కు చెందిన బస్సు కుత్బుల్లాపూర్ చౌరస్తాలో ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టడంతో, ఆటో పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. కానీ ఆ ఆటో డ్రైవరు ఉమానాదం సామాన్య కుటుంబానికి చెందినవాడు. ఆటోనే ఆ కుటుంబానికి జీవనాధార. ఉన్న ఆటో కాస్త ధ్వంసం కావడంతో.. కుటుంబం మొత్తం రోడ్డున పడింది. దాంతో ఆర్కే ట్రాన్స్పోర్ట్ వారిని అడిగిన ప్రయోజనం లేకపోవడంతో తెలిసిన వారి ద్వారా కార్మిక నాయకుడు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్ గౌడ్‌ని కలిసి వారి బాధను తెలియపరిచారు. వెంటనే మదన్ గౌడ్ ఆర్కే ట్రాన్స్పోర్ట్ ఆఫీస్‌కు వెళ్లి యాజమాన్యంతో మాట్లాడి బాధితుల కుటుంబానికి నష్టపరిహారం కింద రూ.95 వేలు ఇప్పించి, వారి కుటుంబానికి న్యాయం చేయడం జరిగింది. పేదవాడికి అన్యాయం జరిగితే సహించేది లేదని ముద్దాపురం మదన్ గౌడ్ అన్నారు. కుటుంబ సభ్యులందరూ కలిసి మదన్ గౌడ్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మదన్ గౌడ్‌తో పాటు కార్మిక నాయకులు కె.రాంబాబు, గురుద్వారా సెక్రెటరీ సుమిత్ సింగ్, బల్కంపేట్ టెంపుల్ బోర్డ్ నంబర్ గిరి యాదవ్, కుటుంబీకులు సాయి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

'జీవన భాష్యము'పుస్తక ఆవిష్కరణ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి జగద్గిరిగుట్ట శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గల శ్రీ కాళికాదేవి అమ్మవారి ఆలయంలో ఆదివారం జగద్గిరి గుట్ట, వెంకటేశ్వరనగర్ ప్రాంతానికి చెందిన రచయిత కె.వీరయ్యచారి రచించిన 'జీవన భాష్యము' అనే పుస్తకాన్ని కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన విశ్వకర్మ (స్మార్థ) సంఘం సభ్యులు చంద్రప్ప, సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రచయిత కె.వీరయ్యచారి రచించిన పుస్తకంలో సామాన్యుల జీవన విధానాన్ని, జీవితంలో ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. తెలుసుకోవాల్సిన ఎన్నో విషయాల్ని తన ఆలోచనానుభవాల్ని జోడించి, గొప్పగా వ్రాసిన ఆయనను శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో కూడా జీవన ప్రమాణాలతో కూడిన పుస్తకాలను ఆవిష్కరించి చైతన్యవంతులను చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మారుతి, షణ్ముఖా చారి, శ్రీ కాళికదేవి ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రముఖులు, మన సంఘ పెద్దలు విశ్వకర్మ బంధుమిత్రులు హాజరై రచయిత వీరయ్యచారి కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

చిత్తారమ్మ ఆలయంలో నూతన షెడ్డు ప్రారంభం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధి,గాజులరామారం గ్రామంలో వెలసిన శ్రీశ్రీ చిత్తారమ్మ తల్లి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన షెడ్డును ఆదివారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. నూతన షెడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ చిత్తారమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, కుత్బుల్లాపూర్ ప్రజల ఇలవేల్పు అయిన చిత్తారమ్మ తల్లి ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. భక్తులకు ఎటు వంటి అసౌకర్యం లేకుండా ఆలయ అభివృద్ధికి కమిటీ సభ్యులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని వారిని అభినందించారు. ఆలయ కమిటీ చైర్మెన్ శ్రీ కూన అంతయ్య గౌడ్, కేకేఎం ట్రస్ట్ చైర్మెన్ కూన శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు ఇంద్రసేనా రెడ్డి, ఇంద్రసేనా గుప్తా, నర్సింహా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భావి తరాల కోసం ప్రకృతిని కాపాడాలి

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

భావి తరాల కోసం ప్రకృతి కాపాడాలని డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ అన్నారు. అంబీర్ చెరువు వాకర్స్ అసోసియేషన్, షఉట్ టు ఫైన్ ప్రొడక్షన్ వారి ఆధ్వర్యంలో, అంబీర్ చెరువు పరిసరాలను సుందరికరణ పరచడంలో భాగంగా, ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని, శివమ్మ కాలనీ రామాలయం వెనుక, చెరువు కట్టమీద ఉన్న చెత్తను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై, అసోసియేషన్ సభ్యులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో భాగంగా, షఉట్ టు ఫైన్ ప్రొడక్షన్ వారు ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్ మాస్టర్స్ సహకారంతో మనం మారిపోదాం అనే ఎకో ఫ్రెండ్లీ సాంగ్‌ను చిత్రీకరించడం జరిగింది. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటి పచ్చని వనంలా చెరువును సుందరికరించడానికి, స్వచ్ఛందంగా విచ్చేసిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు, ప్రొడక్షన్ వారికి, శివమ్మ కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలియచేసారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ.. చెట్లునాటి పచ్చదనం పెంపొందెలా, ప్రజల్లో చైతన్యం కల్పించడానికి సాంగ్ చిత్రీకరిస్తున్న బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమం లో శివరాజ్ గౌడ్, కాయిటి నరసింహులు, సిద్ధయ్య జక్కుల నరసింహ, గిరి, గోపి, మాస్టర్ వన్నెస్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

గత నెల మే 25 వ తేదిన, భవన నిర్మాణ కూలీ పనులకు వెళ్లి గవర రాజేశ్వరరావు అనే వ్యక్తి అనారోగ్య సమస్యతో అక్కడ మరణించారు. మృతుడి కుటుంబీకులు స్థానిక కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్‌ను సంప్రదించి, వారి కుటుంబ పరిస్థితులను వివరించారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను, ఆ భవన యజమానిని మూసాపేట్ హనుమాన్ చౌక్ వారి కార్యాలయం వద్దకి పిలిపించారు. చనిపోయిన వ్యక్తి మాత్రమే ఆ కుటుంబానికి ఆధారమని కాబట్టి బాధిత కుటుంబానికి కచ్చితంగా ఆర్థిక సహాయం చేయాలని చర్చించారు. కుటుంబానికి అక్షరాల రూ. 4 లక్షల డీడీలను, మృతుడి కుమారుడు గవర కుమార్‌కు మూసాపేట్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అందజేశారు. ఆయనతో పాటు, ఇంటి యజమాని శాంతి కుమార్, కాంట్రాక్టర్ శ్రీనివాస్, బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలాకి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల 132 డివిజన్ అయోధ్య నగర్‌లోని శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీ విరాట్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రథమ వార్షికోత్సవ వేడుకల కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నదీమ్ రాయ్, యేసు, శ్రీ విరాట్ విశ్వకర్మ సంఘం అధ్యక్షులు బ్రహ్మయ్య చారి, గౌరవాధ్యక్షులు కృష్ణాచారి, నారాయణ చారి, బాబు చారి, ప్రధాన కార్యదర్శి రమేష్ చారి, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి పుట్టినరోజు వేడుకలు...

జగద్గిరిగుట్ట: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంత జీవనం పొందుతారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానంలో నిర్వహించిన హెూమ కార్యక్రమంలో పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మెన్ వేణు యాదవ్, డైరెక్టర్ పెండం మహేష్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ చైర్మెన్ రేగూరి ప్రవీణ్ కుమార్ గుప్తా, గౌరవ చైర్మెన్ కాచం కైలాసం గుప్త, అధ్యక్షులు ఉప్పల రమేష్ గుప్త, చైర్మెన్ నేతి శంకర్ గుప్తా, కమిటీ సభ్యులు లక్ష్మణరావు గుప్త తదితరులు పాల్గొన్నారు.





శ్రీ లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వర్ రావు హాజరయ్యారు. వివేకానందనగర్ శ్రీ అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని, వీఎస్ఆర్ వేదికలో, సింగపూర్ కోటి శ్రీ లలితా సహస్రనామ పారాయణం అరుణ ఆధ్వర్యంలో జరిపించిన శ్రీ లలితా సహస్రనామ పారాయణం ఘనంగా నిర్వహించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు వద్దేపల్లి రాజేశ్వర్ రావుని శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ- కూకట్‌పల్లి

ఎల్ఐజి ఫ్లాట్స్ పై పెంచిన 63 శాతం ఫైనల్ కాస్ట్‌ను రద్దు చేయాలి



- బండి రమేష్‌కు ఫోర్త్ ఫేస్ వెంచర్ 2 వాసుల వినతి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కేపీహెచ్‌బీ కాలనీ ఫోర్త్ ఫేస్ వెంచర్ 2లోని 630 ఎల్ఐజి ఫ్లాట్స్ పై పెంచిన 63 శాతం ఫైనల్ కాస్ట్‌ను రద్దు చేసి వెంటనే ఫ్లాట్స్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ను ఆయన నివాసంలో కలిసి ఫోర్త్ ఫేస్ వెంచర్ 2 వాసుల వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోర్త్ ఫేస్ వెంచర్ 2లో హౌసింగ్ బోర్డు వారు 630 ఎల్ఐసి ఫ్లాట్స్‌ను నిర్మించారు. వీటిని లబ్ధిదారులకు అందజేశారన్నారు. వీటి ఫైనల్ కాస్ట్ 63 శాతంగా నిర్ణయించడంతో ఇంతవరకు ఇవి రిజిస్ట్రేషన్ కాలేదని, ఈ పెంచిన ధరను తగ్గించి తాత్కాలిక ధరకే రిజిస్ట్రేషన్ చేయాలంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గత ప్రభుత్వంలోనూ ఇక్కడి లబ్ధిదారులు ఫిర్యాదు చేశారన్నారు. సమస్య ఎక్కడ వేసిన గొంగడి లాగే ఉంది ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. వెంచర్ ప్రారంభంలో ఇక్కడ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తానని హౌసింగ్ బోర్డ్ హామీ ఇచ్చిందని.. అది ఇంత వరకు నెరవేరలేదని దీనిపై కూడా చర్య తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, పెద్దిరాజు, రవిచావా, శరత్ బాబు, సూరిబాబు, నిరంజన్ రెడ్డి, సుధీర్, మహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మాన్యస్ కిచెన్‌ను ప్రారంభించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్ మోర్ సూపర్ మార్కెట్ ఆపోజిట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మాన్యస్ కిచెన్‌ను ఆదివారం డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం డిప్యూటీ మేయర్, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో కో ఆప్షన్ సభ్యులు తల్లారి వీరేష్, సీనియర్ నాయకులు వెంగయ్య చౌదరి, ఆవుల జగన్ యాదవ్, నాయకులు, సాంబశివరెడ్డి, సాయి ముదిరాజ్, 125డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విజయ్ రామ్ రెడ్డి, యజమానులు సునీల్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చల్లా వంశీచందర్ రెడ్డి కలిసిన తలకొండపల్లి నాయకులు



నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

సీడబ్ల్యూసీ మెంబర్ చల్లా వంశీ చందర్‌రెడ్డిని తలకొండపల్లి కాంగ్రెస్ మండల నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు దోకూరి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భగవాన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు విష్ణుగౌడ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఆరిఫ్, మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.అనిల్‌కుమార్, తదితరులు ఉన్నారు.

'గిరిజన బాలికకు న్యాయం జరగాలి'

నవతెలంగాణ-రంగారెడ్డి

నడిగడ్డ తండాలో 12ఏండ్ల బానోత్ వసంత అనే గిరిజన అమ్మాయి ఈ నెల 7వ తేదీన తప్పిపోయి ఈ నెల 14వ తేదీన శవమై కనిపించిందని ఆ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన బిడ్డ మీద జరిగిన దాడి యావత్ గిరిజన జాతి మీ ద జరిగినట్టేనని అన్నారు. దీనికి ప్రభుత్వం స్పందించి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ న్యాయం జరగకపోతే తెలంగాణ అంతటా వివిధ గిరిజన సంఘాల ఆధ్వ ర్యంలో ఉవ్వెతున నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. గిరిజన, దళిత, బహుజన సంఘాలు తమ తోడుగా రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు స్వామి నాయక్, సీతారాంనాయక్, దశరథ్‌నాయక్, రత్నాకర్, గోపినాయక్, లకపతినాయక్, హరినాయక్, జితేందర్‌నాయక్, మోహన్‌నాయక్, సుధాకర్, రవీందర్‌నాయక్, మధు, క్రిష్ణ, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన ప్రాముఖ్యతపై అవగాహన వాక్



నవతెలంగాణ-బంజారాహిల్స్-జూబ్లీహిల్స్

రక్తదానంపై నగర ప్రజలకు అవగాహన కల్పించేందుకు అపోలో ఆస్పత్రి నుంచి కేబీఆర్ పార్క్ అవగాహన వాక్ నిర్వహించారు. టీసీఎస్, అపోలో ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని అపోలో ఆస్పత్రి తెలంగాణ రీజినల్ సీఈవో తేజస్వి రావు, ఎండి సంస్థ రాష్ట్ర హెడ్ చల్ల నాగ్, డాక్టర్ రవీంద్ర బాబు, ఆర్ పి శ్రీకాంత్‌లు ప్రారంభించి మాట్లాడారు. ప్రమాదాల్లో గాయపడ్డ వారికి, శస్త్ర చికిత్సల సమయంలో రక్తం ప్రాధాన్యత అధికంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన కలిగి ఉండి అవకాశం ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. రక్తాన్ని ఇతర పద్ధతుల్లో సేకరించే అవకాశం లేనందున బుద్ధి జీవులుగా ప్రతివారు తమ రక్తాన్ని దానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. వందలాది మంది యువతి యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని ఉద్దేశించి రక్తదానం అనేది చిన్న అంశం అయినప్పటికీ, ఒక యూనిట్ బ్లడ్ ముగ్గురి జీవితాలలో వెలుగులను నింపగలదని డాక్టర్ సుధా రంగనాథన్, హెడ్ అఫ్ బ్లడ్ బ్యాంక్ అపోలో హాస్పిటల్స్ వారు మాట్లాడుతూ వివరించారు.

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతం

- 45,153 మంది అభ్యర్థులు, 99 పరీక్ష కేంద్రాలు
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆదివారం మెహదీపట్నం సంతోష్ నగర్ కాలనీలోని సెయింట్ ఆన్స్ మహిళా పీజీ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షకు సంబంధించిన వివరాలు, సౌకర్యాల కల్పనపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధికారులంతా టీజీపీఎస్సీ రూపొందించిన నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోనికి వెళ్లే ముందు కలెక్టర్‌ను పోలీసులు తనఖీ చేశారు. గుర్తింపు కార్డు లేకుండా ఎవరిని కూడా పరీక్ష కేంద్రంలోనికి వెళ్లకుండా చూడాలని పోలీసులకు కలెక్టర్ సూచించారు. పరీక్ష పారదర్శకంగా జరిగేందుకు నిరంతరం పర్యవేక్షించేందుకు పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 45,153 మంది అభ్యర్థులు 99 కేంద్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష రాసినట్టు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు నిర్వహించిన పేపర్ 1 పరీక్షకు 25,875 (57.31శాతం) మంది హాజరు కాగా, 19,278 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించిన పేపర్2కు 25,661 (56.83శాతం) మంది హాజరు కాగా, 19,492 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. అంతకుముందు ఉదయం కలెక్టర్ నిజాం కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలీస్ సిబ్బందితో ప్రిలిమినరీ పరీక్ష మెటీరియల్‌ను పరీక్షా కేంద్రాలకు తరలించే ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా, సజావుగా జరిగినట్టు తెలిపారు.

స్వరాష్ట్ర వైతాళికుడు ప్రొఫెసర్ కేశవ రావు జాదవ్

- తెలంగాణ అమరవీరుల ఆశయ సాధన సమితి



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రజా ఉద్యమల ఆద్యుడు స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక భూమిక పోషించిన స్వరాష్ట్ర సంగ్రామ వైతాళికుడు కేశవ రావు జాదవ్ అని వక్తలు కొనియాడారు. జాదవ్ 6 వ వర్ధంతి దినోత్సవాన్ని ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామ్ మనహర్ లోహియా రీసర్చ్ ఫౌండేషన్ డైరక్టర్ వక్త అభిషేక్ రంజాన్ సింగ్,ప్రెస్ అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, చంద్ర కుమార్, మాజీ ప్రెస్ అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ, పాసం యాదగిరి, తెలంగాణ ఉద్యమకారులు విటల్, దాసు సురేష్, ఓయూ మాజీ లా కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ తో పాటు సోషలిస్ట్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొని అయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలు కొనియాడారు. ఈ రాష్ట్ర ఏర్పాటులో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను రాష్ట్ర ఏర్పాటులో నిబద్ధతతో పనిచేసిన వారి సేవలను గుర్తించి కేశవరావు జాదవ్ లాంటి మహానీయుల జయంతి, వర్ధంతిలను అధికారికంగా వివరించాలని డిమాండ్ చేశారు.

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో 'ఎంఎన్‌జే'లో అన్నదానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్.ఎస్.ఎమ్.హుస్సేని(ముజీబ్) టీఎన్జీవోస్ యూనియన్ కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన శుభ సందర్భంలో ఆదివారం ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో సుమారు నిరుపేద (600) రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ బారిన పడ్డ పేద రోగులకు అన్నదాన చేయడం దేవుడు తనకిచ్చిన గొప్ప వరం. అన్నదాన కార్యక్రమానికి సహాయం చేస్తున్న కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్ కుమార్, సభ్యులు ఖాలిద్ అహ్మద్, వైదిక్ శాస్త్ర, బొల్లిగిద్ద శంకర్, మొహమ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్, ఆస్పత్రి సభ్యులు శివ కుమార్, మొహమ్మద్ హబీబ్ చావుష్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ బదిలీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ జోనల్ కమిషనర్, ఐఏఎస్ అధికారి హేమంత్ భోర్కడే పై బదిలీ వేటు పడింది. శనివారం బంజారా హిల్స్ డివిజన్ పరిధిలోని లోటస్ పాండ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇంటి ముందు అక్రమ నిర్మాణాల కూల్చివేతపై బల్దియా కమిషనర్ సీరియస్ అయింది. ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా కూల్చేవేత చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓ మంత్రి ఆదేశాలతో జీహెచ్‌ఎంసీ అధికారుల కూల్చివేతలు జరిగాయంటూ ప్రచారం జరగడంతో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్‌ను జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బాధ్యతల నుంచి తొలగిస్తూ నగర జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు జారీచేశారు. ఈ బదిలీపై ప్రస్తుతం ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో కింది స్థాయి అధికారుల్లో ఓ వింత చర్చ కొనసాగుతున్నట్టు సమాచారం.

బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ)కు అడ్మిషన్స్

నవతెలంగాణ-ఓయూ

ఓయూ క్యాంపస్‌లోని ఆంధ్ర మహిళా సభ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ లో 2024 - 2026 విద్యా సంవత్సరానికి గాను బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ హెచ్ఐ కోర్సుకు అడ్మిషన్స్ ప్రారంభించామని కళాశాల కరస్పాండెంట్ పేర్కొన్నారు. ఈ కోర్సులో మహిళలకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఎలాంటి వయోపరిమితి లేదని, ఏదైనా డిగ్రీ కోర్స్ పూర్తి చేసి పోసి అభ్యర్థులు ఓసి అభ్యర్థులు 50% , బీసీ అభ్యర్థి 45%, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఎలాంటి ఎంట్రన్స్ పరీక్షలు లేదని, ఈ కోర్సు పూర్తి చేసిన వారికి సాధారణ పాఠశాలలతో పాటుగా ప్రత్యేక పాఠశాలలో సర్వశిక్ష అభియన్, ఉద్యోగ అవకాశాలు కలిగి ఉన్నాయన్నారు. ఆసక్తి గలవారు జూన్ 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9642450 722, 9490 94043లను సంప్రదించాలని కళాశాల కరస్పాండెంట్ పేర్కొన్నారు.

నా దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తా



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. వార్డు 6 పరిధిలోని ఏఎంహెచ్ఓ కాలనీ సెక్టర్ సి.అధ్యక్షులు శివరావు ఆధ్వర్యంలో ఆదివారం కాలనీ ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు సేవ చేసే అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తూ మీకు నాయకుడిగా కాకుండా సేవకుడిగా పని చేస్తానని మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా అని తెలిపారు. నా దృష్టికి తీసుకువచ్చిన కంపౌండ్ వాల్, డ్రయినేజీ సమస్య, జిమ్, బోర్ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి నాకు మీరు ఇచ్చిన బాధ్యత నెరవేరుస్తానన్నారు. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌తో బోర్ విషయం గురించి మాట్లాడారు. అలాగే నియోజకవర్గంలోని లేపాక్షి కాలనీలో కూడా కాలనీ వాసులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పి.ఉమాదేవి, కోశాధికారి ఉదయ్ శంకర్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

తరగతి విద్య ఆరోగ్యవంతంగా ఉండాలి



- ఘనంగా లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల వారి వార్షిక ఉపాధ్యాయ సదస్సులు..
- అందుకు ఉపాధ్యాయులు నిత్యా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

నవతెలంగాణ-ఓయూ

లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల వారు (ఓల్డ్ అల్వాల్, టెంపుల్ అల్వాల్, వెంకటాపురం) అల్వాల్ పరిధిలో ఉన్న ఆహార్ కాన్ఫరెన్స్ హాల్‌లో "వార్షిక ఉపాధ్యాయ సదస్సును" ఘనంగా జరుపుకున్నారు. ఈ సదస్సును లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల డైరెక్టర్ కె. సాహితీ సదానంద్ ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయుల నుద్దేశించి మాట్లాడుతూ తరగతి గది ఆరోగ్యవంతంగా ఉండాలంటే, ఉపాధ్యాయుడు ఎటువంటి ప్రణాళికలను సిద్ధం చేసుకుని, తరగతి గదిలోకి ప్రవేశిస్తే బాగుంటుందో చెబుతూ, పలు సలహాలు సూచ నలను ఇచ్చారు. సమాజంలో వివిధ రంగాలలో పతాక స్థాయిలో విజయవంతంగా దూసుకుపోతున్న ఓ లాయర్, ఓ ఇంజనీర్, ఓ డాక్టర్ ఇలా ప్రతి రంగానికి చెందిన ఉత్తమ పౌరుడు ఉపాధ్యాయుని చేతిలో మలచబడ్డ ఓ చక్కటి శిల్పమని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. ఉపాధ్యా యుల పనితీరును అభినందిస్తూ ముఖాముఖి ప్రక్రియ ద్వారా ఉపాధ్యాయులతో అనేక విషయాలు కూలంకుషంగా చర్చించారు. కరోనా సమయంలో మన భారతదేశంలో అనేక రంగాలు స్తంభించి పోయినా విద్యారంగం మాత్రం మేల్కొనే ఉందని, ఎన్నో విపత్కర పరిస్థితుల్ని అధిగమించి, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతుల ద్వారా విద్యను బోధించడం విద్యా రంగానికి లభించిన గొప్ప వరమని, ఈ పనిని తమ ఉపాధ్యాయ బృందం వారు ఎంతో చక్కగా ఆన్‌లైన్ తరగతుల విద్యను విద్యార్థులకు అందించారని ప్రశంసించారు. పవర్ పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా ఉపాధ్యాయులకు స్ఫూర్తినిచ్చే డాక్యుమెంటరీ చిత్రాలను చూపించి, ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య ఎటువంటి సత్సంబంధాలు ఉంటే బాగుంటుందో తెలియజేశారు. లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ కె. జ్యోతి సదానంద్ మాట్లాడుతూ లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల ప్రారంభమై నేటికి 19 వసంతాలు ముగించుకొని 20వ సంవత్సరం లోకి విజయవంతంగా అడుగు పెట్టిందని, కళాశాలలు ప్రారంభమై 30 సంవత్సరాలు దాటి 31వ, సంవత్సరం లోకి అడుగు పెట్టడం జరిగిందని ధీమా వ్యక్తం చేశారు. తమ విద్యాసంస్థలు సమాజంలో మంచి ఖ్యాతి గడించడా నికి కారకులు తమ ఉపాధ్యాయ బృంద సభ్యులే కారణమని ప్రశంసిస్తూ, తమ సంస్థలో ప్రతి గురువు 'ఓసూపర్ టీచర్ 'అని ప్రశంసించారు. లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల వైస్ ప్రిన్సిపాల్ షివిలీ రాయ్ మాట్లాడుతూ. యాజమాన్యం సూచించిన సూచనల మేరకు విద్యా సంస్థలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి పురోభివృద్ధికి బాటలు వేస్తూ, అంకితభావంతో ముందడుగు వేస్తామని తెలియజేశారు. సదస్సులో పాల్గొన్న ఉపాధ్యాయ బృంద సభ్యులు ఏకగ్రీవంగా తమ విద్యా సంస్థ పురోభివృద్ధికి, విద్యార్థులకు ఆరోగ్యవంతమైన, నాణ్యమైన విద్యను అందించడంలో తమ వంతు బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తామని యాజమాన్య సలహాలు శిరోధార్యం అన్నారు. ఈ సదస్సులో లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ కె. జ్యోతి సదానంద్, డైరెక్టర్ కె.సాహితీ సదానంద్, వైస్ ప్రిన్సిపాల్ షినిలీరాయ్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ శామ్యూల్, నాగజ్యోతి, మానసిక శాస్త్రవేత్త పూజ, వందమంది ఉపాధ్యాయులు ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ శామ్యూల్ వందన సమర్పణతో సభ విజయవంతంగా ముగిసింది.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్
- ఎమ్మెల్యేకు కేకేనగర్, ఫేస్ టు కాలనీవాసుల వినతి



నవతెలంగాణ- గండిపేట

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఉన్నారు. ఆదివారం గండిపేట్ మండలం బండ్లగూడ కార్పొరేషన్ గంధంగూడ కేకేనగర్, పేస్ 2 కాలనీ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కాలనీల్లో పర్యటించి, తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసుల కోరిక మేరకు త్వరలోనే కాలనీల్లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక సమస్యలపై ఆరా తీసి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఎమ్మెల్యేగా తిరిగి నాలుగోసారి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు హాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించినందుకు అసోసియేషన్ తరపున ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ లచ్చిం భాయి, కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.



యానాదులను ప్రభుత్వం ఆదుకోవాలి



- అసోసియేషన్ చైర్మెన్ ఆంజనేయులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో యానాదులను ప్రభుత్వం గుర్తించిన సంక్షేమ పథకాలు మాత్రం అందడం లేదని తెలంగాణ స్టేట్ యానాది వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మెన్ ఈ.ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యానాదులను గుర్తించి అభివృద్ధి పరిచే విధంగా చర్యలు చేపట్టి ఆదుకోవాలని కోరారు. ఆదివారం నగరంలోని ప్రముఖ హోటల్లో అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్ తోపాటు యానాదుల జాతి ఆణిముత్యాలు రిటైర్డ్ డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎకనామిక్స్‌లో పీజీ పూర్తి చేసిన శివమ్మను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా చైర్మెన్ ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో యానాదులు ఎప్పటినుండో ఇక్కడ నివసిస్తున్న సంక్షేమ పథకాలు విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందడం లేదన్నారు. యానాదులను అన్ని విధాలుగా ప్రభుత్వం అభివృద్ధి చేయాలని కోరారు. రిటైర్డ్ డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మనతోపాటు జాతిని వెనుకబడిన వారిని ప్రోత్సహించి ముందుకు నడిపించవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ రామచంద్రరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న యానాదులు ఐక్యంగా ముందుకు వెళ్లి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆల్ ఇండియా ఎస్టీ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు పీవీ రమణ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ద్వారానే చదువు ఉద్యోగాలు పదవులు రాజకీయం బిజినెస్‌లో రాణించామని తెలిపారు. ఎంత ఉన్నత స్థితిలో ఉన్న మూలాలను మర్చిపోకుండా వెనుకబడి ఉన్నవారిని ఆదుకొని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. జాతీయ ప్రధాన కార్యదర్శి హరి రామ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న యానాదులు ఐక్యమత్యంతో ముందుకు వెళ్లి జాతిని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ శేషాద్రి, వై.శ్రీనివాసులు, యామిని కుమార్, దొరయ్య, జాతీయ కార్యనిర్వాక అధ్యక్షురాలు డాక్టర్ పద్మజ ఎం.పార్థసారథి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు బహుమతులు అందజేత



నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

కొండాపూర్ డివిజన్ పరిధిలోని శిల్పారామంలో జరిగిన నృత్య మాలిక సాంస్కృతిక కార్యక్రమంలో కళాకారులకు బహుమతులు అందజేశారు. మాజీ కౌన్సిలర్ రాంచందర్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నృత్య మాలిక సాంస్కృతిక కార్యక్రమం నిర్వకాహించడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. కళాకారులకు అరుదైన గౌరవం అని, తల్లీదండ్రులు తమ పిల్లలకు వారి నచ్చిన రంగంలో ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని తెలిపారు. వారిలో దాగి ఉన్న కళను గుర్తించి దానికి తగ్గ సాధన చేయిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని, మంచి పేరు ప్రఖ్యాతు లు తీసుకువస్తారని అన్నారు. కళామతల్లిలో ఒదిగిపోతారని, మంచి కళా నై పుణ్య ప్రదర్శనలు చేశారని నిర్వహకులను, పిల్లలను ప్రత్యేకంగా అభినందిస్తు న్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నగరంలో హిమాయత్ నగర్ లోని టీటీడీ దేవస్థానం, తిరుపతి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వేదికగా 19వ వార్షిక బ్రహ్మోత్సవాలకు జీహెచ్‌ఎంసీ డీప్యూటీ మోతె శ్రీలత శోభన్ రెడ్డి ఎస్ఐటీయుసీ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు మోతె శోభన్ రెడ్డి తో కలిసి హాజరై, స్వామి వారి ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని, ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు స్వీకరించారు.

నవతెలంగాణ-ఓయు

గత ప్రభుత్వ తప్పిదాలపై ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలి

- జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి



నవతెలంగాణ-బంజారా హిల్స్

గత ప్రభుత్వం చేసిన తప్పిదాలపై ప్రస్తుత ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి అన్నారు. 2013 భూ సేకరణ చట్టానికి గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం చేసిన సవరణ చాలా అన్యాయమని, ఈ తప్పిదాన్ని సవరించి భూ నిర్వాసితులకు న్యాయం చేయవలసిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చట్టానికి సవరణలు చేస్తుందా లేకపోతే అలాగే కొనసాగిస్తుందని ఆయన ప్రశ్నించారు. ఆదివారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో జర్నలిస్టు, రచయిత రేమిల్ల అవధాని రాసిన 'ఊళ్లు నీళ్లు కన్నీళ్లు' పుస్తకాన్ని ప్రొఫెసర్ కోదండరామ్ , అవధాని సతీమణి విజయలక్ష్మి, ఆవిష్క రించి వారు మాటాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 2013 చట్టానికి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సవరణలలో మార్పులు చేసి బాధితులకు న్యాయం చేస్తుందా లేక పాత చట్టాన్ని కొనసాగిస్తుందని ప్రశ్నించారు. కాళేశ్వరంపై విచారణ జరుగుతున్న ఎస్ ఎస్ జస్టిస్ ఎల్.నరసింహ రెడ్డి, కమిషన్‌కు, మల్లన్న సాగర్‌కు ఎందుకు రిఫర్ చేయలేదని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పుస్తకం తొలి ప్రతి అందుకున్న ప్రొఫెసర్ కోదండరామ్ మల్లన్న సాగర్ బాధితుల సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయభేరి తిరుమలరావు, మల్లన్న సాగర్ నిర్వాసితుడు హయ్యతుద్దీన్, సారపల్లి మల్లారెడ్డి ఏఐకే ఎస్, వైస్ ప్రెసిడెంట్ మల్లన్న సాగర్ నిర్మసితుల జీవిత గాతను వివరించారు.

రూ.లక్షా 20 వేల ఎల్‌ఓసీ అందజేత

- నిత్యం ప్రజా సేవలో ఉంటా : సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-కందుకూరు

ఆర్థికంగా వెనుకబడిన వారందరికీ సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కందుకూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన కొమ్మ గళ్ళ జ్యోతి, కొన్ని రోజుల క్రితం అనారోగ్యం పాలై చికిత్సకు డబ్బు లే క ఇబ్బంది పడింది. స్థానిక ఎంపీటీసీ సురసాని రాజశేఖర్ రెడ్డి ఆధ్వ ర్యంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు వెం టనే స్పం దించి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌ఓసీ లక్షా 20వేల రూపాయలు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె అంద జేశారు. నియోజకవర్గం ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి నిత్యం ప్రజా సేవలో తాను ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల్ యూత్ అధ్యక్షులు తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్ రెడ్డి, బాలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డొకురి ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

తలకొండపల్లి మండల పరిధిలోని మెదక్‌పల్లి గ్రామానికి చెందిన దరువుల కృష్ణయ్య(51) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాం గ్రెస్ మండలాధ్యక్షుడు డొకూరి ప్రభాకర్‌రెడ్డి మృతుడి భార్య ఇందిరమ్మకు రూ.3వేల ఆర్థిక సాయం చేశారు. అలాగే దరువుల శంకర్ రూ.2వేలు, గ్రామ రైతు కమిటీ మాజీ అధ్యక్షులు తిరుమణి ఈశ్వర్‌గౌడ్ రూ.2 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు విష్ణుగౌడ్, వెంకట్‌రెడ్డి, చంద్రమౌళి, చంద్రధన గ్రామం మాజీ ఎంపీటీసీ రాము లు, మాజీ ఉపసర్పంచ్ నరేష్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు దరువుల వెంకటేష్, గ్రామ నాయకులు రజనీ కాంత్, పాండు, రమేష్, నవీన్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

కింద పడటాన్ని ముందే తెలుసుకోవచ్చు!



- భవిష్యత్‌లో రాబోయే సమస్యలపై ముందే అంచనా
- పడిపోయే లక్షణాలు కూడా ముందుగానే గుర్తింపు
- న్యూరో రీహాబిలిటేషన్‌కు ఏఐ సాయం
- కిమ్స్ ఆస్పత్రిలో రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు
- ఐదు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా హాజరు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ప్రధానంగా తుళ్లి కిందపడిపోవడం వంటివి తరుచూ మనం చూస్తాం. అంతే కాకుండా చాలా మందికి మోకాళ్ల అరిగిపోవడం వల్ల మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు (నీ రీప్లేస్‌మెంట్) చేయాల్సి వస్తోంది. అలాగే ఇండ్లల్లో ఉండే పెద్దవారు పడిపోవడం వల్ల తుంటికి, ఇతర భాగాలకు గాయాలు అవుతుంటాయి. అలా పడిపోయే అవకాశం ఎంతవరకు ఉంది, దాన్ని ఎలా నివారించాలన్నది ముందే తెలుసుకుంటే! న్యూరో రీహాబిలిటేషన్‌లో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం దీన్ని సుసాధ్యం చేస్తోంది. మనకు ఇప్పటికిప్పుడు ఎలాంటి సమస్యా లేకపోయినా, సంబంధిత వైద్యుల వద్దకు వెళ్తే కొన్ని రకాల సులభమైన పరీక్షలు చేసి భవిష్యత్‌లో మనకు రాబోయే సమస్యలేంటో వాటిని ఎలా నివారించుకోవచ్చో కూడా చెబుతారు. సరిగ్గా ఇలాంటి విషయాలన్నింటిలో వచ్చిన కొత్త టెక్నాలజీ గురించి కిమ్స్ ఆస్పత్రికి చెందిన న్యూరో రీహాబిలిటేషన్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సదస్సును శని, ఆదివారాల్లో నిర్వహించారు. దీనికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా ఫిజియోథెరపిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆస్పత్రి న్యూరో రీహాబిలిటేషన్ విభాగాధిపతి డాక్టర్ అజయ్ కుమార్ మిద్దె మాట్లాడుతూ "ఆస్పత్రికి వచ్చిన రోగుల్లో ఎవరికి ఏ తరహా ఫిజియోథెరపీ చికిత్సలు అందించాలన్నది చాలా ముఖ్యం. కొందరికి కొన్ని రకాలే చేయాలి, కొందరికి కొన్ని అసలు చేయకూడదు. ఇలాంటి విషయాలన్నీ ఫిజియోథెరపిస్టులు తప్పనిసరిగా తెలుసుకోవాలి. చికిత్సల్లో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం వస్తున్నట్టే.. భవిష్యత్‌లో రాబోయే సమస్యలను కూడా ముందుగానే తెలుసుకునేందుకు కొన్ని సులభమైన పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. కాస్త పెద్దవయసు వారు పడిపోవడం మనం తరచు చూస్తుంటాం. భవిష్యత్‌లో ఇలా పడిపోయే అవకాశం బాగా ఎక్కువగా ఉంటే వారిని వాకర్‌తోనే నడవాలని, ఒక మాదిరిగా ఉంటే కర్ర సాయం తీసుకోవాలని చెబుతాం. బాగా తక్కువగా ఉంటే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నడిచే తీరు, కూర్చునే పద్ధతి, కుర్చీలోంచి లేవడం ఎలా లేవాలి.. ఇలాంటి విషయాలన్నీ చెబుతాం. దానివల్ల వారికి భవిష్యత్‌లో సమస్యే ఉండదు. అలాగే మోకాళ్ల అరుగుదలకు ఎలాంటి కారణాలుంటాయి, డిస్క్ సమస్యలు ఎందుకు వస్తాయనేది కూడా వివరించి, అవి రాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పచ్చు. ఇవన్నీ ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి" అని తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కిమ్స్ ఆస్పత్రుల గ్రూప్ ఛైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, పాట్రన్‌గా న్యూరోసర్జరీ విభాగాధిపతి, సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రాహి, రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ జయశంకర్ తెడ్ల, అతిథి వక్తగా కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ శ్వేత పెండ్యాల, ఆర్గనైజింగ్ ఛైర్మెన్‌గా న్యూరో రీహాబిలిటేషన్ విభాగాధిపతి డాక్టర్ అజయ్ కుమార్ మిద్దె, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సీనియర్ న్యూరో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సిద్ధార్థ గంటాయత్, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌ను కాలయాపన చేస్తున్న కాంగ్రెస్

- తక్షణమే సమగ్ర కుల గణన సర్వే చేయాలి
- ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి కుల గణనపై చిత్తశుద్ధి లేదు
- ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కామారెడ్డి డిక్లరేషన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచుతామన్నారు. హామీనిచ్చి నేటికీ ఆరు నెలలు గడిచిపోయినా సమగ్ర కుల గణనపై కాలయాపన చేస్తున్నారని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి సమగ్ర కుల గణనపై చిత్తశుద్ధి ంటే కుల గణన చేసేవాడన్నారు. సమగ్ర కుల గణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలన్నారు. కాంగ్రెస్ సమగ్ర కుల గణన చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. గతంలో సమగ్ర కుటుంబ సర్వే పేరుతో మాజీ సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేశారనీ, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కూడా అదే దారిలో వెళ్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఓటర్ హక్కు ఉన్న వారిని పరిగణనలోకి తీసుకుంటామనడం విడ్డూరంగా ఉందన్నారు. మరో పక్క అగ్రవర్ణాలకు చెందిన పలు దిన పత్రికలు సమగ్ర కుల గణనపై తప్పుడు కథనాలు ప్రచురిస్తూ కుట్రలు చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బీసీల మీద ప్రేమ లేదన్నారు.

'ఇండ్ల స్థలాల కోసం పేద ప్రజల పోరాటం'



నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

రెండు దశాబ్దాలుగా నగరంలో అద్దెఇంట్లో నివసిస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్లకు అర్హులైన పేద ప్రజలు ఇండ్ల స్థలాల కోసం మియాపూర్ డివిజన్‌కు చెందిన మహిళా నాయకురాలు సం గీత ఆధ్వర్యంలో ఆదివారం మియాపూర్ లోని ప్రగతి ఎంక్లేవ్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన సమావేశంలో వివిధ ప్రాంతల నుండి వచ్చిన మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంగీత మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖరరెడ్డి నుండి కేసీఆర్ నేడు రేవంత్ రెడ్డి వరకు అర్హులైన పేద లకు డబుల్ బెడ్రూం ఇస్తామని ఇప్పటి వరకు ఎవరికి ఇచ్చారో తెలుపాలని ఇళ్లు ఉన్న వారికి సైతం ప్రలోభాలకు ఆశపడిన స్థానిక నాయకు లు, అధికారులు కుమ్మక్కై, అర్హులైన పేదలకు మొండి చేయి చూపారన్నారు. వివిధ ప్రాంతాల నుండి పొట్ట కూటి కోసం నగరానికి వలస వచ్చిన పేద ప్రజలు 20 ఏండ్లుగా కూలీ పను లు, ఇండ్లఓ పాచీ పనులు చేసుకుంటూ జీవనం గడిపే వారు అద్దె భరించలేని దీన స్థితిలో ఉన్నా రని సంపాదనలో సగం అద్దె ఇల్లుకే కట్టాల్సి వ స్తుంది. వారి కుటుంబంలోని పిల్లల చదువులకు ఫీజులు కట్టుకోలేని స్థితిలో ఉన్న వారు కూడా ఉన్నారని వాపోయారు. 15 ఇండ్లు లేని పేదప్ర జలు అందరూ సంఘటితమై సమావేశాలు ఏ ర్పాటు చేసి తమ న్యాయమైన కోరిక ప్రభుత్వం తమకు ఇచ్చిన వాగ్దానం అమలు కోసం సుదీర్ఘ మైన పోరాట కార్యాచరణ ప్రణాళిక బద్ధంగా ముందుకు తీసుకు పోవాలని నిర్ణయించుకు న్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవా లని అంతవరకు ఈ పోరాటం ఆగదని తెలిపా రు. వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన మహిళలు తమ స్థితిగతులను ఈ వేదికపై ఏకరువు పెట్టారు. పేదరికంలో ఉన్న వారికి ఇండ్ల స్థలాలు లేదా ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ సంగీతతో పాటూ మహిళలు రవనమ్మ, జ్యోతి, మల్లీశ్వరి, మౌనిక, దేవి, పద్మ, రమాదేవి, నిర్మల, సుశీల, టి.బాలమణి, బి. సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేజీ రెడ్డి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల 15వ వార్షికోత్సవం



నవతెలంగాణ-మెయినాబాద్

మెయినాబాద్‌లోని కేజీ రెడ్డి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల 15వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. విద్యార్థి వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి అధ్యక్షుడు ప్రొఫెసర్ ఆర్.లుంబద్రి ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ...ఈ విద్యా సంస్థ ప్రతిభా సంపన్న కేంద్రంగా మారిందని కొని యాడారు. హరిత కాంపస్ ఒకపెద్ద ఆకర్షణ అన్నారు. ఈ సందర్భంగా కెజి రెడ్డి కళాశాల డైరెక్టర్ డాక్టర్ రోహిత్ కందాకట్ల విద్యార్థుల ప్రతిభా పాటవాలను ప్రత్యేకంగా అభినం దించారు. భవిష్యత్తు కార్యాచరణలపై వారికి పలు సలహాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సత్యనారాయణ రెడ్డి వార్షిక నివేదికను చదివారు. విద్యార్థులు వివిధ రంగాల్లో విద్యాభ్యాసంతో పాటు సాధించిన విజయాలను వెల్లడించారు. ఈ సం దర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్ర మాలు ఆహూ తులను ఆకట్టుకున్నాయి.

గోవధ చట్టాన్ని అమలు చేయాలి

- పాతూరి నారాయణరెడ్డి

నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

హైకోర్టు ఆదేశాల మేరకు గోవధ చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేసే విధం గా చర్యలు తీసుకోవాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా సీనియర్ నాయ కులు పాతూరి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం జరిగే బక్రీద్ పండుగకు హిందువులు ఆరాధ్యదైవంగా కొలిచే గోమాతను (ఎద్దును కూడా) కు ర్బానీ పేరుతో వధించరాదన్నారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమం త్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గోహ త్యను నిషేధిం చడానికి కేసీఆర్ స్టీరింగ్ ఓవైసీ చేతిలో ఉన్నదని ఎద్దేవా చేశా రని. కానీ ఇప్పుడు అదే ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న రేవంత్ రెడ్డి గోవ ధ చేస్తున్న వారిని ఆపలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. శేరిలింగం పల్లి నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు కార్యకర్తలు కంటైనర్, డీసీ ఎంలపై నిఘాఉంచి గోవులను తరలిస్తున్నట్టు అనుమానం వస్తే వెంట నే పోలీసు వారికి సమాచారం ఇచ్చి గోవులను రక్షించాలన్నారు.

ఘనంగా పిత్రు దినోత్సవం వేడుకలు



నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

పిత్రు దినోత్సవ వేడుకలను మియాపూర్ డివిజన్ పరిధిలోని గ్రేస్ అనాథ ఆశ్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమవాసులకు అల్పాహారం అంద జేసి,వృద్ధులకు పాదనమస్కారాలు చేశారు. కన్వీనర్ తాడిబోయిన రామ స్వామి యాదవ్ మాట్లాడుతూ..తన కష్టాలకు, త్యాగాలకు ఏ విధమైన ప్రతిఫలం ఆశించని నిస్వార్థ వ్యక్తి నాన్న అన్నారు. తన సంతానాన్ని వేలు పట్టుకొని లోకాన్ని పరిచయం చేసిన వ్యక్తి నాన్న అన్నారు. తల్లి నవమా సాలు మోసి జన్మనిస్తే, తండ్రి తన సంతానం ఎదుగుదలకు అహర్నిశలు శ్రమించే వ్యక్తి నాన్న అని తెలిపారు. తన సతానం ఉజ్వల భవిష్యత్తుకై తను కొవ్వొత్తిలా కరుగుతూ వెలిగునిచ్చేవాడే నాన్న అన్నారు. ఆయన త్యాగం వెలకట్టలేనిదని రుణం తీర్చలేనదన్నారు. పరాజయం పొందిన ప్పుడు భుజాలపై తట్టి 'గెలుస్తావులే' అని ఆత్మస్థైర్యం కలిగించే వ్యక్తి నాన్న అన్నారు. సృష్టిలో జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మించిన దైవం లేదన్నారు. వృద్ధాప్యంలో కంటికి రెప్పలా కాపాడవలసిన సామాజిక బాధ్యత పుత్ర, పౌత్ర సంతానాలపై ఉందన్నారు. నేటి యువత స్వార్థ చింతన విడనాడి పెద్దలను, తల్లిదండ్రులను గౌరవిస్తూ, కడదాకా వారి పట్ల ప్రేమానురాగాలు చూపించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు శ్రీనివాస్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ధర్మసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన జగదీశ్వర్ గౌడ్

నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి గ్రామం స్కై వుడ్స్ గేటెడ్ కమ్యూనిటీ వారు ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు,అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT : AT: HYDERABAD
O.S.No. 596 of 2024

Between:
G.Mahendar Reddy ......Plaintiff
And
P.Raghavendera Swamy .....Defendant

To,
P.Raghavendera Swamy S/o. Venkateshwara Swamy Aged about 38 years, Occ: Business R/o. H.No.3-12-93/138/102 Road No.2, Rock Town, Indraprasta Colony, Chintalakunta, L.B.Nagar, R.R. District – 500074

The defendant may please take notice that the above suit for recovery of money against the defendant and the above suit is posted on 01-07-2024 at 10:30 A.M. for your appearance. You may appear in person or through pleader duly instructed, failing which, the proceedings shall proceed ex-parte.

// By order of the Hon'ble Court//
D.SRINIVAS RAO, Advocate,
17-1-391/T/235, Saraswathi Nagar, Saidabad, Hyderabad – 59
Cell: 9959074891

IN THE COURT OF VIII JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT :: AT HYDERABAD
O.S.No. 757 of 2023

Between :
Union Bank of India
Khairtabad Branch.Hyderabad-4 ... Plaintiff
Vs.
M/s RR Polymers & another .... DefendantS

SUMMONS:

To,
1. M/s. R R Polymers, Rep. by its sole Proprietor, Mr. Ravi Shekhar Mynam Plot No.20, Rajeev Nagar, Prasanthi Nagar,IE, Kukatpally, Hyderabad – 500072.
2. Mr.Ravi Shekar MynamS/o. Not Known H.No.49-285/B/403, Padma Nagar Phase I,Chintal, Hyd – 054.

Take Notice that the Plaintiff has filed the above suit for recovery of Rs.6,40,649/- along with subsequent interest and costs from you. The summons sent to you has been returned un-served.
Now the Hon'ble Court orders you either to appear in person or through a pleader on 23.07.2024 by 10.30 AM or show cause as to why the relief claimed should not be granted. In case of non- appearance the Hon'ble Court will set you ex-parte and the suit will be decided as per law.

// BY ORDER//
V. RAGHU Advocate
4-1-750, J.N. Road, Hyderabad-500001
Mb.9440051529

PUBLIC NOTICE

General public is hereby informed that my client by name Bilkis Tayyaba, W/o. Mohd. Farooq Palllu, age: 59 years, Occ: house wife, R/o. Flat No.101, H.No.1-9-49/1/ABCD Gowry Shankar Apts, Ramnagar, Hyderabad had given GPA document No.8/IV/2011, dt. 16-4-2011 to Mohsin Ahmed, S/o. Ahmed Ameenuddin, age: 43 years, Occ: private employee, R/o. H.No. 12-2-854, Zeba Bagh, Asif nagar, Hyderabad. My client hereby revokes all the power and cancel the said General Power of Attorney, absolutely and completely and revoke all power or authority there by and there under given to him. If anyone is did any transactions with said Mohsin Ahmed, the said tran sactions are null and void and not binding to my client.

T.KISHORE KUMAR
ADVOCATE: NALGONDA.
Ph.No.9848985001.

CHANGE OF NAME

I, PRABAVATHI GUTHA, W/O. MITAKANTI LAKSHMA REDDY Age 75years, R/o. H.no.3-4-663 /26, Near Narayanguda Flyover, Shivaji Nagar, Hyd-29, Telangana, India, do here by declare that I have changed my name from "Given Name = Prabavathi Surname = Gutha " to "Given Name = Prabavathi Surname = Mitakanti"

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT NAKRKEAL
O.S.NO.134 OF 2023

Between:
Vangala Susheela ...Plaintiff
And
1.Kandala Janga Reddy
2.Thahasildar Shaligouraram
3.District Collector Nalgonda ...Defendants

To,
Kandala Janga Reddy S/o.Narsi hma Reddy age 50 years, occu: agriculture R/o.Uppuguda, Koheda, Hayathnagar.

The above named plaintiff filed above suit for declaration of title and perpetual injunction and same is posted on 09-07-2024 for appearance. You are directed to appear before the Hon'ble court on 09-07-2024 at 10-30 am.

// By Order Of Hon'ble Court //
SUDINI SRINIVAS REDDY,
B.Com,LL.B,
ADVOCATE,NAKREKAL.

PASSPORT MISSNIG

Name : **AMOL SOPAN JOGDAND S/o SOPAN JOGDAND,** Add : 221,Gaur ,purna, parbhani, Maharashtra -431511. Passport No: **Y3417719.** Note : That my original Indian valid passport has been lost , while I was traveling from Nanded to Begumpet by train no - **17664** my bag missing **13-6-2024** morning at 5.40am Begumpet railway station.If Anybody found please Contact: AMOL JOGDAND:
+91 8007958614/9112108465

IN THE COURT OF THE HONOURABLE II ADDTIIONAL JUNIOR CIVIL JUDGE CUM VI ADDITIONAL METROPOLITAN MAGISTRATE MEDCHAL-MALKAJIGIRI DISTRICT AT: L.B.NAGAR
O.S.NO. 2068 OF 2022

BETWEEN:
G. Ramakrishna ...Plaintiff
AND
M.Shanti Ananda Priyadarshini and another ...Defendants No.1 and 2

To,
1. Ms.Santi Ananda Priyadarshini D/o: Surya Vara Prasad Santi Aged: 37 Years, Occ: Private Service R/o: 1-9-219/3/1, Ramnagar, Hyderabad.
2. G.Shiva Kumar. S/o: G.Ramakrishna Aged: 43 Years, Occ: Private Service Permanent R/o: H.NO. 9-96, Lakshmi Nagar Colony, Boduppal, Ghatkesar Mandal, R.R.District 500092 .../Defendants No.1 and 2

Please take notice that my client Ramakrishna Gonella filed suit in O.S No. 2068 of 2022 against you on the file of II Additional Junior Civil Judge Cum VI Additional Metropolitan Magistrate Medchal-Malkajigiri District at L.B.NAGAR The said case stands posted to 08/07/2024 for your apperance.
You are required to appear either in person or through your duly authorized Advocate at 10: 30 AM on 08/07/2024, before the above mentioned court failing which the case shall be decided ex-parte.

"BY ORDER OF THE COURT"
SV ASSOCIATES
K. SRIDEVI
S. RAGHURAM
S. SHRUTI
ADVOCATES
#11 & 12 GROUND FLOOR, SHOBHA PAVANI ARCADE, 1-9-1114 To 1117, Opp: DURGADAI DESHMUKH HOSPITAL, VIDYANAGAR, HYD-500044,
Cell: 9949185000

IN THE COURT OF THE IV ADDITIONAL DISTRICT & SESSIONS JUDGE CUM FAMILY COURT, AT: SANGA REDDY
I.A. No. 669 OF 2023
IN
O.S. No. 63 OF 2023

Between:
BASHETTY ADITHYA & another. ...Petitioners/Plaintiffs
AND
PALEM KRISHNA & others. .....Respondents/Defendants

To,
(R-6)GURU BRAHMAM GUNTI, S/o Galaiah Gunti, Aged about: 40 Years, Occ: Business, R/o Flat No. 401 , Land Mark Pristine, Road No.2, Kousalya Colony, Bachupally, Medchal Malkajgiri District, T.G. Hyderabad-500090

Please take notice that my clients Bashetty Adithya & another, filed a civil suit in O.S. No.63 of 2020 for specific performance of Agreement of Sale against Palem Krishna & others. As the Defendant No.1& 2 therein sold out the said property to one M/s Senthan Properties, in turn it was sold out to T Masthan, Smt A Sireesha and you. Therefore my client filed an impleading petition against you and other in I.A. No. 669 of 2023 in O.S. No. 63 of 2020. As the notices filed and the same was not served against you as such this Hon'ble Court ordered notice to you through public news paper by way of substituted services of notices. Therefore you are hereby directed to attend before the above mention court at 10.30 A.M. on 20-06-2024 in person or through your counsel failing which the matter will be decided as per law.

"By order of the Court"
M. ANAND RAO
B.Com. (Hons), L.L.B.
Advocate
Off: 1-8-1/A/2/A&B, 1st Floor, Opp. Sri Uday Sai Medical Hall, Baghlingampally 'X' Roads,Hyd-44
Ph: 092461 92948
Mobile: 08121000558

IN THE COURT OF THE IV ADDITIONAL DISTRICT & SESSIONS JUDGE CUM FAMILY COURT, AT: SANGA REDDY
I.A. No. 668 OF 2023
IN
O.S. No. 63 OF 2023

Between:
BASHETTY ADITHYA & another. ....Petitioners/Plaintiffs
AND
PALEM KRISHNA & others. ...Respondents/Defendants

To,
(R-6)GURU BRAHMAM GUNTI, S/o Galaiah Gunti, Aged about: 40 Years, Occ: Business, R/o Flat No. 401, Land Mark Pristine, Road No.2, Kousalya Colony, Bachupally, Medchal Malkajgiri District, T.G. Hyderabad-500090

Please take notice that my clients Bashetty Adithya & another, filed a civil suit in O.S. No.63 of 2020 for specific performance of Agreement of Sale against Palem Krishna & others. As the Defendant No.1& 2 therein sold out the said property to one M/s Senthan Properties, in turn it was sold out to T Masthan, Smt A Sireesha and you. Therefore my client filed a reopen petition against you and other in I.A. No. 668 of 2023 in O.S. No. 63 of 2020. As the notices filed and the same was not served against you as such this Hon'ble Court ordered notice to you through public news paper by way of substituted services of notices. Therefore you are hereby directed to attend before the above mention court at 10.30 A.M. on 20- 06-2024 in person or through your counsel failing which the matter will be decided as per law.

"By order of the Court"
M. ANAND RAO
B.Com. (Hons), L.L.B.
Advocate
Off: 1-8-1/A/2/A&B, 1st Floor, Opp. Sri Uday Sai Medical Hall, Baghlingampally 'X' Roads,Hyd-44
Ph: 092461 92948
Mobile: 08121000558

FORM NO.2
SEMMONS FOR SETTLEMENT OF ISSUES (Or S R I.5)
IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT: NARAYANAPET
O.S.No.53 of 2015.

Between:
M. Ravishankar Reddy. ...Plaintiff
And
Venkatramireddy and others. ... Defendant.

To,
D.11. Nanavath Harika D/o Nanavath Balram age 18 years occup: Student R/o. H.No. 2-3-703/1, Maruthinagar Amberpet, Hyderabad-500013.
D.12. Smt. Jyothi Rani Savala W/o Venkateshan Anamal age 35 years occup: House wife R/o. H.No. C-103, Keshav Dalla Apartment, Hyderabad-500004.

Whereas plaintiff/s have instituted suit against you for declaration. Hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material question relating to the suit or who shall accompanied by same person able to answer all such question on 03.07.2024 at the noon to answer the claim and further you are hereby directed to file on that day a written statement of defense to produce on the said day all document in you possession power upon which your base your defense of claim for set off counter claim and where you rely on any the on document weather in you possession or power or not evidence in support of your defense claim for set of counter claim you shall enter such document in list to be annexed to the written to the statement. TAKEN Notice that in default of you appearance on day before mentioned the suit will be heard and determined in your absence.

Given under my hand the seal of the Court this day 2024.

JUDGE

Note: You Should appear and file the written statement and documents within 30 days from the date of receipt of this summon in order to avoid passing the order if any against you in ex-parte.

Through
SRI. MALLIKARJUN
advocate, Narayanpet,
Dist Narayanpet.

IN THE COURT OF THE HONOURABLE SENIOR CIVIL JUDGE AT : SHADNAGAR
I.A.NO. 326 OF 2024
IN
A.S.NO. 8 OF 2019

Between:
Matta Manohari ....Petitioner/ Appellant
AND
Allam Chinnapur Reddy ...Respondents/Defendants

To

Respondent No.3
1. Ch. Naveen Kumar Goud S/o. Late.Ch.Fakeera Goud, Aged about 33 years, R/o. H.No.11-143, Gaddiannaram, P&T Colony, Dilsukhnagar, Ranga Reddy District.

Respondent No.4
2. Ch. Laxmi W/o. Late. Ch. Fakeera Goud, Aged about 55 years, R/o. H.No.11-143, Gaddi annaram, P&T Colony, Dilsukh nagar, R.R.District.

Respondent No.5
3. Subhadra W/o. Ch. Yadaiah Goud, Aged about 65 years, R/o. H.No. 11-88/1, Pragatinagar, P&T colony, Dilsukhnagar, Rangareddy District

Respondent No.7
4.D. Narsing Rao S/o. Ram chander Aged about 53 years, R/o. H.No. 18-8-224/5/288, Raja Narsimha Colony, Kunchanbagh, Pisalabanda, Hyderabad.

NOTICE

Whereas the Petitioner/Plaintiff has filed a Petition in I.A.No.326 of 2024 in A.S.No.8 of 2019 against you and others. You are hereby summoned to appear before this Hon'ble Court either in person or through your counsel to answer such all questions on the 24th day of June 2024 at 10.30 AM.

If you all failed to appear before the Hon'ble Court on 24-06-2024 at 10.30 A.M. either in person or through advocate the matter will be decided in your absence.

//BY ORDER OF THE COURT//
SABIA SULTANA B.A.L, BL
Advocate/ Notary
S.S. LAW CHAMBERS
Opp: Parameshwara Theater
Shadnagar Town - 509 216
Farooqnagar Mandal,
Rangareddy District
Telangana State
Cell No. 9885786216

నవతెలంగాణ
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
సోమవారం | జూన్ 17, 2024 | www.navatelangana.com

107వ వారానికి చేరిన జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం సభ్యులు ప్రతీ ఆదివారం చేపట్టే మహనీయుల జ్ఞానమాల కార్యక్రమం 107వ వారానికి చేరింది. జ్ఞానమాల టీం సభ్యులు మహాత్మాజ్యోతిరావు పూలే, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్‌లకు పూలమాల వేసి జ్ఞానమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, నర్సింహ్మ చారి, నరేందర్‌రావు, రవి నాయక్, మెకానిక్ కొండల్, కనకయ్య చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్కూల్ ఎడ్యూకేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ముజీబ్‌కు సన్మానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) నూతనంగా ఆ సంఘం సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్, స్కూల్ ఎడ్యూకేషన్ డిపార్టుమెంట్ యూనిట్ జిల్లా అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు ఎం.రవి, వారి కార్యవర్గంతో కలిసి పూలబొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్వతాలు, జిల్లా ఉపాధ్యక్షులు కె. శ్రీనివాస్, పబ్లిక్ సెక్రటరీ వైదిక్ శస్త్ర, ఈసీ మెంబర్లు బి.శంకర్, శ్రీధర్, ఈఎస్‌టీ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా పరిధిలోని నేతాజీ నగర్ అశోక్ ఎన్‌క్లేవ్ దగ్గర లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా, ఏఎస్‌రావు నగర్ చారిటబుల్ ట్రస్ట్, ఫ్యామిలీ హెల్త్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 'ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధక్షుడు లయన్ కంతేటి విజయకుమార్ మాట్లాడుతూ.. పేదల కోసం మరిన్ని హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంపులో కమలానగర్ 'ప్లానెట్ ఆప్టికల్స్ డాక్టర్ అనీల్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారు. దమ్మాయిగూడ పద్మ సాయి డెంటల్ క్లినిక్ డాక్టర్ దినేష్ బృందం దంత పరీక్షలు చేశారు. డాక్టర్ కాత్యాయిని జనరల్ పరీక్షలు, ఫిజియో థెరపిస్ట్ చాముండేశ్వరి శారీరక పరీక్షలు నిర్వహించారు. ఎస్కే డయాగ్నోస్టిక్ వారు బీపీ, షుగర్‌తో పాటు రక్త పరీక్షలు చేశారు. డాక్టర్ వినీత గైనిక్ పరీక్షలు చేశారు. ఈ క్యాంపులో 157 మంది పాల్గొని వివిధ రకాల పరీక్షలు చేయించు కున్నారు. 10 మంది రోగులకు ఉచితంగా కాటరాక్టు ఆపరేషన్లు చేశారు. సైకా నాగరాజ్ ఉచితంగా రోగులకు మందులిచ్చారు. ఈ కార్యక్రమంలో నందిని, క్లబ్ సెక్రటరీ చనమోలు వరప్రసాద్, కోశాధికారి చందన్ రాజు, సభ్యులు ఆర్పీసేథ్, సునీల్, స్థానిక కాలనీ నాయకులు పాల్గొన్నారు.

యశోదమ్మ జ్ఞాపకార్థం నోట్ బుక్స్ పంపిణీ



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్‌లోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సుర్నీల యశోదమ్మ జ్ఞాపకార్థం మున్నూరు కాపు పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. మున్నూరు కాపు కు చెందిన చెరకు రిథితకు బీటెక్ చదువు కొనడానికి నాలుగేండ్లకు అయ్యే ఖర్చు రూ.2. 64 లక్షలు కీర్తిశేషులు ఇప్ప విఠల్ జ్ఞాపకార్థం ఆయన కూతురు పుష్ప అందజేసినట్టు సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సూర్ నీల నర్సింగ్ రావు, బండారు సత్యనారాయణ, మేడ వెంకట సురేష్, శ్రీశైలం, జ్ఞానేశ్వర్, రామ్మూర్తి, విక్రమ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొమ్ము కృష్ణకు కార్పొరేటర్ శ్రీదేవి నివాళి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఈసీ నగర్‌కు చెందిన బీజేపీ నాయకులు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ మెంబర్ నర్సింగ్‌రావు సోదరుడు కొమ్ము కృష్ణ (60) పరమపదించారు. విషయం తెలుసుకున్న చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ మృతుడికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గ్లామ్ స్టూడియోస్ ఫ్యామిలీ సెలూన్ ప్రారంభం



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని శ్రీరాఘ వేంద్ర నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గ్లామ్ స్టూడియోస్ ఫ్యామిలీ సెలూన్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధితో ముందుకెళ్లి వ్యాపార సంస్థలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్లామ్ స్టూడియోస్ ఫ్యామిలీ సెలూన్ అధినేత వడ్డేపల్లి వీరేందర్ మరెన్నో షాపులు నెలకొల్పాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, సెలూన్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నంగి వెంకటేష్‌కు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-మేడ్చల్

నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిషర్స్‌కో ఆపరేటివ్ వెల్ఫేర్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన చిన్నంగి వెంకటేష్ ముదిరాజ్‌ను జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్, సాకర బోయిన వెంకటేష్ ముదిరాజ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు జిల్లా పరిధిలోని మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. కలిసిన వారిలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి, శంషాబాద్ జెడ్పీటీసీ చంద్రయ్య ముదిరాజ్, రాష్ట్ర ఆర్గనైజన్ సెక్రెటరీ పాండు ముదిరాజ్, సురేష్ ముదిరాజ్, ఆంజనేయులు, కృష్ణ ముదిరాజ్‌లు ఉన్నారు.

బీజేపీలో చేరిన కందుల శ్రీనివాస్



నవతెలంగాణ-శామీర్‌పేట

ప్రధాని మోడీ నాయకత్వంతోనే సుపరిపాలన సాధ్యమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ నాయకులు అల్లం శ్రీనివాస్ ఆధ్వర్యం లో అలియాబాద్ గ్రామ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ తన అనుచరులతో కలిసి ఆదివారం బీజేపీలో చేరారు. వారికి మల్కాజిగిరి ఎంపీ ఈటట రాజేందర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమం లో మండల అధ్యక్షుడు కైర యాదగిరి, తుమ్మ వివేకానంద్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు మహర్దశ

- సొంత భవనాలకు మోక్షం..!
- నూతన బిల్డింగ్ నిర్మాణానికి ప్రతిపాదనలు
- కార్పొరేట్ స్థాయిలో వసతులు
- సొంత భవనాలుంటే ఆధునీకరణ
- ఇప్పటికే నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూర్చి పెట్టడంలో రిజిస్ట్రేషన్ శాఖ ముందు వరుసలో ఉంటుంది. కానీ అలాంటి శాఖకు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో సొంత భవనాల్లేవు. అయితే త్వరలోనే ఆ శాఖకు మంచి రోజులు రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించాలనీ, అందుకోసం స్థలాలు సేకరించాలనీ, ఇప్పటికే సొంత భవనాలు ఉంటే వాటిని కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో కార్యాచరణ ప్రారంభమైంది.

అరకొర వసతులతో అద్దె భవనాల్లోనే..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉండగా.. వాటిలో నాలుగు మాత్రమే సొంత భవనాలు కలిగి ఉన్నాయి. మిగిలిన కార్యాలయాలన్నీ అరకొర సౌకర్యాల నడుమ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటి నిర్వహణకు ప్రతి నెలా రూ.4లక్షల వరకు అద్దె రూపంలో ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం అద్దె తక్కువగా ఇస్తుండటంతో అంతంత మాత్రంగానే ఉన్న భవనాల్లో కార్యాలయాలను ఏర్పాటు చేశారు. అద్దె భవనాల్లో కొనసాగే కార్యాలయాలకు వచ్చే క్రయవిక్రయదారులు, ప్రజలు నిల్చునేందుకు కూడా కొన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వసతుల్లేవు. ఇబ్బందులు ఎదురవుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో ఆయా భవనాల్లోనే రిజిస్ట్రేషన్ కార్యాలయాలను కొనసాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే స్థలాలు చూసినప్పటికీ భవన నిర్మాణాలకు అవసరమైన నిధులు లేకపోవడంతో ప్రక్రియ అక్కడే నిలిచిపోయింది.

అన్ని విధాలుగా అనువైన స్థలాల పరిశీలన

రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని ముఖ్యమంత్రి స్వయంగా నిర్ణయం తీసుకోవడంతో రెవెన్యూ అధికారులు అనువైన స్థలాలను పరిశీలించే పనిలో నిమగ్నమైనట్టు సమాచారం. ప్రధానంగా రియల్ ఎస్టేట్ వెంచర్లలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు సమాచారం. ఒకవేళ ఆయా స్థలాలు అందుబాటులో లేకుంటే ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేయనున్నారు. ఇందుకు సంబంధించి విధివిధానాలు ఇప్పటికే వెలువడినట్టు సమాచారం.

జిల్లాలో 12 కార్యాలయాలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. మేడ్చల్‌లో జిల్లా ప్రధాన కార్యాలయం ఉంది. మల్కాజిగిరి, ఘట్‌కేసర్, కీసర, వల్లభనగర్, శామీర్‌పేట, మేడ్చల్, కూకట్‌పల్లి, ఉప్పల్, బాలానగర్, నారపల్లి, కాప్రా, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో మల్కాజిగిరి, ఘట్‌కేసర్, కీసర, వల్లభనగర్‌లో మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగతా కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

జిల్లాపై స్పెషల్ ఫోకస్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాపై సర్కార్ సర్కార్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. సిటీకి ఆనుకుని ఉండటం, ఎక్కువగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జరగడం, ఎప్పటికప్పుడు పెద్ద పెద్ద వెంచర్లు ఏర్పాటవుతుండటంతో సర్కార్ జిల్లాలపై నజర్ పెట్టింది. జిల్లాలో ఉన్న 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునిక హంగులతో కార్పొరేట్ తరహాలు నిర్మించేందుకు ప్లాన్ చేసింది. స్థల పరిశీలన చేయాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు సైతం ఆదేశాలు అందాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం రెండో స్థానంలో ఉంది. జిల్లా నుంచి ప్రతి ఏడాదీ దాదాపు రూ.2,500 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఈ ఆదాయాన్ని మరింత పెంచాలని సర్కార్ భావించిన నేపథ్యంలో.. కార్పొరేట్ స్థాయిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించ తలపెట్టింది.

హైదరాబాద్ సీసీఎస్ ప్రక్షాళన

- 12 మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీ
- నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ
- ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేసిన ఏసీబీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హైదరాబాద్ సీసీఎస్ ప్రక్షాళనకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ పోలీసు విభాగానికి గుండెకాయ వంటి నగర నేర పరిశోధన అవినీతికి అడ్డాగా మారిపోవడంతో ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. సీసీఎస్‌లో పని చేసే 12 మంది ఇన్‌స్పెక్టర్లపై ఆదివారం బదిలీ వేటు పడింది. వీరిని ట్రాన్స్‌ఫర్ చేస్తూ నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీరు వెంటనే మల్టీజోన్ 2కు రిపోర్టు చేయాలని ఆదేశించారు. అవినీతి ఆరోపణలతో ఇప్పటికే ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ సుధాకర్‌లను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

సీసీఎస్‌పై ఏసీబీ నిఘా

సీసీఎస్ విభాగంపై ఏసీబీ నిఘా పెట్టింది. కొద్ది రోజుల క్రితం ఇక్కడ పని చేసే ఇద్దరు అధికారులు అవినీతికి పాల్పడ్డట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గత నెల 21వ తేదీన ఏసీపీ ఉమామహేశ్వర్‌రావును ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. తాజాగా గురువారం ఈవోడబ్ల్యూ టీమ్-7 ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రూ.3లక్షల లంచం తీసుకుంటూ రెడు హ్యాండెడ్‌గా పట్టుబడటంతో సీసీఎస్ అవినీతికి కేరాఫ్‌గా మారిపోయినట్టు తేలిపోయింది.ప్రతిష్టాత్మకమైన సీసీఎస్ విభాగం అప్రతిష్ట దిగజారుగుతున్నట్టు గ్రహించిన ఉన్నతాధికారులు ప్రక్షాళనకు రంగం సిద్ధం చేశారు.

సీసీఎస్ హైదరాబాద్‌కు గుండెకాయ..

ఈ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ హైదరాబాద్ నగరానికి గుండెకాయ వంటింది. సంచలనాత్మక నేరాలతోపాటు భారీ స్కాములను ఈ సీసీఎస్ అధికారులు దర్యాప్తు చేస్తుంటారు. రూ.25లక్షల కంటే ఎక్కువ మొత్తంతో ముడిపడి ఉన్న సొత్తు సంబంధిత నేరాలు, రూ.75 లక్షలకు మించిన మొత్తంతో కూడిన మోసాల కేసులు ఈ సీసీఎస్ పరిధిలోకి వస్తాయి. ఈ విభాగమే నేరుగా కొన్ని కేసులను సైతం నమోదు చేస్తుంది. నగరంలోని ఇతర పోలీస్ స్టేషన్లలో నమోదైన పలు కేసులను సైతం సిటీ పోలీసు కమిషనర్ దర్యాప్తు నిమిత్తం ఈ విభాగానికి బదిలీ చేస్తుంటారు. సీసీఎస్ దర్యాప్తు చేసే కేసుల్లో అత్యధికం రూ.కోట్లతో ముడిపడి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న విభాగంపై అవినీతి ఆరోపణలు రావడంతో పోలీస్ విభాగం అక్రమత్తమైంది.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



- గోధుమకుంట గ్రామ పంచాయతీ సెక్రటరీ సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కీసర

అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గోధుమకుంట గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్‌రెడ్డి అన్నారు. ప్రతీ ఆదివారం కీసర మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే జ్ఞానమాల కార్యక్రమం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 124వ వారం జ్ఞానమాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోధుమకుంట గ్రామ పంచాయతీ సెక్రటరీ సురేష్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. అంబేద్కర్ ప్రపంచంలోనే మహోన్నతమైన వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన రచించిన రాజ్యాంగంతోనే దేశంలో సంస్కరణలు జరుగు తున్నాయని తెలిపారు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించాలని ఆకాంక్షించా రు. ఈ కార్యక్రమంలో కీసర గోధుమకుంట ఎంపీటీసీ మంచాల ప్రవీణ్ కిరణ్ జ్యోతి, చినింగని ఆనంద్ రావు, మండల అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు పారునంది వేణు గోపాల్, కోశాధికారి శ్యామ్ కుమార్, సంయుక్త కార్యదర్శు లు నవీన్, కట్ట శంకరయ్య, గంగి సుధాకర్, కీసరగుట్ట ట్రస్ట్ బోర్డు మెంబర్ రాగుల రమేష్ ముదిరాజ్, జర్నలిస్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి గణేష్, పండుగ రాజలింగం, మాజీ ఎంపీటీసీ అంజనేయులు, మాజీ ఉపాధ్యక్షులు బంటు శ్రీనివాస్, ఎర్ర సాయిలు, రామరం రమేశ్, తుడుం బాలకృష్ణ పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్డు.. ఇబ్బందుల్లో ప్రజలు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని డబిల్‌పూర్ నుంచి నూతన్‌కల్ వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు మార్గంలో ఇస్కాన్ టెంపుల్ వద్ద ఏర్పడ్డ భారీ గుంత, కుంగిన రోడ్డుపై ఏర్పడిన రంధ్రంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రోడ్డు గుండా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నప్పటికీ అధికారులు మరమ్మత్తులు చేపట్టక పోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరుతున్నారు.

'ఎంఎస్ఆర్' ట్రస్ట్ సేవలు అభినందనీయం

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- పేద విద్యార్థులకు రూ.కోటి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-సిటీబ్యూరో

పేద విద్యార్థులకు ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వ్యాపార, సేవా రంగాల్లో కొనసాగుతున్న ఎంఎస్ఆర్.శివారెడ్డి ఇపుడు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు నగరంలోని సంస్థ కార్యాలయంలో స్పీకర్, ట్రస్ట్ నిర్వహకులు శివారెడ్డి, శిరీశారెడ్డి కలిసి 300 మంది పేద విద్యార్థులకు, వారి చదువు నిమిత్తం ఎంఎస్ఆర్ సహాయతా చెక్కులను అందించా రు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ నలుగురికి సహాయం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాము ఎంఎస్ఆర్. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంచిగా చదువుకునే విద్యార్థులుకు 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు వచ్చి.. వారి తల్లిదండ్రులకు స్తోమత లేని విద్యార్థులు ప్రతి ఏడాదీ 500 నుంచి 1000 మందికి రూ.10వేలు అర్హులైన విద్యార్థులకు అందజేస్తున్నట్టు తెలిపారు. దీంతోపాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్నవారికి ఉచిత వైద్యం, పేదల ఆకలి తీర్చడం, పేదలకు సాయమందించడమే ధ్యేయంగా తమ చారిటబుల్ ట్రస్ట్ పని చేస్తుందని తెలిపారు.

మన్నె రాజును కలిసిన ముదిరాజ్ సంఘం సభ్యులు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మన్నె రాజును మండలంలోని కోనాయిపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు ఆదివారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మన్నె రాజు మాట్లాడుతూ కోనాయిపల్లి గ్రామంలో ప్రస్తుతం ఉన్న సొసైటీతో పాటు ముదిరాజ్ బిడ్డలు తమ కాళ్లపై నిలబడడానికి మరో సొసైటీని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ పెద్దలు గుంటికుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ బిడ్డలు ఒకరిపై ఆధారపడ కుండా వారి కాళ్లపై వారు నిలబడేలా మత్స్య శాఖ సహకార సంఘం నుంచి పూర్తి సహకారం అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గుంటి దీపక్ ముదిరాజ్,గుంటి రమేష్ ముదిరాజ్,గుంటి కృష్ణ ముదిరాజ్, గుంటి సత్య నారాయణ ముదిరాజ్, గుంటి ఆంజనేయులు ముదిరాజ్, గుంటి భాస్కర్ ముదిరాజ్, జక్కుల యాదగిరి ముదిరాజ్, బోయిని కృష్ణ ముదిరాజ్, గుంటి చిన్న కుమార్ ముదిరాజ్, బొయిని శ్రీనివాస్ ముదిరాజ్ లు పాల్గొన్నారు.

ముత్తూట్ ఎగ్జిమ్ రెండో గోల్డ్ పాయింట్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

బంగారం, వెండి వ్యాపార రంగంలో ఒకటైన ముత్తూట్ పప్పచన్ గ్రూప్ అనుబంధ సంస్థ ముత్తూట్ ఎగ్జిమ్ (ప్రై) లిమిటెడ్ తెలంగాణలో రెండో గోల్డ్ పాయింట్ సెంటర్‌ను ప్రారంభించినట్టు వెల్లడించింది. ఇదీ దేశంలో 24వ గోల్డ్ పాయింట్ సెంటర్‌ను ఉప్పల్ మెయిన్ రోడ్డులోని ఓక్యులస్ కంటి దవాఖానా ఎదురుగా ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ముత్తూట్ ఎగ్జిమ్ సీఈఓ కేయూర్ షా మాట్లాడుతూ "కొన్నేండ్లుగా హైదరాబాద్ అద్భుతంగా అభివృద్ధి చెందింది. దేశంలోని ప్రముఖ మెట్రో నగరాల్లో ఒకటిగా కొనసాగుతోంది. మరిన్ని గోల్డ్ పాయింట్ సెంటర్లతో తెలంగాణలో మా ఉనికిని చాటుతున్నాం. మా వ్యాపార విస్తరణలో హైదరాబాద్ అత్యంత కీలకమైనది. రెండో శాఖను హైదరాబాద్‌లోని ప్రారంభించి మా కస్టమర్లకు మరింత చేరువయ్యాం. పారదర్శకమైన విధానంలో, బంగారాన్ని పరీక్షించి, ప్రత్యేకమైన, వ్యవస్థీకృత పారిశ్రామిక విధానంలో గోల్డ్ విక్రయాలను అందించాలనే ప్రయత్నంలో భాగంగా మా గోల్డ్ పాయింట్ల ద్వారా కృషి చేస్తున్నాం" అని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్ థామస్ ముత్తూట్ మాట్లాడుతూ "తెలంగాణలో బంగారు రీసైక్లింగ్ రంగంలో మార్కెట్ ఉనికిని పెంచడానికి మేం ప్రయత్నిస్తున్నాం. అందులో భాగంగానే హైదరాబాద్‌లో ముత్తూట్ ఎగ్జిమ్ ద్వారా వినియోగదారుల అవసరాలను తీర్చడానికి మా గోల్డ్ పాయింట్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నాం. అసాధారణమైన సేవలను అందిస్తూనే, రిటైల్ బంగారానికి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. తద్వారా దేశవ్యాప్తంగా ముత్తూట్ ఎగ్జిమ్ సేవలను విస్తరించాలనే ప్రణాళికలను అమలు చేస్తున్నాం" అన్నారు.

దొంగ పత్రాలతో ప్లాట్ కబ్జా

- ప్లాట్ ఓనరు ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన వైనం
- రవీందర్,దేవేందర్ లపై కేసు నమోదు చేసి రిమాండ్





నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ చెంగిచెర్ల పరిధిలోని రామకృష్ణ నగర్‌లో వెయ్యి గజాల స్థలానికి దొంగ పత్రాలు సృష్టించి విక్రయించిన ఘటన చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే చెంగిచెర్ల రామకృష్ణ నగర్‌లో ముళ్లపూడి వెంకటసుబ్బారావు జీపీఏ హోల్డర్‌కు సంబంధించిన వెయ్యి గజాల స్థలాన్ని మల్లాపూర్‌కు చెందిన లింగాల రవీందర్, చెంగిచెర్లకు చెందిన తీగల దేవేందర్ ఇద్దరు వ్యక్తులు ల్యాండ్ ఓనర్ అందుబాటులో లేకపోవడంతో అట్టి ప్లాట్లను ఎలాగైనా ఆక్రమించాలనే దురుదేశ్యంతో ఓనర్లు చనిపోయినట్లుగా ఫేక్‌డెత్ సర్టిఫికేట్‌లు క్రియేట్ చేసి, అట్టి ల్యాండ్ ఓనర్‌లకు గుర్తు తెలియని వ్యక్తులను లీగల్ హైర్ సర్టిఫికేట్‌లు సృష్టించి, అట్టి ల్యాండ్‌ను రవీందర్, దేవేందర్‌ల మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. బయటి వ్యక్తులకు తక్కువ రేట్‌కు ల్యాండ్ అమ్మి వచ్చిన డబ్బులను సమానంగా పంచుకొన్నారు. విషయం తెలుసుకున్న జీపీఏ హోల్డర్ ముళ్లపూడి వెంకట సుబ్బారావు మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు కబ్జా చేసింది నిజమేనని తేలడంతో పాటు ల్యాండ్ ఆక్రమించిన వ్యక్తులపై కీసర పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉండడంతో ఐపీసీ 304/2022 యూ సెక్షన్ 406, 468, 471, 476, 419, 420, 120బీ కింద కేసులు నమోదు చేసి కీసర పోలీసులు జైలుకు తరలించినట్టు మేడిపల్లి పోలీసులు తెలిపారు.

ఇవి తప్పనిసరి...



క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, హెల్తీ ఫుడ్ తినడం, తగిన విశ్రాంతి తీసుకోవడం, రిఫ్రెష్ అవ్వడానికి కొంత సమయం కేటాయిస్తే ఆరోగ్యం చాలా బాగుంది. అయితే ప్రతి మహిళ చేయించు కోవాల్సిన ఆరోగ్య పరీక్షలు కొన్ని ఉన్నాయి. ముందుగా ఈ ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం ద్వారా వ్యాధిని మొదట్లోనే నయం చేయవచ్చు. అందుకోసం ఏమేం పరీక్షలు చేయించుకోవాలంటే..?

కంప్లీట్ బ్లడ్ కౌంట్ (సిబిసీ) :

ఈ పరీక్ష ద్వారా ఎర్ర రక్త కణాలు, తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్‌లతో సహా రక్తంలోని వివిధ కణాలను కొలవడం ద్వారా మొత్తం ఆరోగ్యం గురించి సమాచారాన్ని తెలుస్తుంది. పరీక్షలో ఇచ్చిన స్థాయిలు రక్తహీనత, ఇన్ఫెక్షన్ లేదా రక్తం లోపం వంటి ఆరోగ్య సమస్యలను వెల్లడిస్తాయి.

లిపిడ్ ప్రొఫైల్..

గుండె సమస్యలు, స్ట్రోక్ ప్రమాదాన్ని అంచనా వేయడానికి మీ లిపిడ్ ప్రొఫైల్‌ను పర్యవేక్షించడం చాలా ముఖ్యం. ఈ పరీక్ష LDL (చెడు కొలెస్ట్రాల్), HDL (మంచి కొలెస్ట్రాల్) ట్రైగ్లిజరైడ్స్‌తో సహా కొలెస్ట్రాల్ స్థాయిలను కొలుస్తుంది. మహిళలు కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడం చాలా ముఖ్యం. ఎందుకంటే మహిళల్లో మరణానికి గుండె జబ్బులు ప్రధాన కారణమవుతున్నాయి.

థైరాయిడ్ ఫంక్షన్ టెస్ట్..

థైరాయిడ్ ఫంక్షన్ టెస్ట్ మీ థైరాయిడ్ గ్రంథి పనితీరును కొలుస్తుంది. ఇది జీవక్రియ, శక్తి స్థాయిలను నియంత్రించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ హార్మోన్ స్థాయిలలో అసమతుల్యత అలసట, బరువు మార్పు, మానసిక కల్లోలం వంటి లక్షణాలను కలిగిస్తుంది.

విటమిన్ "డి" స్థాయిలు..

ఎముకల ఆరోగ్యం, రోగనిరోధకతోపాటు, మొత్తం శరీరానికి విటమిన్ "డి" చాలా అవసరం. మహిళల్లో విటమిన్ డి లోపం ఉంటే.. అలసట, బలహీనత, ఎముకల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

రక్తంలో చక్కెర స్థాయిలు..

ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేసే మధుమేహ వ్యాధిని గుర్తించడానికి, నిర్వహించడానికి రక్తంలో చక్కెర స్థాయిని పరీక్షించడం చాలా అవసరం.


ఐరన్..

హిమోగ్లోబిన్ ఉత్పత్తికి ఐరన్ అవసరం. ఐరన్ లోపం వల్ల గర్భధారణ సమయంలో అలసట, బలహీనత, కండ్లు తిరగటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఐరన్ స్థాయిలను పరీక్షించడం వలన లోపాన్ని ముందుగానే గుర్తించి సమస్యలను నివారించవచ్చు. తద్వారా ఆరోగ్య కరమైన జీవితాన్ని గడపవచ్చు.









లేడీ జేమ్స్ బాండ్

విజయలలిత... నర్తకిగా తన సినీ జీవితాన్ని ప్రారంభించారు. తర్వాత కాలంలో తన క్షమశిక్షణ, అభినయం, పట్టుదలతో హీరోయిన్‌గా, ఓ నిర్మాతగా ఎదిగారు. లేడీ జేమ్స్ బాండ్‌గా ప్రేక్షకుల మదిలో నిలిచిపోయారు. యాక్షన్ క్వీన్ అనిపించుకున్న తొలితరం నటి ఈమె. భారతీయ చలన చిత్రసీమకు ఫియర్ లెస్ నాడియా ఎలాగో, తెలుగు తెరకు విజయలలిత అలాగే అంటూ ఆమెను అభిమానులు కీర్తించారు. నటిగా, నర్తకిగా, లేడీ జేమ్స్ బాండ్‌గా ప్రేక్షకుల హృదయాలు దోచిన ఆమె పుట్టినరోజు ఈరోజు...



విజయలలిత తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తిలో 1949, జూన్ 17నాడు జన్మించారు. ప్రముఖ సినీ తార విజయశాంతికి ఈమె చిన్నమ్మ. ఈమెకు ఒక అక్క, అన్న ఉన్నారు. చిన్నతనంలోనే నాట్యంలో శిక్షణ తీసుకొని మద్రాస్ వచ్చి అక్కడ నర్తకిగా తన జీవితాన్ని ప్రారంభించారు. విజయలలిత 1960 నుండి 1970 వరకు అనేక తెలుగు చిత్రాలలో నటించారు. 1966లో విడుదలైన భీమాంజనేయ యుద్ధంలో రంభ పాత్రలో ఆమె కనిపించారు. తొలి రోజుల్లో నర్తకిగా ఆమెకు అవకాశాలు వచ్చాయి. అయితే బి.విఠలాచార్య ఆమెలోని నటిని గుర్తించి తాను తెరకెక్కించిన అనేక జానపద చిత్రాలలో అవకాశం ఇచ్చారు. ఒక్క తెలుగు చిత్రాలలోనే కాదు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ చిత్రాలతో కలిపి దాదాపు 860 చిత్రాలలో ఆమె నటించారు. తమిళ, తెలుగు సినిమాలలో ఆమె 'లేడీ జేమ్స్ బాండ్'గా పేరు గాంచారు.

అద్భుత నర్తకిగా...

కృష్ణతో నటించిన 'చెలాకి రాణీ కిలాడి రాజా'లో తన చలాకీ తనంతో కథానాయకుడిని ప్రేమలోకి దింపి తన గురించి వివరాలు అతనికి తెలియకుండా షీలగా నటించిన విజయలలిత నటన ఆ రోజుల్లోనే కాదు ఇప్పటికీ ప్రేక్షకుల హృదయాల్లో ఉండిపోయింది. విఠలాచార్య దర్శకత్వంలో వెలువడిన 'అగ్గివీరుడు' జానపద చిత్రంలో నటరత్న ఎన్టీఆర్‌తో పోటీ పడి నటించారు. అలాగే 'చిక్కడు - దొరకడు', 'కదలడు-వదలడు' చిత్రాలలో చిందేసి కనువిందు చేసిన ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఏ.ఎస్.ఆర్ చిత్రాలలోనూ ఆమె నృత్యంతో ప్రేక్షకులకు నయనానందం కలిగించారు. సినిమాల్లో నటిగానే కాక ఒక నర్తకిగా కూడా తన నాట్యంతో ఆమె ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయారు.

తీవ్ర పోటీని ఎదుర్కొన్నారు

ఎల్.విజయలక్ష్మి, గీతాంజలి, వెన్నిరాడై నిర్మల వంటి ఇతర నర్తకీమణులతో తీవ్ర పోటీని ఎదుర్కొన్నారు. ఎల్.విజయలక్ష్మి వివాహం తర్వాత అమెరికా వెళ్లిపోయినప్పుడు విజయలలిత రంగ ప్రవేశం చేశారు. భీమంజనేయ యుద్ధం కోసం సినీ పరిశ్రమ విజయలలితను బుక్ చేసింది. అయితే ఆ సినిమా రెండు రోజులు మాత్రమే నడిచినప్పటికి, ఆమె నటనకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. ఆశ్చర్యకరంగా పరిశ్రమ ఆమెకు అనేక చిత్రాలలో అనేక పాత్రలు ఇచ్చింది. అక్కడి నుండి ఆమె తన స్థాయిని పెంచుకుంటూ వచ్చారు. పదేండ్ల వ్యవధిలో అనేక విజయవంత చిత్రాలలో నటించారు. పగసాధిస్తా సినిమాలో 'నే ముద్దా డనా' పాటలో క్లబ్ డాన్సర్‌గా ఉర్రుతలూగించిన ఘనత ఆమెకే దక్కింది. ఆమెను సాంప్రదాయ నాట్యాలలో చూసిన ప్రేక్షకులు, ఓ క్లబ్ డాన్సర్‌గా కూడా ఆదరించారు. అంతటి అద్భుత నాట్యం ఆమెది.

లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ మూవీస్

ఆమె అనేక మహిళా ప్రాధాన్యంగల చిత్రాలలో కూడా నటించారు. 'రౌడీ రాణి, రివాల్వర్ రాణి' వంటి చిత్రాలలో నటించి భలేగా అలరించారు. యన్టీఆర్ 200వ చిత్రంగా విడుదలైన 'కోడలు దిద్దిన కాపురం' చిత్రంతో పాటు విడుదలైన 'రౌడీ రాణి' సైతం జనాన్ని ఎంతగానో ఆకట్టుకుంది. తెలుగులో తొలి సినిమా స్కోప్‌గా తెరకెక్కిన బ్లాక్ అండ్ వైట్ మూవీ 'ఒకనారి వంద తుపాకులు'లోనూ ఈమే కథానాయిక. తెలుగునాట ఆమెకున్న ఆదరణ చూసి హిందీలోనూ కొందరు విజయలలితతో చిత్రాలు నిర్మించారు. కె.ఎస్.ఆర్.దాస్ దర్శకత్వంలో ఆమె నాయికగా 'రాణి మేర నామ్' అనే హిందీ చిత్రం తెరకెక్కించారు. అక్కడ కూడా తన అభినయంతో ప్రేక్షకుల మనసు దోచుకున్నారు. ఈ చిత్రంతోనే ఆమెను ప్రేక్షకులు ఫియర్ లెస్ నాడియాగా కొనియాడారు. అలాగే దక్షిణాదినే కాదు ఉత్తరాదిన తన నటనతో గుర్తింపు తెచ్చుకున్నారు. సింధూరపువ్వులో లేడీ విలన్‌గా, సాహసవీరుడు సాగరకన్యలో మాంత్రికురాలిగా ఆమె నటన ఎవ్వరూ మర్చిపోలేరు.

> **విజయలలిత 1960 నుండి 1970 వరకు అనేక తెలుగు చిత్రాలలో నటించారు. 1966లో విడుదలైన భీమాంజనేయ యుద్ధంలో రంభ పాత్రలో ఆమె కనిపించారు. తొలి రోజుల్లో నర్తకిగా ఆమెకు అవకాశాలు వచ్చాయి. అయితే బి.విఠలాచార్య ఆమెలోని నటిని గుర్తించి తాను తెరకెక్కించిన అనేక జానపద చిత్రాలలో అవకాశం ఇచ్చారు.**

క్రమశిక్షణకు మారుపేరు

అప్పట్లో విజయ లలిత అంటే సమయ పాలనకు పెట్టింది పేరుగా ఉండేది. షూటింగ్ జరిగే సమయానికి అరగంట ముందే వచ్చేవారు. ఉదయం 7గంటలకు తన కాల్ షీట్ అంతే 6 గంటలకే మేకప్ వేయించుకొని వచ్చేసేవారు. స్టూడియోకి వచ్చి తాళం తీయకపోయినా అక్కడే కూర్చునేవారు. ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదు అనేది ఆమె నైజం. ఈ క్రమశిక్షణ వల్లనే ఈమెకు అనేక సినిమాల్లో నటించే అవకాశం వచ్చింది. ఎన్ని చిత్రాలలో నటించినా ప్రేక్షకుల మదిలో మాత్రం ఓ నర్తకిగా, రౌడి రాణిగా నిలిచిపోయారు.

- పాలపర్తి సంధ్యారాణి

మెదక్ ఘర్షణలపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి : తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మెదక్ ఘర్షణల పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. మెదక్ పట్టణంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు బీజేవైఎమ్, భజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తలు విధ్వంసం సృష్టించారనీ, పోలీసు ఉన్నతాధికారులు నిర్వహించిన మీడియా సమావేశంలో వీరి ప్రమేయమున్నట్టుగా పేర్కొనడం గమనార్హమని పేర్కొన్నారు. ప్రజల మధ్య భావోద్వేగాలు రెచ్చగొట్టి, వైషమ్యాలు సృష్టించి తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం ఏమాత్రం తగదని హెచ్చరించారు. సమస్యను సృష్టించిన బీజేపీ నాయకులే జిల్లా బంద్‌కు పిలుపునివ్వటం వారి ఎత్తుగడలను స్పష్టం చేస్తున్నదని తెలిపారు. ఘర్షణకు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలనీ, ప్రజలు సామరస్యం, సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.

అది మూడు గోపురాల నిర్మాణమట !

బాబ్రీ మసీదు పేరే ఎత్తని ఎన్సీఈఆర్టీ



న్యూఢిల్లీ : బాబ్రీ మసీదు పేరునే తలవడానికి ఎన్సీఈఆర్టీ ఇష్టపడడం లేదు. జాతీయ విద్యా పరిశోధనా మండలి (ఎన్సీఈఆర్టీ) తన 12వ తరగతి రాజకీయ శాస్త్రం పాఠ్య పుస్తకంలో అయోధ్యలోని బాబ్రీ మసీదు పేరును ప్రస్తావించకుండా దానిని 'మూడు గోపురాల నిర్మాణం'గా చెప్పుకొచ్చింది. దీనిని 16వ శతాబ్దిలో మొఘల్ చక్రవర్తి బాబర్ వద్ద జనరల్‌గా పనిచేసిన మిర్ బాఖీ రామమందిరాన్ని కూల్చి నిర్మించాడని తెలిపింది. 'ఈ నిర్మాణంలో హిందూ చిహ్నాలు స్పష్టంగా కన్పించాయి. నిర్మాణం లోపల, బయట కూడా కొన్ని హిందూ కట్టడాలకు చెందిన అవశేషాలు ఉన్నాయి' అని వివరించింది.

16వ శతాబ్దం నాటి బాబ్రీ మసీదును మిర్ బాఖీ నిర్మించాడని పాత పాఠ్య పుస్తకంలో తెలియజేశారు. ఎన్సీఈఆర్టీ కొత్త పాఠ్య పుస్తకంలో అయోధ్య పాఠ్యాంశానికి కేవలం రెండు పేజీలు మాత్రమే కేటాయించారు. గతంలో నాలుగు పేజీల పాఠ్యాంశం ఉండేది. ఫైజాబాద్ జిల్లా కోర్టు ఆదేశాల మేరకు 1986 ఫిబ్రవరిలో బాబ్రీ మసీదు తాళాలు తెరిచారని, ఆ తర్వాత ఇరు పక్షాలు అక్కడ మోహరించాయని పాత పుస్తకంలో ఉంది. అయోధ్యలో జరుగుతున్న పరిణామాలపై బీజేపీ విచారం వ్యక్తం చేసిందని అందులో చెప్పారు. అయోధ్య వివాదం లౌకికవాదంపై చర్చకు దారితీసిందని కూడా తెలిపారు.

కొత్త పుస్తకంలో మాత్రం ఇవేవీ లేవు. 'నిర్మాణం తలుపులు తెరవాలని, ప్రార్థనలు చేసుకునేందుకు ప్రజలను అనుమతించాలని ఫైజాబాద్ (ఇప్పుడు అయోధ్య) జిల్లా కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో 1986లో మూడు గోపురాల నిర్మాణానికి సంబంధించిన పరిస్థితిలో గణనీయమైన మార్పు వచ్చింది. ఈ వివాదం అనేక దశాబ్దాల పాటు కొనసాగింది. దేవాలయాన్ని కూలదోసి శ్రీరామ జన్మస్థలిలో మూడు గోపురాల నిర్మాణం జరిపారని ప్రజలు విశ్వసించడంతో వివాదం మొదలైంది' అని మాత్రమే కొత్త పాఠ్య పుస్తకంలో రాశారు. శ్రీరాముడి జన్మస్థలిని విస్మరించారని హిందువులు ఆందోళన వ్యక్తం చేశారని, నిర్మాణాన్ని తమ అధీనంలోనే ఉంచేలా హామీ ఇవ్వాలని ముస్లింలు కోరారని కొత్త పుస్తకంలో తెలియజేశారు. వార్తా పత్రికల్లో వచ్చిన కథనాల క్లిప్పింగులను కూడా పాత పాఠ్య పుస్తకంలో చేర్చారు. 'బాబ్రీ మసీదు కూల్చివేత : కల్యాణ్ ప్రభుత్వానికి కేంద్రం ఉద్వాసన' అనే శీర్షికతో వచ్చిన ఓ వార్తను ప్రదర్శించారు. 'బీజేపీ తప్పుడు అంచనాలు ఘోరం' అంటూ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చేసిన వ్యాఖ్యను ఉటంకిస్తూ మరో పత్రిక పెట్టిన శీర్షికను కూడా పాత పుస్తకంలో చూపారు. కొత్త పుస్తకంలో మాత్రం అలాంటి క్లిప్పింగులేవీ కన్పించలేదు.

నీట్ లీకేజీ పెద్ద స్కామ్

(మొదటిపేజి తరువాయి)

ముఖ్యతిథిగా విచ్చేసిన సాను మాట్లాడారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)లోని కొందరు అధికారుల వల్ల పరీక్షకు ముందే పేపర్ బయటకొచ్చిందనీ, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లీకేజీ జరిగినట్టు స్పష్టమైన ఆధారాలు బయట పడుతున్నాయని తెలిపారు. గుజరాత్‌కు చెందిన ఓ విద్యార్థి కేవలం 35 శాతం మార్కులతో ఇంటర్ పాస్ కాగా, నీట్‌లో 720 గానూ 705 మార్కులు రావడం అతనికి ఎలా సాధ్యం? నెగెటివ్ స్కోరింగ్ విధానం ఉన్న పరీక్షలో 719, 718 మార్కులు ఎలా వస్తాయి? హర్యానాలోని ఒకే సెంటర్ నుంచి 80 మందికి ర్యాంకులు రావడమేంటి? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అలాంటి వారు ఎయిమ్స్ లాంటి ప్రతిష్టాత్మక వైద్యవిద్యా సంస్థల్లో చదువు'కొని' ఎంబీబీఎస్ డాక్టర్లై ప్రజలకు ఏం వైద్యమందిస్తారని మోడీ సర్కార్‌ను నిలదీశారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు పరీక్షలోనూ పెద్ద ఎత్తున పోస్టులను అమ్ముకున్నారని విమర్శించారు. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు విద్యా, వైద్య వ్యవస్థలతో పాటు అన్నింటినీ విధ్వంసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యావిధానం ద్వారా జాతీయ వ్యతిరేక విధానాలను విద్యార్థుల్లోకి జొప్పించే యత్నం జరుగుతున్నదని విమర్శించారు. ప్రపంచ వ్యాప్తంగానూ 2024కు ప్రత్యేకత ఉందనీ, ఈ ఏడాది 64 దేశాల్లో ఎన్నికలు జరిగాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా రైట్ వింగ్‌కు ఎక్కువ సానుకూల ఫలితాలు వచ్చాయనీ, కార్పొరేట్ల చేతుల్లో ప్రపంచం ఉండటమే దీనికి కారణమని వివరించారు. లెఫ్ట్ వింగ్ పెరగటం కార్పొరేట్లకు అస్సలు గిట్టదన్నారు. ఇండియాతో పాటు ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ మెజార్టీ మీడియా కొంత మంది బడా కార్పొరేట్ల చేతుల్లో బందీగా ఉందని చెబుతూ ఆయా దేశాల



గణాంకాలను వివరించారు. కార్పొరేట్ మీడియా రైట్ వింగ్‌కు ఎంత సపోర్టు చేస్తున్నప్పటికీ ప్రజల పక్షాన పోరాడుతున్న లెఫ్ట్ వింగ్‌కు క్రమంగా ఆదరణ పెరుగుతున్న తీరును వివరించారు. ప్రపంచవ్యాప్తంగా పాలస్తీనీయన్ల పోరాటానికి మద్దతు పెరుగుతున్నదన్నారు. బ్రిటన్, అమెరికాతో పాటు మనదేశంలోనూ పెద్దఎత్తున విద్యార్థులు, ప్రజలు రోడ్ల మీదికి వస్తున్నారని చెప్పారు. అమెరికా ఆధిపత్యం కోసం ప్రచ్ఛన్న యుద్ధాలను సృష్టిస్తున్నదని విమర్శించారు. అయితే, దీన్ని తిప్పికొట్టడానికి అనుసరించే భావజాలమే కీలకమనీ, అమెరికా దాడిని తిప్పికొట్టడానికి అది దోహదపడు తుందని వివరించారు. ఇరాక్‌కు ఒక ఐడియాలజీ లేదు కాబట్టే అమెరికా దానిపై సులువుగా విజయం సాధించిందని చెప్పారు. మోడీ గ్యారంటీ, రామమందిరం గెలిపిస్తాయని ముందుకెళ్లిన ఎన్డీయేకు ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. అయోధ్య రామాలయంతో పాటు ప్రముఖ దేవస్థానాలున్న నియోజకవర్గాల్లోనూ బీజేపీకి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. మోడీ భగవాన్‌కే భగవాన్ అన్న ప్రచారం బెడిసికొట్టిందనీ, దీనిపై ఆర్ఎస్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసిందని చెప్పారు. చివరకు టీడీపీ, జేడీయూ మద్దతుతో మోడీ తన సర్కారును నడపాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సీఎస్‌డీఎస్ సర్వేలో దేశంలోని 78 శాతం ప్రజలు హిందూత్వను వ్యతిరేకించారనీ, వారంతా దేశంలో సెక్యులరిజం ఉండాలని కోరుకున్నారని వివరించారు.

దేశంలోని కార్పొరేట్లకు ఏడాది పాటు పదిశాతం ట్యాక్స్ విధిస్తే పేదలందరికీ కిలోకు రూ.3 చొప్పున బియ్యం ఇచ్చే అవకాశముందనీ, ఆ దిశగా మోడీ సర్కారు ఆలోచించాలని సూచించారు. 400 సీట్లు వస్తే రాజ్యాంగం మార్చాలని బీజేపీ చూసిందన్నారు. రాజ్యాంగం మారుస్తామన్న మోడీతోనే రాజ్యాంగం గొప్పదని గుండెలకు అతుక్కునేలా చేయడం ప్రజాస్వామ్యం గొప్పతనమన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో నిరుద్యోగం, ఉపాధి, పేదరికం, నిత్యావసరాల సరుకుల ధరలు తదితరాలు కీలక పాత్ర పోషించాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.వీరభద్రం, సంయుక్త కార్యదర్శులు మమత, కిరణ్, ఉపాధ్యక్షులు రజినీకాంత్, అశోక్‌రెడ్డి, బి.శంకర్, ప్రశాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో నీటి యుద్ధం

(మొదటిపేజి తరువాయి)

మారింది. పలువురు బీజేపీ కార్యకర్తలు జల్‌బోర్డు కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. చత్తార్‌పూర్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో ఆ పార్టీ కార్యకర్తలు జల్ బోర్డు కార్యాలయం వద్ద నిరసనలకు దిగారు. అయితే ఈ ఘటనపై బీజేపీ నేత రమేష్ బిధూరి స్పందించారు. ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంటే ఏమైనా చేయగలరని మరింత రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు.

కేంద్రం జోక్యం చేసుకోవాలి

ఢిల్లీలో నీటి సంక్షోభ పరిస్థితి మెరుగుదలకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఢిల్లీ మంత్రి అతిషి కోరారు. హర్యానాలోని తమ ప్రభుత్వంతో బీజేపీ చర్చించి ఢిల్లీ ఎక్కువ నీరు పొందేలా చూడాలని అన్నారు. ఢిల్లీలోని ప్రధాన పైప్‌లైన్లకు భద్రత కల్పించేందుకు పోలీస్ సిబ్బందిని నియమించాలని కోరుతూ ఆదివారం ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరాకు మంత్రి లేఖ రాశారు. సోనియా విహార్ నుండి దక్షిణ ఢిల్లీ ప్రధాన పైప్‌లైన్‌లో లీకేజీ ఏర్పడిందని తెలిపారు. దక్షిణ ఢిల్లీ మొత్తానికి నీరందించే ఈ పైప్‌లైన్ లీకేజీ వెనుక ఏదో కుట్ర ఉన్నట్లు ఆ లేఖలో పేర్కొన్నట్లు చెప్పారు. అయితే ఇది ఆరోపణలు, ప్రత్యారోపణలు, నీచరాజకీయాలకు సమయం కాదని అన్నారు. ఈ పరిస్థితిలో కేంద్రం జోక్యం చేసుకోకపోతే పరిస్థితి మరింత తీవ్రమవుతుందని అన్నారు. తమ నీటి నిర్వహణ బృందం ఆరు గంటల పాటు శ్రమించి పైప్‌లైన్ లీకేజీని సరిచేసిందని ఈ సమయంలో ఆరు గంటల పాటు నీటి సరఫరాను నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపారు. దీంతో దక్షిణ ఢిల్లీలో 25 శాతం నీటి కొరత ఏర్పడిందన్నారు. ఈ సమయంలో 20 ఎంజీడీ నీటిని సరఫరా చేయకపోవడంతో మరో 25 శాతం నీటి కొరత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అతిషి మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ఢిల్లీలో తీవ్రమైన వేడిగాల్పులు వీస్తున్నాయని, నీటి కొరత ఏర్పడిందని అన్నారు.

ఈ క్రమంలో నీటి పైప్‌లైన్లను పగులగొట్టి కొరతను మరింత తీవ్రతరం చేసేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని తెలుస్తోందన్నారు. దక్షిణ ఢిల్లీలోని సరఫరా పైప్‌లైన్‌లో శనివారం భారీ లీకేజీ ఏర్పడిందని, ఈ విషయం తెలుసుకున్న తమ బృందం మరమ్మతుల కోసం ఓ టీమ్‌ని పంపగా, చాలా పెద్ద బోల్టులు కోసి ఉన్నట్లుగా గుర్తించారని అన్నారు. మంత్రి సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ కొద్దిరోజులుగా ఢిల్లీలో లీకేజీలు ఉన్నాయంటూ కొందరు నిర్దిష్ట వ్యక్తులు పలు వీడియోలను వైరల్ చేశారన్నారు. లీకేజీ సహజమని తాను అనుకోనని, కొందరు కావాలని లీకేజీలకు కారణమవుతున్నారని తెలిపారు. శనివారం దక్షిణ ఢిల్లీలో పైపులు కట్టే నట్‌లు, బోల్ట్‌లు కోసి కనిపించాయన్నారు. వాటిని ఎవరో కట్ చేశారని, దాంతో దక్షిణ ఢిల్లీలో నీటి కరువు ఏర్పడిందన్నారు.

మత్తులో యువత చిత్తు

(మొదటిపేజి తరువాయి)

ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించిన నేపథ్యంలో ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారులను సైతం నియమించారు. టీఎస్ న్యాబ్‌లో ఖాళీల భర్తీకి కూడా సీఎం చర్యలు తీసుకున్నారు. కానీ గంజాయి వ్యాప్తి మాత్రం తగ్గటం లేదు. తద్వారా తలెత్తే దుష్పరిణామాలూ తగ్గట్లేదు.

గ్రామగ్రామానికీ గంజాయి వ్యాప్తి..

ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన గంజాయి సేవనం ఇప్పుడు ఊరూరా పాకింది. ముఖ్యంగా కరోనా దగ్గర నుంచి దీని వ్యాప్తి అధికమైంది. చాలా ప్రాంతాల్లో, గ్రామాల్లో సైతం గంజాయి లభిస్తోంది. గంజాయి లభించని చోట డ్రగ్స్, హెరాయిన్, వైట్నర్ వంటివి కూడా తీసుకుంటున్నారు. ఖమ్మం లాంటి నగరాల్లోని శివారు ప్రాంతాల్లో యువత ఎక్కువగా గంజాయి సేవిస్తోంది. ఖమ్మం శివారులోని గొల్లగూడెం, రామన్నపేట ఇటుకబట్టీలు, ఇటు అల్లీపురం, బోనకల్ రోడ్డుల్లో గంజాయిని విచ్చలవిడిగా యువత సేవిస్తున్నారు. దాదాపు రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి నెలకొన్నది. యువత బానిసలుగా మారుతోంది. మత్తులో వేగంగా బైక్‌లు నడుపుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు పేదల పిల్లలే ఎక్కువగా గంజాయికి బానిసయ్యేవారు. ఇప్పుడు వారికన్నా ఎక్కువ అప్పర్ మిడిల్ క్లాస్ యువత బానిసలవుతున్నట్టుగా తెలుస్తోంది. చదువుల్లో మెరిట్‌గా ఉన్న అనేక మంది పిల్లలు డ్రగ్స్‌కు బానిసలై తల్లిదండ్రులను తీరని వేదనకు లోను చేస్తున్న ఉదంతాలు అనేకం వెలుగు చూస్తున్నాయి. నగరాలు, పట్టణాలు, గ్రామాలు, గిరిజన తండాలు, పలు కాలనీల్లో అనేక చోట్ల గంజాయి మత్తులో యువత పరస్పరం దాడులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ గంజాయి నియంత్రణపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది.

2018 నుంచి ఖమ్మం జిల్లాలో నమోదైన గంజాయి కేసులు...

- 2018లో 10 గంజాయి కేసులు నమోదు కాగా 32 మందిని అరెస్టు చేశారు. రూ.90 లక్షల విలువైన 135 కిలోల గంజాయి పట్టుబడింది.
- 2019లో 25 కేసులు నమోదు కాగా 75 మందిని అరెస్టు చేశారు. రూ.1.99 కోట్ల విలువైన 1,741 కిలోల గంజాయిని పట్టుకున్నారు.
- 2020లో 27 కేసులు నమోదు చేశారు. 63 మంది అరెస్టు కాగా రూ.76 లక్షల విలువైన 980 కేజీల గంజాయిని పట్టుకున్నారు.
- కరోనా లాక్‌డౌన్ ఎక్కువకాలం ఉన్న తర్వాత 2021లో 41 కేసులు నమోదు చేశారు. 134 మందిని అరెస్టు చేయగా రూ.5.19 కోట్ల విలువైన 3,540 కేజీల గంజాయి పట్టుబడింది.
- 2022లోనూ 41 కేసులు నమోదయ్యాయి. 107 మందిని అరెస్టు చేశారు. రూ.64 లక్షల విలువైన 491 కేజీల గంజాయిని పట్టుకున్నారు.
- 2023లో రూ.1.29 కోట్ల విలువైన 872 కేజీల గంజాయిని పట్టుకున్నారు. 41 కేసులు నమోదు చేసి 68 మందిని అరెస్టు చేశారు.
- ఈ ఏడాది ఇప్పటికే 17 కేసులు నమోదు కాగా 67 మంది అరెస్టు అయ్యారు. రూ.37 లక్షల విలువైన 78 కేజీల గంజాయిని పట్టుకున్నారు.

గంగానదిలో పడవ మునిగి ఆరుగురు గల్లంతు

పాట్నా: పాట్నాలోని ఉమానాథ్ గంగా ఘాట్ సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న పడవ గంగానదిలో మునిగిపోయింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు గల్లంతయ్యారు. కాగా ప్రమాదం జరిగిన పడవలో దాదాపు ఒకే కుటుంబానికి చెందిన 17 మంది ప్రయాణిస్తున్నారని బార్హ్ సబ్-డివిజనల్ అధికారి తెలిపారు. వీరిలో 11 మందిని స్థానికులు ప్రాణాలతో రక్షించారని, ఆరుగురి జాడ తెలియలేదని చెప్పారు. ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్ రంగంలోకి దిగి గల్లంతైన వారి జాడ కోసం వెతుకుతోందని తెలిపారు.





ఫాసిస్టు శక్తులపై పిడికిలెత్తిన ఫ్రెంచ్ ప్రజానీకం

పారిస్‌లో రెండున్నర లక్షలమందితో కవాతు

- దేశవ్యాప్తంగా 182 చోట్ల ర్యాలీలు
- ఆరు లక్షల మందికిపైగా హాజరు
- ఏకతాటిపై నిలిచిన వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, పౌర సమాజం

పారిస్: ఫ్రాన్స్ రిపబ్లిక్‌కే సవాల్‌గా మారిన పచ్చి మితవాద, జాత్యహంకార శక్తులకు వ్యతిరేకంగా ప్రజలు పెద్దయెత్తున ఉద్యమించారు. రాజధాని పారిస్‌తో సహా దేశ వ్యాప్తంగా శనివారం జరిగిన ర్యాలీల్లో 6,40,000 మంది పాల్గొన్నారు. ఒక్క పారిస్‌లోనే రెండున్నర లక్షల మంది పాల్గొనడం విశేషం. సిజిటి, సిఎఫ్‌డిటి, యుఎన్ఎస్ఎ, ఎఫ్ఎస్‌యు, యుఎన్ఇఎఫ్ వంటి ప్రధాన కార్మిక సంఘాలు, ఎస్ఒఎస్, ఎల్‌డిహెచ్ వంటి అసోసియేషన్లు ఇచ్చిన పిలుపునకు అన్ని సెక్షన్ల ప్రజానీకం నుంచి అద్భుతమైన స్పందన లభించింది. పిల్లలు, పెద్దలు, యువకులు, కుటుంబాలకు కుటుంబాలే కదలి వచ్చాయి. వర్షం, దుమ్ము ధూళి వంటి అననుకూల వాతావరణాన్ని సైతం లెక్క చేయకుండా పెద్ద యెత్తున జనం తరలిరావడం వారిలో చైతన్యానికి దర్పణం పడుతోంది. ర్యాలీలు చాలా వరకు శాంతియుతంగానే జరిగాయి. కొన్ని చోట్ల దుండగుల గుంపు అల్లర్లు సృష్టించడానికి యత్నించినప్పుడు ఘర్షణలు, అరెస్టులు చోటుచేసుకున్నాయి. రెండోరోజు ఆదివారం కూడా ప్రదర్శనలు కొనసాగాయి. పారిస్‌లో జరిగిన ర్యాలీలో పాల్గొనేందుకు తాను 600 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వచ్చానని బెల్‌ఫోర్డ్‌కు చెందిన ఫరీద్ అనే డ్రైవర్ చెప్పాడు. న్యూ పాపులర్ ఫ్రంట్ గెలవాలంటే మనమందరం కలసి ఉండాల్సిన అవసరముందని ఆ డ్రైవర్ అభిప్రాయ పడ్డాడు. ఈ నిరసనలకు వామపక్ష పార్టీలు, సోషలిస్టులు, పౌర సమాజం వీరికి పూర్తి మద్దతు ప్రకటించాయి. ఈనెల 30, వచ్చే నెల 7న రెండు విడతలుగా జరిగే ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికల్లో మేరీ లీపెన్స్ నేతృత్వంలోని నేషనల్ ర్యాలీ, రీకాంక్వెస్ట్ వంటి జాతి దురహంకార, పచ్చి మితవాద పార్టీలు విజయం సాధించే అవకాశముందని కొన్ని సర్వేలు సంకేతాలిస్తున్న నేపథ్యంలో ప్రజలు వెల్లువలా వచ్చి ఈ నిరసన ర్యాలీల్లో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. "భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ మేమందరం ఏకతాటిపైకి రావడం మేము సాధించిన మొదటి విజయం" అని ఎస్ఒఎస్ రెసిసమ్ కార్యకర్త, అయిదో సంవత్సర లా విద్యార్థి ప్రియయనవాల్టి పేర్కొన్నారు. ఆక్స్‌ఫామ్ ఫ్రాన్స్ అనే ఎన్‌జివో సంస్థ జనరల్ డైరెక్టర్ సెసిల్ డప్లో మాట్లాడుతూ, "ప్రమాదం చాలా పెద్దది. మితవాదులకు వ్యతిరేకంగా వామపక్ష శక్తులు శాయశక్తులా పోరాడాల్సిన అవసరముంది" అని అన్నారు.

వామపక్షాలు, సోషలిస్టులు, అందరూ కలసి ఈసారి న్యూ పాపులర్ ఫ్రంట్ పేరుతో ఒక కూటమిగా ఏర్పడ్డారు. గత వారం జరిగిన ఇయు పార్లమెంటు ఎన్నికల్లో పచ్చి మితవాది మేరీ లీపెన్ పార్టీ 30శాతం ఓట్లు తెచ్చుకుని బలమైన శక్తిగా అవతరించింది. మాక్రాన్ నేతృత్వంలోని రినైజాన్స్ పార్టీ కన్నా రెండు రెట్లు అధికంగా ఓట్లు పెంచుకుంది. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో గనక మితవాదులు గెలిస్తే రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఫ్రాన్స్‌లో అధికారం చేజిక్కించుకున్న తొలి పచ్చి మితవాద ప్రభుత్వంగా అది రికార్డుకెక్కుతుంది. ఇప్పటికే దేశంలో జాతి విద్వేషాలను రెచ్చగొడుతూ, రిపబ్లిక్ మౌలిక స్ఫూర్తినే దెబ్బతీసేలా మితవాద పార్టీలు వ్యవహరిస్తున్నాయి.

గాజాలో భారీ పేలుడు

- ఎనిమిది మంది ఇజ్రాయిల్ సైనికులు మృతి

ఇజ్రాయిల్ : ఇజ్రాయిల్, హమాస్ మధ్య యుద్ధం కొనసాగుతోన్న వేళ దక్షిణ గాజాలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది ఇజ్రాయిల్ సైనికులు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. దక్షిణ గాజాలోని రఫా నగరానికి సమీపంలో ఇజ్రాయిల్ సైనికులు ప్రయాణిస్తున్న నేమర్ వాహనం పేలటంతో ఈ ఘటన జరిగినట్లు ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. ఈ ఘటనలో వాహనం పూర్తిగా దగ్ధమైంది. అదే విధంగా మతదేహాలను గుర్తించటంలో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఇజ్రాయిల్ సైనిక అధికారులు తెలిపారు. ఈ పేలుడు ఎవరు జరిపారనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. అయితే ఆ ప్రాంతంలో పేలుడు పరికరం అమర్చారా ? లేదా యాంటీ ట్యాంక్ మిసైల్‌ను నేరుగా ప్రయోగించారా ? అని ఇజ్రాయిల్ సైన్యం అధికార ప్రతినిధి డేనియల్



హగారి అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ పేలుడులో ఎనిమిది మంది సైనికులు మతి చెందటం భారీ నష్టమని తెలిపారు. ఇప్పటివరకు 306 మంది ఇజ్రాయిల్ సైనికులు మతి చెందారని వెల్లడించారు. మృతి చెందిన సైనికులకు ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నివాళులర్పించారు. తమకు భారీ నష్టం జరిగినా యుద్ధ లక్ష్యాలకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

బహుళ ధ్రువ ప్రపంచంలో బ్రిక్స్ కీలక పాత్ర :పుతిన్

మాస్కో: బహుళ ధ్రువ ప్రపంచంలో కీలకమైన నియంత్రణ సంస్థగా 'బ్రిక్స్' నిలుస్తుందని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ చెప్పారు. భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, సౌతాఫ్రికాతో కూడిన ఈ కూటమికి రష్యా ప్రస్తుతం అధ్యక్షత వహిస్తున్నది. రష్యన్ విదేశాంగ మంత్రిత్వశాఖ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పుతిన్ మాట్లాడుతూ బ్రిక్స్ ఇప్పుడు ప్రపంచ దృష్టిని విశేషంగా ఆకర్షిస్తోందని అన్నారు. బ్రిక్స్‌లో మరి కొన్ని దేశాలను చేర్చుకోవడం ద్వారా దీనిని మరింత విస్తరిస్తామన్నారు. కొత్త రాజకీయ, ఆర్థిక వాస్తవికతలకు అనుగుణంగా బహుళ ధ్రువ లేదా బహుళ పాక్షిక ప్రపంచ క్రమం రూపుదిద్దుకుంటున్న క్రమంలో బ్రిక్స్‌కు చాలా కీలక పాత్ర ఉందని అన్నారు.



శతక మంధాన!

- దక్షిణాఫ్రికాపై భారత్ ఘన విజయం
- రాణించిన ఆశా శోభన, దీప్తి శర్మ
- సఫారీ, భారత మహిళల తొలి వన్డే

నవతెలంగాణ-బెంగళూర్

దక్షిణాఫ్రికా, భారత మహిళల తొలి వన్డేలో టీమ్ ఇండియా ఘన విజయం సాధించింది. సఫారీ అమ్మాయిలపై 143 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం నమోదు చేసింది. స్మృతీ మంధాన (117, 127 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్) శతక గర్జన చేసింది. 12 ఫోర్లు, ఓ సిక్సర్‌తో చెలరేగిన మంధాన దక్షిణాఫ్రికా బౌలర్లను ఉతికారేసింది. దీప్తి శర్మ (37, 48 బంతుల్లో 3 ఫోర్లు), పూజ వస్త్రాకర్ (31, 42 బంతుల్లో 3 ఫోర్లు) లోయర్ ఆర్డర్‌లో కీలక ఇన్నింగ్స్‌లు నమోదు చేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసింది. యువ ఓపెనర్ షెఫాలీ వర్మ (7), హేమలత (12) సహా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (10), జెమీమా రొడ్రిగస్ (17), రిచా ఘోష్ (3) విఫలమయ్యారు. ఓ ఎండ్‌లో నిలబడిన స్మృతీ మంధాన ఇన్నింగ్స్‌కు ముందుకు నడిపించింది. మంధాన లోయర్ ఆర్డర్‌లో దీప్తి శర్మ, పూజ వస్త్రాకర్‌లు చక్కటి సహకారం అందించారు. సఫారీ బౌలర్లలో ఆయబోంగ (3/47), క్లాస్ (2/51) రాణించారు. ఇక భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా అమ్మాయిలు చేతులెత్తేశారు. లెగ్ స్పిన్నర్ ఆశా శోభన (4/21) మాయజాలానికి దీప్తి శర్మ (2/10) సైతం తోడైంది. దీంతో 37.4 ఓవర్లలో 122 పరుగులకే దక్షిణాఫ్రికా ఆలౌటైంది. సఫారీ బ్యాటర్లలో సునె లస్ (33), మారిజానె కాప్ (24), జాఫ్టా (27 నాటౌట్) ఫర్వాలేదనిపించారు. భారత ఓపెనర్ స్మృతీ మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0తో ముందంజ వేసింది. ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్స్‌లో హర్మన్‌ప్రీత్ సేన రెండు పాయింట్లు సైతం ఖాతాలో వేసుకుంది.

సూపర్8కు ఇంగ్లాండ్

- నమీబియాపై 41 పరుగులతో గెలుపు
- వరుణుడు భయపెట్టినా గట్టెక్కిన ఇంగ్లాండ్

నార్త్‌సౌండ్ : గ్రూప్ దశలో వరుణుడి ఆటతోనే సూపర్8 సమీకరణాలు మారిపోగా.. కీలక చివరి మ్యాచ్‌లోనూ వరుణుడు అదే పని చేసేలా కనిపించాడు. గ్రూప్-బిలో నమీబియా, ఇంగ్లాండ్ మ్యాచ్‌తో వరుణుడు ఓ ఆట ఆడుకున్నాడు. సూపర్8కు చేరేందుకు తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో ఆట సాధ్యం కాకపోతే డిఫెండింగ్ చాంపియన్ ఇంటి బాట పట్టాల్సిన దుస్థితి. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఆట మొదలైనా.. మళ్లీ వర్షంతో అడ్డంకులు.. మళ్లీ సవరించిన ఓవర్లతో ఇలా సాగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ పైచేయి సాధించింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నమీబియాపై 41 పరుగులతో భారీ విజయం నమోదు చేసింది. గ్రూప్-బి నుంచి సూపర్8కు చేరుకున్న రెండో జట్టుగా నిలిచింది.

తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 10 ఓవర్లలో 122/5 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ సాగుతుండగా వర్షం అంతరాయంతో 11 ఓవర్ల మ్యాచ్‌ను 10 ఓవర్లకు కుదించారు. ఫిల్ సాల్ట్ (11), జోశ్ బట్లర్ (0) నిరాశపరచగా ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ నెమ్మదిగా మొదలైంది. జానీ బెయిర్‌స్టో (31, 18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), హ్యారీ బ్రూక్ (47 నాటౌట్, 20 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఇంగ్లాండ్‌కు భారీ స్కోరు అందించారు. మోయిన్ అలీ (16), లియాం లివింగ్‌స్టోన్ (13) ధనాధన్ ఇన్నింగ్స్‌లు ఆడారు. బ్రూక్ అజేయ ఇన్నింగ్స్‌తో ఇంగాండ్‌కు గెలుపు స్కోరు సాధించాడు.




ఛేదనలో నమీబియా లక్ష్యాన్ని డక్‌వర్త్ పద్ధతిలో 10 ఓవర్లకు 126 పరుగులుగా సవరించారు. 10 ఓవర్లలో నమీబియా 3 వికెట్లకు 84 పరుగులే చేసింది. మైకల్ వాన్ (33), నికోలస్ (18), డెవిడ్ వైసీ (27) ఆకట్టుకున్నారు. హ్యారీ బ్రూక్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

స్టొయినిస్ మెరువగా..!

స్కాట్లాండ్‌పై ఆసీస్ విజయం

గ్రాస్‌ఐలెట్ : అగ్రజట్టు ఆస్ట్రేలియాను పసికూన స్కాట్లాండ్ భయపెట్టింది. 181 పరుగుల ఛేదనలో ఆస్ట్రేలియా ఓ దశలో 60/3తో కష్టాల్లో కూరుకుంది. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (68, 49 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), మార్కస్ స్టొయినిస్ (59, 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో ఆసీస్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 19.4 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. డెవిడ్ వార్నర్ (1),



మిచెల్ మార్ష్ (8), గ్లెన్ మాక్స్‌వెల్ (11) విఫలమయ్యారు. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ ఓ ఎండ్‌లో దంచికొట్టగా.. ఆఖర్లో మార్కస్ స్టొయినిస్ మెరిశాడు. టిమ్ డెవిడ్ (24 నాటౌట్), మాథ్యూ వేడ్ (4 నాటౌట్) లాంఛనం ముగించారు. తొలుత బ్యాటింగ్ చేసిన స్కాటాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. బ్రాండన్ మెక్‌ములన్ (60, 34 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) అర్థ సెంచరీతో కదంతొక్కగా.. జార్జ్ మున్సె (35), రిచీ బెరింగ్టన్ (42 నాటౌట్) రాణించారు. మార్కస్ స్టొయినిస్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. గ్రూప్-బి నుంచి ఆస్ట్రేలియా అగ్రస్థానంతో సూపర్8కు చేరుకుంది.



డేంజర్ బెల్స్..

తెలుగు రాష్ట్రాల్లో ఓ వెలుగు వెలిగిన సింగిల్ థియేటర్లు మల్టీప్లెక్స్‌ల ధాటికి నిలువలేకపోతున్నాయి. ఓటీటీల ప్రభావంతో మరింత ప్రమాదంలో పడుతున్నాయి. దీంతో వీటి మనుగడ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

కలెక్షన్లకి మంచి సీజన్ అయిన సమ్మర్ సీజన్‌లో రెండు తెలుగు రాష్ట్రాల్లో రెండు వారాల పాటు సింగిల్ థియేటర్లని ఎగ్జిబిటర్లు మూసివేశారు. భారీ ఉష్ణోగ్రతలతో ఎండలు ఉండటం, ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు, దేశంలో, రాష్ట్రంలో ఎన్నికల హడావుడి వంటి పలు కారణాలతో పాటు పెద్ద సినిమాల విడుదల లేకపోవడంతో ప్రేక్షకులు చిన్న సినిమాలను చూసేందుకు ఆసక్తి చూపించలేదు. దీంతో గత్యంతరం లేక రెండు వారాల పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ థియేటర్లను ఎగ్జిబిటర్లు మూసివేశారు. థియేటర్ల మెయింటనెన్స్ ఛార్జీలు కూడా రాకపోవడంతో మూసివేసినట్లు ఎగ్జిబిటర్లు తెలిపారు. అయితే ఇది పూర్తిగా ఎగ్జిబిటర్ల వ్యక్తిగత నిర్ణయమని ఫిల్మ్ ఛాంబర్ తెలిపినప్పటికీ సింగిల్ థియేటర్లకి డేంజర్ బెల్స్ మోగుతున్నాయని చెప్పకనే చెప్పింది. పెద్ద సినిమాల హడావుడి లేని సమయంలో చిన్న సినిమాలు రిలీజ్ అవుతుంటాయి. పైగా ఇవి సింగిల్ థియేటర్లలోనే అధికంగా ప్రదర్శితమవుతాయి. ఈ సమ్మర్‌లో చాలా చిన్న సినిమాలు రిలీజ్ అయినప్పటికీ పైన పేర్కొన్న కారణాలతో వీటిపై ప్రేక్షకులు నిరాశక్తి చూపారు. దీంతో ఒక్కో థియేటర్‌కు రోజుకు రూ.12వేల నుంచి రూ.18వేల వరకు అయ్యే ఖర్చులో పదిశాతం కూడా రాలేదని, సినిమా ప్రదర్శన బంద్ చేస్తే నాలుగు వేల రూపాయలు నష్టం వస్తుందని, అదే ప్రదర్శిస్తే ఆరు వేల రూపాయల వరకు నష్టం వస్తుందని ఎగ్జిబిటర్లు వాపోయారు. ఒకప్పుడు హైదరాబాద్‌లో ఒకటి రెండు మల్టీప్లెక్సులు తప్ప అన్నీ సింగిల్ థియేటర్లే ఉండేవి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రేక్షకులకు విస్తృతమైన వినోదాన్ని పంచేవి. క్లాస్, మాస్ ప్రేక్షకులతో సింగిల్ థియేటర్లలో ఈలలు, అరుపులతో థియేటర్లు హోరెత్తేవి. సినిమా చూసేవారిలో జోష్ నింపేవి. ఇక పండగల సమయంలో, ఏదైనా ప్రత్యేక సందర్భాల్లో లభించిన సెలవుల్లో ఫ్యామిలీతో కలిసి థియేటర్‌కి వెళ్లి సినిమా చూసేవారు. థియేటర్లలో పండగ వాతావరణం కనిపించేది. నిత్యం ప్రేక్షకులతో కళకళలాడేవి. అలాంటివి ఇప్పుడు వెలవెలబోతున్నాయి. ఆధునిక టెక్నాలజీ పుణ్యమా అని సెల్ ఫోన్ వచ్చాక ఎంటర్‌టైన్‌మెంట్ లెక్కలను మార్చేసి, వినోదం అంటే కేవలం సినిమానే కాదు అని కుండ బద్దలుకొట్టినట్టు తెలిపింది. ఇక కరోనా లాక్‌డౌన్ తర్వాత ఓటీటీలు విజృంభించాయి.


ప్రపంచ సినిమా సెల్‌ఫోన్ రూపంలో అరచేతుల్లోకి వచ్చింది. కావాల్సిన సినిమాని నచ్చిన టైమ్‌లో, నచ్చినట్టుగా చూస్తున్నారు. దీంతో థియేటర్‌కి వెళ్ళి సినిమా చూడాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో క్రమంగా తగ్గిపోయింది. అలాగే వరల్డ్ సినిమాని చూసే క్రమంలో ప్రేక్షకుల్లోనూ కంటెంట్ క్వాలిటీ విషయంలో ఎక్కువగా అంచనాలు ఏర్పడుతున్నాయి. కంటెంట్ బాగుందనే టాక్ వస్తే తప్ప ప్రేక్షకులు ఇప్పుడు థియేటర్లకి రావడం లేదు. దీనికితోడు పెరుగుతున్న టిక్కెట్ ధరలు సైతం ప్రేక్షకుల్ని బెంబేలెత్తిస్తున్నాయి.

ఇక సోషల్ మీడియా (ట్విట్టర్, ఫేస్ బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్), క్రికెట్ మ్యాచ్‌లు, మ్యూజిక్ యాప్స్, ఆన్‌లైన్ గేమ్స్ వంటివి సినిమా వినోదానికి గట్టి సవాలు విసురుతున్నాయి. అలాగే థియేటర్ల విషయంలో కూడా ఇప్పుడు ట్రెండ్ మారింది. మల్టీప్లెక్స్‌ల హవా రోజు రోజుకి పెరుగుతోంది. అత్యాధునిక సాంకేతిక హంగులతో ఉంటున్న ఈ మల్టీప్లెక్స్‌లు సైతం సింగిల్ థియేటర్ల వ్యవస్థకి పెనుముప్పుగా మారాయి. చిన్న పిల్లలకు గేమ్స్, పెద్దలకు షాపింగ్ మాల్స్ ఇలా అన్ని రకాలుగా వసతులు, వినోద మాధ్యమాలు మల్టీప్లెక్సుల్లో ఉండటంతో ప్రేక్షకులు వీటికే ఎక్కువ మొగ్గుచూపుతున్నారు. అందుకే సింగిల్ థియేటర్లు సైతం నెమ్మదిగా మల్టీప్లెక్సులుగా, లేదంటే షాపింగ్ మాల్స్‌గా, గోడౌన్స్‌గా మారిపోతున్నాయి. ఇదిలా ఉంటే, రెండు తెలుగు రాష్ట్రల్లోని సింగిల్ థియేటర్లను తమ చెక్కు చేతల్లో పెట్టుకోవాలని కొంతమంది బడా నిర్మాతలు చూస్తున్నారు. సింగిల్ థియేటర్ల యజమానులు తమకి సహకరించకపోతే పెద్ద సినిమాల రిలీజ్‌కి నిరాకరిస్తున్నారని పలు సందర్భాల్లో ఎగ్జిబిటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి భిన్న కారణాలతో సింగిల్ థియేటర్లు ముమ్ముందు కనుమరుగయ్యే పరిస్థితి పుష్కలంగా ఉందని వేరే చెప్పక్కర్లేదు. ఈ డేంజర్ బెల్స్‌ని తట్టుకుని సింగిల్ థియేటర్లు మళ్ళీ తమ పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని ఆశిద్దాం.

- అయితగోని రాజు

నవచిత్రం

నవ్విస్తూ భయపెట్టే మంచి దెయ్యం



నందిత శ్వేత

వెన్నెల కిషోర్, నందితా శ్వేత ప్రధాన పాత్రల్లో నటించిన హర్రర్, కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓఎమ్‌జీ' (ఓ మంచి ఘోస్ట్). మార్క్‌సెట్ నెట్‌వర్క్స్ బ్యానర్ పై డా.అబినికా ఇనాబతుని నిర్మించిన ఈ చిత్రానికి శంకర్ మార్తాండ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఈనెల 21న రాబోతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.
'ఈ బంగ్లాలో ఒక అమ్మాయిని చంపేశారు.. ఆ అమ్మాయే దెయ్యంగా మారి అందరినీ చంపేస్తోందని కథలుకథలుగా చెప్పుకుంటున్నారు' అనే డైలాగ్‌తో ట్రైలర్ ఆరంభమైంది. 'అందరి సమస్యలు వేరే అయినా వాటికి పరిష్కారం మాత్రం డబ్బు'.. అని ఓ గ్యాంగ్ పిశాచీపురంలోకి ఎంటర్ అవ్వడంతో ట్రైలర్‌లో ఫన్ ఎలిమెంట్స్ స్టార్ట్ అయ్యాయి. 'ఇప్పటి వరకు ఆటాడితే ఎలా ఉంటుందో చూశారు.. ఇప్పుడు వేటాడితే ఎలా ఉంటుందో చూపిద్దాం..' అంటూ అసలైన హర్రర్ బొమ్మని చూపించారు. ఈ ట్రైలర్ చూస్తుంటే ఎంతలా నవ్విస్తారో.. అంతలా భయపెట్టించేలా ఉన్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం ఈ చిత్రానికి మేజర్ అస్సెట్ కానుంది. సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్



సినిమా రంగంలోని అన్ని విభాగాలలో మంచి ప్రతిభ చూపినవారిని మరింత ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా విశ్వ విఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారకరామారావు పేరిట కళా వేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డులను బహూకరించనున్నారు.
ఈనెల 29న హైదరాబాద్‌లోని హోటల్ దసపల్లాలో ఈ అవార్డుల వేడుక 'కళావేదిక' (ఆర్.వి.రమణ మూర్తి), 'రాఘవి మీడియా' ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఈ అవార్డుల పోస్టర్‌ని లాంచ్ చేశారు.
సినిమా రంగానికి చెందిన అతిరథ మహారథులు పాల్గొనే ఈ వేడుకలో ఎన్టీఆర్ అభిమానులతోపాటు ప్రజలందర్నీ ఆహ్వానిస్తున్నట్టు అవార్డుల నిర్వాహకులు పేర్కొన్నారు.

భిన్న కథతో నిమ్మకూరు మాస్టారు

ప్రముఖ సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్ చంద్ర మనవడు శ్యామ్ సెల్వన్‌ను హీరోగా పరిచయం చేస్తూ... రాజేంద్ర ప్రసాద్ టైటిల్ పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'నిమ్మకూరు మాస్టారు'.
జె.ఎమ్.సినీ ఫ్యాక్టరీ పతాకంపై జె.ఎమ్. ప్రదీప్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి అముదేశ్వర్ దర్శకుడు. మాధవపెద్ది సురేష్ చంద్ర సంగీత సారథ్యం వహిస్తున్న ఈ చిత్రంలోని అన్ని పాటలకు గీత రచయిత జొన్నవిత్తుల సాహిత్యం సమకూరుస్తున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవం ఆదివారం అన్నపూర్ణ స్టూడియోలో వైభవంగా జరిగింది. రాజేంద్ర ప్రసాద్ సహా యూనిట్ సభ్యులందరూ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హీరో శ్యామ్ సెల్వన్ పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర రవాణ శాఖామాత్యులు పొన్నం ప్రభాకర్ క్లాప్ కొట్టి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.



శ్యామ్ సెల్వన్, పొన్నం ప్రభాకర్

తమ కుటుంబం నుంచి ఐదో తరం వాడైన తన మనవడు శ్యామ్ సెల్వన్ హీరోగా పరిచయం అవుతుండడం గర్వంగా ఉందన్నారు మాధవపెద్ది సురేష్ చంద్ర. ఒక గొప్ప ఉదాత్తమైన కథాంశంతో రూపొందుతున్న

రూపొందుతున్న ఈ చిత్రం జాతీయ స్థాయి అవార్డులు గెలుచుకోవడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఈ చిత్రంలో సంగీతానికి చాలా ప్రాధాన్యత ఉందని జొన్న విత్తుల తెలిపారు. ఇందులో పాటలన్నీ అద్భుతంగా ఉంటాయని, ముఖ్యంగా ఒక పాట చిరస్థాయిగా నిలిచి పోతుందని ఆయన అన్నారు. మాధవపెద్ది ఇప్పటివరకు చేసిన సినిమాలు, కూర్చిన పాటలు ఒక ఎత్తు.. మనవడి పరిచయ చిత్రమైన ఈ సినిమా మరొక ఎత్తు కానుందని జొన్నవిత్తుల తెలిపారు.
రాజేంద్ర ప్రసాద్ వంటి లెజెండ్‌తో స్క్రీన్ షేర్ చేసుకోనుండడం ఎంతో ఉద్వేగంగా ఉందని హీరో శ్యామ్ సెల్వన్ అన్నారు.
మాధవపెద్ది, జొన్నవిత్తుల, రాజేంద్రప్రసాద్ వంటి హేమా హేమీలతో ఇలాంటి గొప్ప చిత్రాన్ని నిర్మించే అవకాశం లభించడం అదృష్టంగా, గౌరవంగా భావిస్తున్నానని నిర్మాత జె.ఎమ్.ప్రదీప్ చెప్పారు.
తమిళంలో శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో ప్రభు - కమల్ హాసన్‌తో ఓ సూపర్ హిట్ చిత్రానికి దర్శకత్వం వహించిన తాను ఈ చిత్రంతో తెలుగులో ప్రవేశించే అవకాశం లభించడం గర్వంగా ఉందని, ఈనెల 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని, రాజమండ్రిలో ఒక షెడ్యూల్ చేస్తున్నామని దర్శకుడు అముదేశ్వర్ తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.